

ప్రజావీక్షణం
దినపత్రిక

ఎడిటర్ : కె. శ్రావణ్ కుమార్

PJV ప్రజా వీక్షణం టీవి

Subscribe

www.prajaveekshanam.in సంపుటి:16 సంచిక :341 05 గురువారం నవంబర్2026 పేజీలు : 08 వెల:రూ.2/-

Published from : Vijayawada, Krishna, Guntur, Kakinada, Vishakhapatnam, Vijayanagaram, Prakasham, Kadapa, Kurnool, Tirupathi, Anantapur, East Godavari, West Godavari

ఢిల్లీ నాయకుల ముందు రాష్ట్ర నేతలు వణికిపోతున్నారు:

కేటీఆర్ ఘాటు విమర్శలు

02 02



-కాంగ్రెస్, బీజేపీలపై కేటీఆర్ ఘాటు విమర్శలు

-కాంగ్రెస్ సంచులు మోసే పార్టీ, బీజేపీ చెప్పులు మోసే పార్టీ అంటూ ఘాటు వ్యాఖ్యలు

-తెలంగాణకు కేంద్రం ఏం ఇచ్చిందని అమిత్ షాను ప్రశ్నించిన కేటీఆర్

-రేవంత్‌రెడ్డి ఢిల్లీ పర్యటనలపై విమర్శలు

సదర్ వేడుకల్లో సీఎం రేవంత్..
యాదవులకు కీలక హామీలు







సోషల్ మీడియాలో కాదు..
దమ్ముంటే సభలో చర్చకు రండి: రాహుల్‌కు నిర్మల సవాల్



-మోదీ బహిరంగ చర్చకు రావాలన్న గాంధీ

-ఘాటుగా స్పందించిన కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్

-చర్చలకు సరైన వేదిక పార్లమెంట్ అని స్పష్టీకరణ

-సమాధానాలు వినకుండా సభ నుంచి వాకౌట్ చేయడంపై విమర్శలు

-ఆధారాలతో చర్చకు వచ్చి, ప్రజాస్వామ్య సంస్థలను గౌరవించాలని సూచన

బహిరంగ చర్చకు ప్రధానమంత్రి నరేంద్రమోదీ సిద్ధమా? అంటూ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ విసిరిన సవాల్‌పై కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ స్పందించారు. చర్చలకు సరైన వేదిక పార్లమెంట్ అని, సోషల్ మీడియా కాదని తేల్చిచెప్పారు. మిగతా 2 లో

తెలంగాణను గ్లోబల్ టెక్నాలజీ హబ్‌గా తీర్చిదిద్దడమే లక్ష్యం:



తెలంగాణను 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దడమే తమ ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క వ్యాఖ్యానించారు.రాష్ట్ర ఆర్థిక ప్రగతిలో డీప్‌టెక్, సాంకేతిక ఆవిష్కరణలు కీలక పాత్ర పోషించాలని సూచించారు. మిగతా 2 లో

అగ్నివీరులకు మరో రెండేళ్లు సర్వీసు పొడిగింపు..



కేంద్రం కీలక నిర్ణయం

-నాలుగేళ్ల తర్వాత బయటకు వెళ్లాల్సిన 75 శాతం మందికి వెసులుబాటు

-పొడిగింపు తర్వాతా శాశ్వత సర్వీసుకు అవకాశం

-ప్రతిభ ఆధారంగా శాశ్వత నియామకాలు

-రాత పరీక్ష తర్వాతే శారీరక పరీక్ష.. నైపుణ్య ధ్రువపత్రాలు

-తొలి బ్యాచ్ సర్వీసు గడువు డిసెంబరులో ముగింపు

పురపోరులో జనసేన ప్రభంజనం.. మరోసారి 100% స్ట్రైక్‌రేట్!

-పురపాలక ఎన్నికల్లో జనసేన పార్టీకి 100 శాతం స్ట్రైక్ రేట్

-విజయవాడ, ఏలూరు మేయర్ పీఠాలు కైవసం

-పవన్ కల్యాణ్ నియోజకవర్గం పిఠాపురంలోనూ జనసేన జయకేతనం

-పోటీ చేసిన 20కి 20 స్థానాల్లోనూ జనసేన అభ్యర్థుల గెలుపు

-విజయవాడ మేయర్‌గా వంగవీటి రాధాకృష్ణ ఘన విజయం

ఏపీ రాజకీయాల్లో జనసేన పార్టీ తన విజయ పరంపరను కొనసాగిస్తోంది. సార్వత్రిక ఎన్నికల్లో అద్భుతమైన ప్రదర్శన కనబరిచిన జనసేన, తాజాగా జరిగిన కార్పొరేషన్లు, మున్సిపాలిటీలు, నగర పంచాయతీ ఎన్నికల్లోనూ అదే జోరును ప్రదర్శించింది. ఏకంగా 100 శాతం స్ట్రైక్ రేట్‌తో అద్భుత విజయాన్ని నమోదు చేసింది. మిగతా 2 లో





ఎన్నికల కమిషనర్లకు జీవితకాల చట్టపరమైన రక్షణ..
సుప్రీంకోర్టులో పిటిషన్


ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ), ఇతర ఎన్నికల కమిషనర్లకు జీవితకాల చట్టపరమైన రక్షణ కల్పించే నిబంధనను సవాలు చేస్తూ సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలైంది. 2023 నాటి ప్రధాన ఎన్నికల కమిషనర్, ఇతర ఎన్నికల కమిషనర్ల నియామక చట్టంలోని సెక్షన్ 16 రాజ్యాంగబద్ధతను సవాలు చేస్తూ పిటిషనర్ అరుణ్ కుమార్ అగర్వాల్ న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. ఈ పిటిషన్‌పై స్పందన తెలియజేయాలని కేంద్ర ప్రభుత్వానికి, భారత ఎన్నికల సంఘానికి సుప్రీంకోర్టు నోటీసులు జారీ చేసింది 2023లో కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన 'చీఫ్ ఎలక్షన్ కమిషనర్ అండ్ అదర్ ఎలక్షన్ కమిషనర్స్ యాక్ట్'లోని సెక్షన్ 16 ఇప్పుడు వివాదానికి కారణమైంది. మిగతా 2 లో

వాంగ్‌చుక్ సంస్థకు లడఖ్ సర్కార్ షాక్..
స్కూల్ కార్యకలాపాలు నిలిపివేయాలని నోటీసు

-సోనమ్ వాంగ్‌చుక్ సంస్థకు చెందిన పాఠశాలను నిలిపివేయాలని లడఖ్ సర్కార్ ఆదేశం

-అవసరమైన అనుమతులు లేకుండా తరగతులు నిర్వహిస్తున్నారని నోటీసులో వెల్లడి

-భూ కేటాయింపుల వివాదం హైకోర్టులో ఉండగానే ఈ తాజా పరిణామం



లడఖ్‌లో ప్రముఖ పర్యావరణ ఉద్యమకారుడు సోనమ్ వాంగ్‌చుక్ కు మరో ఎదురుదెబ్బ తగిలింది. ఆయనకు చెందిన హిమాలయన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఆల్టర్నేటివ్స్, లడఖ్ ఆధ్వర్యంలోని 'డెసర్ట్ ఫ్లవర్ స్కూల్' కార్యకలాపాలను తక్షణమే నిలిపివేయాలని లడఖ్ కేంద్రపాలిత ప్రాంత ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. అవసరమైన అనుమతులు లేకుండా పాఠశాలను ప్రారంభించారని ఆరోపిస్తూ లేహ్ తహసీల్దార్ ఈ నోటీసులు జారీ చేశారు. మిగతా 2 లో



అమెరికా కాంగ్రెస్‌లో డెమోక్రాట్‌ల ఆధిపత్యం..
వీటో అంటూ ట్రంప్ సంచలన పోస్ట్..

అమెరికా మధ్యంతర ఎన్నికల్లో డెమోక్రాట్‌లు ఘన విజయం సాధించారు. సెనేట్‌తో పాటు ప్రతినిధుల సభలోనూ మెజారిటీ సాధించి రిపబ్లికన్‌ల ఆధిపత్యానికి తెరదించారు. దీంతో అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌నకు రాజకీయంగా కీలక సవాలు ఎదురుకానుంది.అమెరికా కాంగ్రెస్‌లో డెమోక్రాట్‌ల ఆధిపత్యం.. వీటో అంటూ ట్రంప్ సంచలన పోస్ట్..ఇంటర్నెట్ డెస్క్: అమెరికా మధ్యంతర ఎన్నికల్లో డెమోక్రాట్‌లు ఘన విజయం సాధించారు. మిగతా 2 లో

ప్రజావీక్షణం
దినపత్రిక

అగ్నివీరులకు మరో రెండేళ్లు సర్వీసు పొడిగింపు.. కేంద్రం కీలక నిర్ణయం

మొదటిపేజీ తరువాయి

అగ్నిపథ్ పథకం కింద సైన్యంలో చేరిన అగ్నివీరులకు కేంద్ర ప్రభుత్వం కీలక వెసులుబాటు కల్పించింది. ఇప్పటికే ఉన్న నాలుగేళ్ల సర్వీసుకు అదనంగా మరో రెండేళ్లు పొడిగించాలని నిర్ణయించింది. తొలి బ్యాచ్ అగ్నివీరుల పదవీకాలం ముగియనున్న తరుణంలో ఈ పరిణామం ప్రాధాన్యం సంతరించుకుంది.ఈ నిర్ణయం ప్రకారం, నాలుగేళ్ల సేవ తర్వాత సాధారణ విధానంలో శాశ్వత సైనికులుగా ఎంపిక కాని మిగిలిన 75 శాతం అగ్నివీరులకు మరో రెండేళ్లు పనిచేసే అవకాశం లభించనుంది. ఈ పొడిగించిన సేవ పూర్తయ్యాక కూడా ప్రతిభ ఆధారంగా సాధారణ సైనిక విభాగంలో చేరేందుకు అవకాశం కల్పిస్తామని చీఫ్ ఆఫ్ డిఫెన్స్ స్టాఫ్ జనరల్ ఎన్.ఎస్. రాజా సుబ్రమణి వెల్లడించారు.అగ్నిపథ్ పథకం 2022లో ప్రారంభమైంది. ప్రస్తుతం ఈ పథకం కింద సైన్యం, నౌకాదళం, వాయుసేనల్లో నాలుగేళ్ల కాలానికి నియామకాలు చేపడుతున్నారు. ఈ గడువు ముగిసిన తర్వాత ప్రతి బ్యాచ్‌లో గరిష్ఠంగా 25 శాతం మందిని ప్రతిభ, సైనిక దళాల అవసరాల ఆధారంగా సాధారణ సర్వీసులో కొనసాగించే అవకాశం ఉంది. మిగిలినవారు విధుల నుంచి వైదొలగాల్సి వచ్చేది. తాజా నిర్ణయంతో వారికి అదనపు సేవా అవకాశం లభించనుంది. నియామక ప్రక్రియలోనూ మార్పులు ప్రకటించారు. ఇకపై శారీరక పరీక్షకు ముందుగా రాత పరీక్ష నిర్వహించనున్నారు. సైన్యంలో పనిచేసిన సమయంలో అగ్నివీరులు పొందిన శిక్షణ, నైపుణ్యాలను గుర్తిస్తూ ధ్రువపత్రాలు కూడా అందించనున్నారు. తొలి బ్యాచ్‌లో సుమారు 18 వేల మంది అగ్నివీరుల నాలుగేళ్ల సర్వీసు గడువు 2026 డిసెంబరులో ముగియనుండటంతో ఈ నిర్ణయం ప్రాధాన్యం సంతరించుకుంది.

సోషల్ మీడియాలో కాదు.. దమ్ముంటే సభలో చర్చకు రండి: రాహుల్‌కు నిర్మల సవాల్

మొదటిపేజీ తరువాయి

"రాహుల్ జీ, చర్చకు వేదికను ఎంచుకోమని మీరు ప్రధానిని కోరుతున్నారు. దానికి ఇప్పటికే ఒక వేదిక ఉంది, అదే పార్లమెంట్. దానికి మీరే ప్రతిపక్ష నాయకుడిగా ఉన్నారు" అని నిర్మల పేర్కొన్నారు. ఎలక్టోరల్ రోల్స్ ప్రత్యేక సవరణ (ఎస్ఐఆర్), ఈవీఎంల పనితీరుపై చర్చించేందుకు పార్లమెంటులో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేద్దామని హోంమంత్రి అమిత్ షా సోమవారమే ప్రతిపాదించిన విషయాన్ని ఆమె గుర్తుచేశారు. "సోషల్ మీడియాలో సవాళ్లు విసిరినంత ఉత్సాహం పార్లమెంటులో చర్చకు ఎందుకు చూపించడం లేదు?" అని ఆమె ప్రశ్నించారు.ప్రభుత్వం సమాధానం చెప్పేందుకు ప్రయత్నించిన ప్రతిసారీ కాంగ్రెస్, ఇండియా కూటమి నేతలు సభ నుంచి వాకౌట్ చేస్తున్నారని నిర్మలా సీతారామన్ ఆరోపించారు. "సమాధానాలు డిమాండ్ చేసేటప్పుడు, వాటిని వినే బాధ్యత కూడా ఉంటుంది. ఎన్నోసార్లు మీరు, మీ పార్టీ సభ్యులు ప్రభుత్వం స్పందిస్తున్న సమయంలోనే సభ నుంచి వాకౌట్ చేశారు. అలాంటప్పుడు చర్చకు అంత ఆసక్తిగా ఉన్నామని ఎలా చెప్పుకుంటారు?" అని ఆమె నిలదీశారు.ప్రతిపక్షాల ఆందోళనలతో పార్లమెంట్ సమావేశాలు పూర్తిగా తుడిచిపెట్టుకుపోతున్నాయని ఆమె విమర్శించారు. "మీకు చర్చపై నిజంగా అంత ఆసక్తి ఉంటే, ముందు పార్లమెంట్ కార్యకలాపాలు సజావుగా సాగేలా సహకరించవచ్చు కదా?" అని ప్రశ్నించారు. ఇటీవల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నివాసంలో నిర్వహించిన "మాక్ పార్లమెంట్" కార్యక్రమాన్ని కూడా ఆమె తప్పుబట్టారు. అది "మాక్ పార్లమెంట్" కన్నా "పార్లమెంటును అపహాస్యం చేయడం"లా ఉందని ఎద్దేవా చేశారు.ప్రజాస్వామ్యం, రాజ్యాంగం గురించి మాట్లాడేవారు ముందుగా ప్రజాస్వామ్య సంస్థలను గౌరవించాలని హితవు పలికారు. "'దరో మత్' (భయపడొద్దు) అని మీరు అంటుంటారు కదా. అలాంటప్పుడు వాస్తవాలతో, ఆధారాలతో సభకు రండి, విమర్శలను ఎదుర్కోండి, సమాధానాలు వినడానికి కూర్చోండి" అని రాహుల్ గాంధీకి నిర్మలా సీతారామన్ సవాల్ విసిరారు.

ఎన్నికల కమిషనర్లకు జీవితకాల చట్టపరమైన రక్షణ.. సుప్రీంకోర్టులో పిటిషన్

మొదటిపేజీ తరువాయి

ఈ నిబంధన ప్రకారం.. సీఈసీ లేదా ఎన్నికల కమిషనర్ అధికారిక విధుల నిర్వహణలో చేసిన లేదా మాట్లాడిన విషయాలపై ఎలాంటి సివిల్, క్రిమినల్ కేసులను కోర్టులు స్వీకరించకూడదు. ఇప్పటికే కొనసాగుతున్న కేసులను కూడా కొనసాగించకూడదు. పదవిలో ఉన్నప్పుడే కాకుండా పదవీ విరమణ తర్వాత కూడా ఈ రక్షణ వర్తిస్తుంది. ఈ నిబంధన ఎన్నికల కమిషనర్లకు అవసరానికి మించిన రక్షణ కల్పిస్తోందని పిటిషనర్లు వాదిస్తున్నారు .అధికారిక విధుల పేరుతో తప్పులు చేసినా, దురుద్దేశంతో వ్యవహరించినా, అధికార దుర్వినియోగానికి పాల్పడినా చట్టపరమైన చర్యలు తీసుకోవడం కష్టమవుతుందని పేర్కొంటున్నారు. ఇది రాజ్యాంగంలోని 14, 21వ అధికరణాలతో పాటు రాజ్యాంగ మౌలిక సూత్రాలకు విరుద్ధమని అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని ధర్మాసనం ఈ పిటిషన్లపై విచారణ జరిపింది. ఆర్జేడీ ఎంపీ మనోజ్ ఝా, న్యాయవాది అరుణ్ కుమార్ అగర్వాల్ దాఖలు చేసిన పిటిషన్లపై కేంద్ర ప్రభుత్వం, ఎన్నికల సంఘం సమాధానం ఇవ్వాలని ఆదేశించింది. తదుపరి విచారణను డిసెంబర్ 18కి వాయిదా వేసింది ఓటరు జాబితా నుంచి తప్పుగా పేరు తొలగించినా, అభ్యర్థికి అన్యాయం జరిగినా, ఎన్నికల సంఘంలో అవినీతి జరిగినా బాధితులకు న్యాయపరమైన పరిష్కారం లేకుండా పోతుందని పిటిషనర్ ఆవేదన వ్యక్తం చేశారు. తొలుత 2023 బిల్లులో ఎన్నికల కమిషనర్లకు ఇలాంటి సంపూర్ణ రక్షణ కల్పించే నిబంధన లేదని, అనంతరం బిల్లుకు సవరణ ద్వారా సెక్షన్ 16ను చేర్చారని, ఇందుకు తగిన కారణాలను ప్రభుత్వం వెల్లడించలేదని అభ్యంతరం వ్యక్తం చేశారు. ప్రతిపక్ష ఎంపీలు పెద్ద సంఖ్యలో సస్పెన్షన్‌లో ఉన్న సమయంలో ఈ రక్షణ నిబంధనతో కూడిన బిల్లును పార్లమెంట్ ఆమోదించిందని పిటిషనర్ పేర్కొన్నారు.

సదర్ వేడుకల్లో సీఎం రేవంత్.. యాదవులకు కీలక హామీలు

-సదర్‌ను అధికారికంగా రాష్ట్ర పండుగగా ప్రకటించిన ప్రభుత్వం

-వేడుకల నిర్వహణకు రూ.5 కోట్ల నిధులు కేటాయింపు

-హైదరాబాద్‌లోని గోల్కొండ ఒకనాటి గొల్లంకొండ అని రేవంత్ వ్యాఖ్య

సదర్ సమ్మేళనం కేవలం యాదవ సోదరుల పండుగే కాదని, అది తెలంగాణ ప్రజలందరి ఆత్మగౌరవ సమ్మేళనమని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. ఈరోజు హైదరాబాద్‌లో ఘనంగా నిర్వహించిన సదర్ ఉత్సవాలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై యాదవ సోదరులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా యాదవుల చిరకాల కోరికను నెరవేరుస్తూ.. సదర్ ఉత్సవాలను రాష్ట్ర పండుగగా అధికారికంగా ప్రకటిస్తున్నట్లు సీఎం వెల్లడించారు. వేడుకల నిర్వహణ కోసం రూ. 5 కోట్లు మంజూరు చేసినట్లు తెలిపారు. గతంలో ఏ ముఖ్యమంత్రీ సదర్‌ను రాష్ట్ర పండుగగా ప్రకటించే ఆలోచన చేయలేదని రేవంత్ రెడ్డి విమర్శించారు. హైదరాబాద్‌లోని నేటి గోల్కొండ కోట ఒకనాటి 'గొల్లంకొండ' అని, నగర అభివృద్ధిలో యాదవుల పాత్ర కీలకమని కొనియాడారు. తమ ప్రభుత్వంలో యాదవులకు సముచిత స్థానం కల్పించామని, అనిల్ కుమార్ యాదవ్‌కు రాజ్యసభ, నవీన్ యాదవ్‌కు ఎమ్మెల్యే పదవి ఇచ్చామని గుర్తుచేశారు. యాదగిరిగుట్ట దేవస్థానం బోర్డు సభ్యురాలిగా ఈశ్వరమ్మ యాదవ్‌ను నియమించినట్లు పేర్కొన్నారు.తెలంగాణలో విజయవంతంగా నిర్వహించిన కులగణన దేశానికే ఆదర్శంగా నిలిచిందని, రాబోయే రోజుల్లో యాదవులకు న్యాయమైన వాటా దక్కేలా చూస్తామని రేవంత్ రెడ్డి హామీ ఇచ్చారు. యాదగిరిగుట్టలో గోసంరక్షణకు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. మూసీ పునరుజ్జీవం, మెట్రో విస్తరణ వంటి అభివృద్ధి ప్రాజెక్టులకు యాదవ సోదరులు సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

ఢిల్లీ నాయకుల ముందు రాష్ట్ర నేతలు వణికిపోతున్నారు: కేటీఆర్ ఘాటు విమర్శలు

మొదటిపేజీ తరువాయి

కాంగ్రెస్, బీజేపీ రెండూ తెలంగాణకు అన్యాయం చేస్తున్న పార్టీలేనని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శించారు. ఢిల్లీ నాయకుల ముందు రాష్ట్ర నేతలు వణికిపోతున్నారని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ సంచులు మోసే పార్టీ అయితే.. బీజేపీ చెప్పులు మోసే పార్టీ అంటూ ఘాటు వ్యాఖ్యలు చేశారు. తెలంగాణ భవన్‌లో బుధవారం పలువురు నేతలు బీఆర్ఎస్‌లో చేరిన సందర్భంగా ఆయన మాట్లాడారు. అమిత్ షా హైదరాబాద్‌కు వస్తే బండి సంజయ్ బాడీగార్డ్‌లా వ్యవహరించారని కేటీఆర్ విమర్శించారు. ప్రియాంక గాంధీ భద్రతా సిబ్బంది ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని పక్కకు నెట్టేశారని ఆరోపించారు. కేంద్ర మంత్రి హోదాలో ఉన్న బండి సంజయ్ కరీంనగర్ ప్రజల గౌరవాన్ని దిగజార్చవద్దని హితవు పలికారు. తనకంటే చిన్నవాడైన అమిత్ షాకు రాంచందర్‌రావు కాళ్లకు నమస్కరించడమేంటని ప్రశ్నించారు.అమిత్ షా తెలంగాణకు వచ్చి చేతులు ఊపుకుంటూ వెళ్లిపోయారని, రాష్ట్రానికి ఏం ఇచ్చారని కేటీఆర్ నిలదీశారు. ఒక్క మెట్రో ప్రాజెక్టు, జాతీయ ప్రాజెక్టు లేదా విద్యాసంస్థనైనా మంజూరు చేశారా అని ప్రశ్నించారు. రేవంత్‌రెడ్డి తరచూ ఢిల్లీ పర్యటనలు చేస్తూ రాజకీయ ప్రయోజనాల కోసమే తాపత్రయపడుతున్నారని విమర్శించారు. వారానికి రెండుసార్లు ఢిల్లీకి వెళుతూ ఆయన 'ఈఎంఐ ముఖ్యమంత్రి'గా మారిపోయారని ఎద్దేవా చేశారు. అడవులు నరికే వీరప్పన్‌ను అటవీశాఖ మంత్రిని చేసినట్లుగా.. భూములు అమ్మే బ్రోకర్‌ను ముఖ్యమంత్రిని చేస్తే ఎలా ఉంటుందో అలా ఉందని రేవంత్‌రెడ్డిని ఉద్దేశించి వ్యాఖ్యానించారు.

అమెరికా కాంగ్రెస్‌లో డెమోక్రాట్‌ల ఆధిపత్యం.. వీటో అంటూ ట్రంప్ సంచలన పోస్ట్..

మొదటిపేజీ తరువాయి

సెనేట్‌తో పాటు ప్రతినిధుల సభలోనూ మెజారిటీ సాధించి రిపబ్లికన్‌ల ఆధిపత్యానికి తెరదించారు. దీంతో అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌నకు రాజకీయంగా కీలక సవాలు ఎదురుకానుంది. వచ్చే రెండేళ్ల పాటు ఆయన ప్రభుత్వ నిర్ణయాలపై డెమోక్రాట్‌లు గట్టి నిఘా పెట్టే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో ట్రంప్ తన సోషల్ మీడియా వేదిక ట్రూత్ సోషల్‌లో 'వీటో' అని రాసి ఉన్న ఎరుపు రంగు రిపబ్లికన్ టోపీ ఫోటోను పోస్ట్ చేశారు (ఖూ వీఱస్‌వతీఎ జుశ్రీవష్ఱఅశీఅ =వంబశ్రీం 2026).2026 నవంబర్ 3న జరిగిన మధ్యంతర ఎన్నికల్లో డెమోక్రాట్‌లు అనూహ్య విజయాలు సాధించారు. తాజా లెక్కల ప్రకారం సెనేట్‌లో 100 స్థానాలకు గాను 53 స్థానాలను గెలుచుకున్నారు. ప్రతినిధుల సభలోనూ మెజారిటీకి అవసరమైన 218 స్థానాల మార్కును దాటి 220 స్థానాలను కైవసం చేసుకున్నారు. దీంతో రెండు సభల్లోనూ డెమోక్రాట్‌లకు ఆధిపత్యం లభించింది. టెక్సాస్, కాన్సాస్, సౌత్ కరోలినా వంటి సంప్రదాయ రిపబ్లికన్ ఆధిపత్య రాష్ట్రాల్లోనూ డెమోక్రాట్‌లు విజయాలు సాధించడం ఈ ఎన్నికల్లో ప్రత్యేకతగా నిలిచింది. నార్త్ కరోలినా, ఒహాయో రాష్ట్రాల్లోనూ సెనేట్ స్థానాలను గెలుచుకున్నారు (ణశీఱుశ్రీఎ ఎతీబఎజూ ఎవశీ).

వాంగ్‌చుక్ సంస్థకు లడఖ్ సర్కార్ షాక్..

మొదటిపేజీ తరువాయి

స్కూల్ కార్యకలాపాలు నిలిపివేయాలని నోటీసు

భూ కేటాయింపుల రద్దుపై ఇప్పటికే ఎఱూూ న్యాయస్థానంలో పోరాడుతున్న నేపథ్యంలో ఈ కొత్త వివాదం తెరపైకి వచ్చింది. ఎఱూూ వ్యవస్థాపకురాలు, వాంగ్‌చుక్ భార్య అయిన డాక్టర్ గీతాంజలి జె. అంగ్మోకు ఈ నోటీసులు అందజేశారు. జమ్మూకశ్మీర్, లడఖ్ హైకోర్టులో భూ వివాదంపై కేసు విచారణలో ఉన్నందున, దానిని ప్రభావితం చేసేలా ఎలాంటి చర్యలు చేపట్టవద్దని, యథాతథ స్థితిని కొనసాగించాలని నోటీసులో స్పష్టం చేశారు. పాఠశాల మేనేజింగ్ కమిటీ కోసం నిరభ్యంతర పత్రం (చీూజ) కోరుతూ సెప్టెంబర్ 22న గీతాంజలి దరఖాస్తు చేసుకున్నారని, కానీ ఆ అనుమతులు రాకముందే తరగతులు ప్రారంభించారని ప్రభుత్వం ఆరోపించింది.ఈ వివాదం వెనుక 2018లో ఎఱూూకు ఫ్యాంగ్ థాంగ్‌లో ప్రత్యామ్నాయ విశ్వవిద్యాలయం ఏర్పాటు కోసం భూమిని కేటాయించారు. అయితే, లీజు నిబంధనలు పూర్తి చేయలేదని, విశ్వవిద్యాలయం ఏర్పాటు చేయలేదని ఆరోపిస్తూ 2025 ఆగస్టులో ప్రభుత్వం ఆ కేటాయింపులను రద్దు చేసింది. దీనిపై ఎఱూూ కోర్టును ఆశ్రయించగా, ప్రస్తుతం కేసు విచారణలో ఉంది. ప్రభుత్వ తాజా నోటీసులు నిరాధారమైనవని, దీనికి తాము ఇప్పటికే సమాధానం ఇచ్చామని ఎఱూూ సీఈఓ గీతాంజలి తెలిపారు.

తెలంగాణను గ్లోబల్ టెక్నాలజీ హబ్‌గా తీర్చిదిద్దడమే లక్ష్యం: భట్టి విక్రమార్క

మొదటిపేజీ తరువాయి

డీప్‌టెక్ అభివృద్ధికి హైదరాబాద్‌లో అపారమైన అవకాశాలు ఉన్నాయని భట్టి విక్రమార్క వెల్లడించారు. సాఫ్ట్‌వేర్, ఫార్మా, బయోటెక్, ఏరోస్పేస్ రంగాల సమన్వయంతో ముందడుగు వేస్తున్నామని తెలిపారు. పరిశ్రమలు, పరిశోధకులు, ప్రభుత్వ శాఖల సమన్వయంతో పనిచేయాలని సూచించారు.యువ స్టార్టప్‌లకు ఉమ్మడి పరీక్షా కేంద్రాలు, సులభతర ధ్రువీకరణ విధానాలు అందుబాటులోకి రావాలని ఆకాంక్షించారు. కొత్త ఆవిష్కరణలకు ప్రభుత్వం, పరిశ్రమలు అండగా నిలవాలని అన్నారు. విజయవంతమైన ప్రయోగాలను విస్తృతంగా అమలు చేయాలని సూచించారు. పునరుత్పాదక విద్యుత్ వినియోగం, విద్యుత్ నిల్వ, స్మార్ట్ గ్రిడ్ వ్యవస్థల్లో సాంకేతిక ఆవిష్కరణలను ప్రోత్సహించాలని చెప్పుకొచ్చారు.డీప్‌టెక్ రంగం ద్వారా యువతకు విస్తృత ఉపాధి అవకాశాలు..వైద్య రంగంలో వ్యాధులను ముందుగానే గుర్తించే ఆధునిక సాంకేతిక పరికరాలు అందుబాటులోకి రావాలని భట్టి విక్రమార్క అభిలాషించారు. రైతులకు తక్కువ ఖర్చుతో ఉపయోగపడే సాంకేతిక పరిజ్ఞానాన్ని అభివృద్ధి చేయాలని సూచించారు. సాంకేతిక ఉత్పత్తుల రూపకల్పన దశ నుంచే సామాన్యులకు అందుబాటులోని ధరలను దృష్టిలో పెట్టుకోవాలని పేర్కొన్నారు. డీప్‌టెక్ రంగం ద్వారా యువతకు విస్తృత ఉపాధి అవకాశాలు కల్పించాలని చెప్పారు. చిన్న, మధ్యతరహా పరిశ్రమల ఉత్పాదకత పెంపునకు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం ఉపయోగపడాలని సూచించారు. ఆవిష్కరణల ఫలితాలు ప్రజల ఆదాయాల పెరుగుదల, మెరుగైన ప్రభుత్వ సేవలు, ఉపాధి అవకాశాల రూపంలో కనిపించాలని పేర్కొన్నారు. భారతీయ ఆలోచనలు, ఆవిష్కరణలు ప్రపంచస్థాయి పారిశ్రామిక సంస్థలుగా ఎదగాలని భట్టి విక్రమార్క ఆకాంక్షించారు.

పురపోరులో జనసేన ప్రభంజనం.. మరోసారి 100% స్ట్రైక్‌రేట్!

మొదటిపేజీ తరువాయి

టీడీపీ–జనసేన–బీజేపీ కూటమి పొత్తులో భాగంగా జనసేనకు కేటాయించిన అన్ని స్థానాల్లోనూ జయకేతనం ఎగురవేసింది.కూటమి ఒప్పందం ప్రకారం.. జనసేన పార్టీకి మొత్తం 4 మున్సిపల్ కార్పొరేషన్లు (మేయర్ స్థానాలు), 21 మున్సిపాలిటీలు/నగర పంచాయతీలు (ఛైర్‌పర్సన్ స్థానాలు) దక్కాయి. వీటిలో తాజాగా 2 కార్పొరేషన్లు (విజయవాడ, ఏలూరు), 15 మున్సిపాలిటీలు, 3 నగర పంచాయతీలకు ఎన్నికలు జరిగాయి. ఈ 20 స్థానాల్లోనూ జనసేన అభ్యర్థులే గెలుపొందడం విశేషం. ప్రతిష్ఠాత్మకమైన విజయవాడ మేయర్ అభ్యర్థిగా బరిలోకి దిగిన వంగవీటి రాధాకృష్ణ, ఏలూరు మేయర్ అభ్యర్థిగా పోటీ చేసిన రెడ్డి అప్పలనాయుడు ఘన విజయం సాధించి పార్టీకి కీలక విజయాలను అందించారు. డిప్యూటీ సీఎం, జనసేన అధినేత పవన్ కల్యాణ్ ప్రాతినిధ్యం వహిస్తున్న పిఠాపురం నియోజకవర్గంలోని రెండు మున్సిపాలిటీలను జనసేన కైవసం చేసుకుంది. పిఠాపురం మున్సిపల్ ఛైర్‌పర్సన్‌గా జనసేన అభ్యర్థి దానం లాజర్‌బాబు వైసీపీ అభ్యర్థిపై 9,235 ఓట్ల భారీ మెజారిటీతో గెలుపొందారు. ఇక్కడి 36 వార్డుల్లో 3 జనసేనకు ఏకగ్రీవం కాగా, మిగిలిన వాటిలో జనసేన 16, టీడీపీ 5, బీజేపీ 1, వైసీపీ 1 గెలుచుకున్నాయి. 10 మంది స్వతంత్రులు గెలవగా, వారిలో 8 మంది కూటమి రెబల్స్ కావడం గమనార్హం.రాష్ట్రవ్యాప్తంగా గెలిచిన ఛైర్‌పర్సన్‌లు వీరే: రాష్ట్రవ్యాప్తంగా వివిధ మున్సిపాలిటీలు, నగర పంచాయతీల్లో ఛైర్‌పర్సన్‌లుగా గెలుపొందిన జనసేన అభ్యర్థుల వివరాలు ఈ విధంగా ఉన్నాయి.

అమలాపురం: నల్లా శ్రీధర్
పిఠాపురం: దానం లాజర్ బాబు
తుని: శరగణం శ్రీలత
ముమ్మిడివరం: గుబ్బల గంగా రత్నభవాని
గొల్లప్రోలు: కడారి తమ్మయ్య నాయుడు
సామర్లకోట: పిట్టా జానకి రామారావు
నరసాపురం: కొత్తపల్లి శైలజ
నిడదవోలు: మురాల జ్యోతి
పెడన: నాగలింగ జ్యోత్స్న రాణి
తెనాలి: తోటకూర వెంకట రమణారావు
చిలకలూరిపేట: తోట రాజరాజేశ్వరి
తిరువూరు: పి. మాధవి
పుట్టపర్తి: ఎం. ఈశ్వర్
మడకశిర: గుండుమల శారద
దర్శి: దారం సుబ్బారావు
పుత్తూరు: డి. ఏలుమలై
సాలూరు: గొర్లె విజయకుమారి
పొలకొండ: చల్లా విజయ నిర్మల

మొత్తం మీద సార్వత్రిక ఎన్నికల ఫలితాలను పునరావృతం చేస్తూ స్థానిక సమరంలోనూ జనసేన తన సత్తా చాటింది. ఈ విజయం పార్టీ శ్రేణుల్లో కొత్త ఉత్సాహాన్ని నింపింది. జనసేనకు కేటాయించిన మిగిలిన 2 కార్పొరేషన్లు, 3

ప్రజావీక్షణం
దినపత్రిక
GENERAL NEWS
05 గురువారం నవంబర్ 2026
3
www.prajaveekshanam.in

విద్యార్థులు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంపై ఆచరణాత్మక పట్టు సాధించాలి

-విద్యార్థుల్లో సాంకేతిక నైపుణ్యాల అభివృద్ధికి 'స్కిల్ స్పార్క్ 2.0' దోహదం

-ఏపీ నిట్ డైరెక్టర్ ప్రొఫెసర్, డాక్టర్ కె.వి. కృష్ణారావు

తాడేపల్లిగూడెం ప్రతినిధి నవంబర్ 4 ప్రజా వీక్షణం)

విద్యార్థులు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంపై ఆచరణాత్మక పట్టు సాధించాలని ఏపీ నిట్ డైరెక్టర్, ప్రొఫెసర్ కె.వి. కృష్ణారావు సూచించారు. నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ ఆంధ్రప్రదేశ్ (ఏపీ నిట్)లోని ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్ విభాగం ఆధ్వర్యంలో 'స్కిల్ స్పార్క్ 2.0' అనే అంశంపై బుధవారం ప్రయోగాత్మక సాంకేతిక శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథి ప్రొఫెసర్ కె.వి.కృష్ణారావు మాట్లాడుతూ విద్యార్థులు తరగతి గది బోధనకే పరిమితం కాకుండా, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంపై ప్రాయోగిక అవగాహనను పెంపొందించుకోవాలని సూచించారు. మారుతున్న సాంకేతిక రంగానికి అనుగుణంగా విద్యార్థులు నైపుణ్యాలను అభివృద్ధి చేసుకోవడంతోపాటు, పరిశ్రమల అవసరాలకు తగ్గట్టుగా తమను తాము తీర్చిదిద్దుకోవాలన్నారు. ప్రాజెక్టుల రూపకల్పన, వాటి అమలులో ప్రత్యక్ష అనుభవం సాధించడం ద్వారా విద్యార్థులకు మెరుగైన అవకాశాలు లభిస్తాయని చెప్పారు.ఆధునిక పోటీ ప్రపంచంలో రాణించాలంటే విద్యార్థులు సాంకేతిక పరిజ్ఞానంపై పుస్తక జ్ఞానంతోపాటు, దానిని ఆచరణలో పెట్టగల సామర్థ్యాన్ని కూడా కలిగి ఉండాలని తెలిపారు. విద్యార్థులు స్వయంగా ప్రయోగాలు చేస్తూ, నూతన ఆవిష్కరణల దిశగా అడుగులు వేయాలని సూచించారు. ఇటువంటి శిక్షణ కార్యక్రమాలు విద్యార్థుల్లో సృజనాత్మకతను, సమస్యల పరిష్కార నైపుణ్యాన్ని పెంపొందించడంతోపాటు, ఆత్మవిశ్వాసాన్ని అందిస్తాయని వివరించారు.ఈ కార్యక్రమానికి కన్వీనర్ గా వ్యవహరించిన ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్ విభాగాధిపతి డాక్టర్ శ్రీ ఫణికృష్ణ కర్రి మాట్లాడుతూ ఇటువంటి శిక్షణ కార్యక్రమాల ద్వారా విద్యార్థుల్లో భావోద్వేగ నైపుణ్యాలు, మేధో సామర్థ్యం, సామాజిక నైపుణ్యాలు పెంపొందుతాయని, ఇవి విద్యార్థుల వ్యక్తిత్వ వికాసానికి, సమాజంలో సమర్థవంతంగా రాణించడానికి దోహదపడతాయని వివరించారు. కార్యక్రమ కో ఆర్డినేటర్ డాక్టర్ తేజావతు రమేష్ మాట్లాడుతూవిద్యార్థుల్లో సాంకేతిక నైపుణ్యాలు, సామర్థ్యాలను పెంపొందించి, వారిని భవిష్యత్తు సవాళ్లకు సిద్ధం చేయడంలో



ఇటువంటి శిక్షణ కార్యక్రమాలు కీలక పాత్ర పోషిస్తాయని వివరించారు. ముందుగా జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ డాక్టర్ పి.దినేష్ శంకర్ రెడ్డి, డీన్లు డాక్టర్ వి.సందీప్, డాక్టర్ ఎన్.జయరామ్, ఆచార్యులు డాక్టర్ పెద్దపాటి శంకర్, డాక్టర్ అల్లంశెట్టి శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

మురుగునీటి నిల్వలతో దోమలు,జ్వరాల వ్యాప్తికి అవకాశం

అప్రమత్తంగా ఉండండి: ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సిద్ధార్థ

బాపట్ల : నవంబర్ 4 (ప్రజా వీక్షణం)



బాపట్ల పట్టణంలో ఇటీవల కురిసిన భారీ వర్షాలు,వరదల కారణంగా పలు ప్రాంతాల్లో మురుగునీరు నిల్వ ఉండటంతో దోమలు, క్రిమికీటకాలు పెరిగి జ్వరాలు, సీజనల్ వ్యాధులు వ్యాప్తి చెందే ప్రమాదం ఉందని బాపట్ల ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సిద్ధార్థ తెలిపారు.ప్రజలు తమ ఇళ్ల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, ఇళ్ల చుట్టూ, కూలర్లు, పూల కుండీలు, టైర్లు, కొబ్బరి చిప్పల్లో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని సూచించారు.తాగునీటిని కాచి చల్లార్చి తాగాలని, ఆహార పదార్థాల విషయంలో పరిశుభ్రత పాటించాలని కోరారు. దోమల నివారణకు దోమతెరలు, కాయిల్స్ వాడాలని సూచించారు.జ్వరం,ఒళ్లు నొప్పులు, వాంతులు, విరేచనాలు వంటి లక్షణాలు కనిపిస్తే నిర్లక్ష్యం చేయకుండా వెంటనే సమీప ఆసుపత్రిలో వైద్యులను సంప్రదించాలని, సొంతంగా మందులు వాడవద్దని తెలిపారు.ప్రజలు భయాందోళనలకు గురికాకుండా అప్రమత్తంగా ఉండాలని, ఏదైనా ఆరోగ్య సమస్య ఉంటే బాపట్ల ఏరియా ఆసుపత్రిని సంప్రదించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

ఎంపీటీసీ,జడ్పీటీసీ ఎన్నికలు సమర్థవంతంగా నిర్వహించాలి

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎన్నికల కమీషనర్ అనిల్ చంద్ర పునేఠా

బాపట్ల : నవంబర్ 4 (ప్రజా వీక్షణం)

ఎంపీటీసీ,జెడ్పీటీసీ ఎన్నికలు సమర్థంగా నిర్వహించాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎన్నికల కమిషనర్ అనిల్ చంద్ర పునేఠా తెలిపారు.ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల నిర్వహణపై జిల్లాల కలెక్టర్లు, ఎన్నికల పరిశీలకులతో బుధవారం రాష్ట్ర రాజధాని అమరావతి నుంచి ఆయన వీక్షణ నిర్వహించారు. జిల్లా నుంచి ఎన్నికల సాధారణ పరిశీలకులు ఏ ఏ ఎల్ పద్మావతి, వ్యయ పరిశీలకులు జి.కృష్ణప్రియ, జిల్లా కలెక్టర్ డాక్టర్ వి.వినోద్ కుమార్ హాజరయ్యారు.ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు చేసుకోవాలని రాష్ట్ర ఎన్నికల కమిషనర్ చెప్పారు. నిర్దేశించిన రూట్ లలోనే ఎన్నికల సామగ్రి తరలించాలని సూచించారు. ఎన్నికల సామగ్రి తరలించే సమయంలో పోలీసుల బందోబస్తు ఉండాలన్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తు ప్రణాళికతో నివారించాలన్నారు. బాపట్ల జిల్లాలోని అన్ని మండలలో ఎన్నికలు నిర్వహించడానికి అన్ని ఏర్పాట్లు చేశామని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డాక్టర్ వి.వినోద్ కుమార్ ఎన్నికల కమిషనర్ కు తెలిపారు.పర్చూరు మండలంలో పంట కాల్వలు, వాగులు వంకలు పొంగి పొర్లుతున్నాయని, మధ్యాహ్నానికి అవి సాధారణ పరిస్థితికి వచ్చే అవకాశం ఉన్నందున ఆ ప్రాంతంలోనూ ఎన్నికల నిర్వహణకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఈ సమావేశంలో జిల్లా నుంచి జిల్లా రెవెన్యూ అధికారి లవన్న, జెడ్పీ సీఈవో విజయలక్ష్మి, కలెక్టరేట్ ఏవో మల్లికార్జునరావు తదితరులు పాల్గొన్నారు.

మార్కింగ్ చేసినా భవనం తొలగించకుండా పిల్లర్ కిందే తవ్వకాలా?

-డ్రైనేజీ పనుల్లో అధికారుల నిర్లక్ష్యం.

-భవన భద్రతతో చెలగాటమా?

కొమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా నవంబర్ 04 (ప్రజా వీక్షణం న్యూస్)





కొమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా కాగజ్‌నగర్ మున్సిపాలిటీ పరిధిలో అధికారులు చేపడుతున్న ప్రధాన డ్రైనేజీ నిర్మాణ పనులు తీవ్ర నిర్లక్ష్యానికి, నాణ్యతా లోపాలకు అద్దం పడుతున్నాయి. డ్రైనేజీ నిర్మాణానికి సంబంధించి ముందుగానే మార్కింగ్ చేసినప్పటికీ, ఆ మార్కింగ్ ప్రకారం డ్రైనేజీకి అడ్డుగా ఉన్న భవనాన్ని ముందస్తుగా తొలగించాల్సిన బాధ్యత అధికారులపై ఉంది. కానీ అధికారులు ఆ దిశగా చర్యలు తీసుకోకుండా, ఏకంగా ఇంటి పిల్లర్ కింద నుంచి మట్టిని తవ్వడం ఎంతవరకు సమంజసం?మార్కింగ్ చేసిన సమయంలోనే భవనం అడ్డుగా ఉందని గుర్తించినప్పుడు, నిబంధనల ప్రకారం సమస్యను పరిష్కరించాల్సింది పోయి, భవనం పునాదుల కింద తవ్వకాలు చేపట్టడం అధికారుల పనితీరుకు నిదర్శనంగా కనిపిస్తోంది. ఇలాంటి తవ్వకాల వల్ల భవనం పునాదులు బలహీనపడి భవిష్యత్తులో ప్రమాదం జరిగే అవకాశం ఉంది. ఒకవేళ ఏదైనా ప్రమాదం జరిగితే దానికి బాధ్యత ఎవరు వహిస్తారు? ముందస్తు ప్రణాళిక లేకుండా పనులు చేపట్టిన అధికారులు బాధ్యత నుంచి తప్పించుకుంటారా?ప్రజల సౌకర్యార్థం చేపట్టాల్సిన అభివృద్ధి పనులు ప్రజల ప్రాణాలకు, ఆస్తులకు ముప్పు కలిగించే విధంగా ఉండకూడదు. డ్రైనేజీ నిర్మాణంలో అడ్డంకులు ఎదురైనప్పుడు సాంకేతిక నిపుణుల సూచనలతో, నిబంధనల ప్రకారం పరిష్కరించాలి. అంతేగానీ ఇంటి పిల్లర్ల కింద తవ్వకాలు చేపట్టి భవన భద్రతను ప్రశ్నార్థకం చేయడం సరైన విధానం కాదు.అదేవిధంగా డ్రైనేజీకి ముందు భాగంలో ఎలాంటి షెడ్లు, అక్రమ నిర్మాణాలు లేదా ఇతర అడ్డంకులు ఏర్పడకుండా మున్సిపల్ అధికారులు ముందస్తు చర్యలు తీసుకోవాలి. డ్రైనేజీ నిర్మాణం పూర్తయ్యేలా అవసరమైన స్థలాన్ని నిబంధనల ప్రకారం సిద్ధం చేయాలి.మా ప్రధాన డిమాండ్లు:ముందుగా చేసిన డ్రైనేజీ మార్కింగ్ ప్రకారం భవనం అడ్డుగా ఉన్న విషయంపై అధికారులు వివరణ ఇవ్వాలి.ఇంటి పిల్లర్ కింద చేపట్టిన తవ్వకాలపై తక్షణమే సాంకేతిక విచారణ జరపాలి.భవన భద్రతను ఇంజనీరింగ్ అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి, అవసరమైన రక్షణ చర్యలు చేపట్టాలి.డ్రైనేజీకి అడ్డుగా ఉన్న నిర్మాణాలను చట్టబద్ధమైన ప్రక్రియ ద్వారా పరిష్కరించాలి.
పనుల్లో నిర్లక్ష్యం వహించిన అధికారులు, కాంట్రాక్టర్ల బాధ్యతను నిర్ధారించి చర్యలు తీసుకోవాలి.
మిగిలిన డ్రైనేజీ పనులను నాణ్యతా ప్రమాణాలతో, ముందస్తు ప్రణాళికతో పూర్తి చేయాలి.ఇకనైనా మున్సిపల్ అధికారులు నిర్లక్ష్యాన్ని వీడి ప్రజాధనంతో చేపడుతున్న అభివృద్ధి పనులను నాణ్యతతో పూర్తి చేయాలి. ఫోటోల్లో కనిపిస్తున్న పనుల తీరును చూస్తే అభివృద్ధి పనులు ఇలా కూడా చేస్తారా? అనే ప్రశ్న ప్రజల్లో తలెత్తుతోంది. మార్కింగ్ చేసినప్పటికీ ముందస్తు చర్యలు తీసుకోకుండా పిల్లర్ కిందే తవ్వకాలు చేపట్టడం అధికారుల పనితీరుపై అనేక అనుమానాలకు తావిస్తోంది. తక్షణమే ఉన్నతాధికారులు స్పందించి విచారణ జరిపి, భవన భద్రతకు ముప్పు కలగకుండా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నాం. లేనిపక్షంలో ఈ సమస్యపై ప్రజలను సమీకరించి ఆందోళన చేపడతామని హెచ్చరిస్తునమని ముంజం ఆనంద్ కుమార్ సిపిఎం పార్టీ జిల్లా కమిటీ సభ్యులు తెలిపారు.



వరదలో ముంపులో ఉన్న 150 కుటుంబాలు పునరావాస కేంద్రానికి తరలింపు

బాపట్ల తహశీల్దార్ షేక్ సలీమా

బాపట్ల : నవంబర్ 4 (ప్రజా వీక్షణం)

మురసు తుఫాను నేపథ్యంలో గత రెండురోజులుగా కురిసిన భారీ వర్షాలకు ఎగువ నుంచి భారీగా నల్లమడ డ్రైన్ కు వరద రావడంతో బాపట్ల మండలం పరిధిలోని చెరువు గ్రామంలో సుమారు 150 ఇళ్ళు వరద ప్రభావానికి గురై ఉన్న వరద బాధితులను గురువారం బాపట్ల తహసీల్దార్ ఎస్ కె సలీమా పునరావాస కేంద్రాలకు తరలించి సహాయక సదుపాయాలు అందిస్తూ, వారికి ప్రభుత్వం తరఫున పూర్తి అండగా ఉంటామని అభయం ఇచ్చారు.



ప్రజావీక్షణం
దినపత్రిక

నల్లమడ వాగు ఉధృతిని పరిశీలించిన తహసీల్దార్ షేక్ సలీమా

బాపట్ల : నవంబర్ 4 (ప్రజా వీక్షణం)

బాపట్ల మండలంలోని జిల్లెల్లమూడి గ్రామ సమీపంలో నల్లమడ వాగు పొంగిపొర్లుతున్న నేపథ్యంలో బాపట్ల మండల తహసీల్దార్ షేక్ సలీమా వాగు ప్రవాహాన్ని క్షేత్రస్థాయిలో పరిశీలించారు.భారీ వర్షాల కారణంగా వాగులో నీటి ప్రవాహం పెరిగిన పరిస్థితిని ఆమె స్వయంగా పరిశీలించి,పరిసర ప్రాంతాల పరిస్థితులపై ఆరా తీశారు. వాగు పరివాహక ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని,నీటి ప్రవాహం ఎక్కువగా ఉన్న సమయంలో వాగులు,వంకలు దాటే ప్రయత్నం చేయవద్దని సూచించారు.అలాగే సంబంధిత అధికారులు పరిస్థితిని నిరంతరం పర్యవేక్షిస్తూ, ప్రజలకు అవసరమైన సమాచారం అందించాలని సూచించారు. వర్షాల నేపథ్యంలో ప్రజల భద్రతకు ప్రాధాన్యత ఇస్తూ అధికారులు అప్రమత్తంగా ఉండాలని తెలిపారు.



విబిజి రాంజీ పనులను పరిశీలించిన అదనపు కలెక్టర్..

దేవరకద్ర నవంబర్ 4 ప్రజా విక్షణం

మండల పరిధిలోని నాగారం గ్రామంలో బుధవారం విబిజి రాంజీ ఉపాధి పనులను జిల్లా అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్ పరిశీలించారు. పనులు చేస్తున్న వారికి అన్ని సౌకర్యాలు ఉన్నాయా లేదా అని అక్కడ ఉన్న వారిని అడిగి తెలుసుకున్నారు. కూలీలకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా ఉండేందుకు అధికారులు అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని ఆయన కోరారు. ఆయన వెంట ఎంపీడీవో శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.



గర్భిణీ మహిళలకు బాలామృతం, గుడ్లు, పాలు పంపిణీ

దేవరకద్ర నవంబర్ 4 ప్రజా విక్షణం

కొకుంట్ల మండల పరిధిలోని పేరూరు గ్రామంలోని అంగన్వాడీ కేంద్రంలో బుధవారం గర్భిణీ మహిళలకు బాలామృతం, గుడ్లు, పాలను గ్రామ సర్పంచ్ కొత్త శృతి అరవింద్ రెడ్డి పంపిణీ చేశారు.ఈ సందర్భంగా గర్భిణీ మహిళలు పౌష్టికాహారం తీసుకోవడం ఎంతో ముఖ్యమని, తల్లి ఆరోగ్యంతో పాటు పుట్టబోయే బిడ్డ ఆరోగ్యానికి కూడా పౌష్టికాహారం ఎంతగానో దోహదపడుతుందని తెలిపారు. ప్రభుత్వం అంగన్వాడీ కేంద్రాల ద్వారా అందిస్తున్న పౌష్టికాహారాన్ని మహిళలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో గ్రామ ఉపసర్పంచ్, వార్డు సభ్యులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.



పోలవరం నియోజకవర్గంలో ఎడతెరిపిలేని ముసురు ప్రభావం!



-దెబ్బతిన్న జాతీయ రహదారిని పరిశీలించిన పోలవరం ఎమ్మెల్యే చిర్రి బాలరాజు

-రాకపోకలకు అంతరాయం కలగకుండా తక్షణ చర్యలు చేపట్టాలని అధికారులకు ఆదేశం

పోలవరం:నవంబర్ 04(ప్రజా వీక్షణం)

పోలవరం నియోజకవర్గంలో రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలు మరియు ఎడతెరిపిలేని ముసురు కారణంగా బుధవారం నాడు పోలవరం ఎమ్మెల్యే చిర్రి బాలరాజు ఈ ముసురు వాతావరణ ప్రభావంతో తీవ్రంగా దెబ్బతిన్న కీలక ప్రాంతాలను, రహదారులను క్షేత్రస్థాయిలో పర్యటించి పరిశీలించారు.బర్రింకాలపాడు నుంచి జీలుగుమిల్లి వరకు పరిశీలన.. ముసురు ధాటికి బర్రింకాలపాడు నుండి జీలుగుమిల్లి వరకు ఉన్న ప్రధాన జాతీయ రహదారి పలుచోట్ల దెబ్బతింది. అలాగే పి. అంకంపాలెం ప్రాంతంలో రోడ్ల పరిస్థితిని ఎమ్మెల్యే పరిశీలించారు.అంతేకాకుండా ప్రజలు ప్రయాణాల్లో ఎలాంటి ఇబ్బందులు



పడకుండా,ఈ వర్షానికి దెబ్బతిన్న రోడ్లను గుర్తించి తక్షణమే మరమ్మతులు చేపట్టాలని అధికారులతో మాట్లాడటం జరిగింది.ప్రమాదకర ప్రాంతాలపై నిఘా: వరద నీరు చేరే లోతట్టు ప్రాంతాలు, ప్రమాదకర ప్రాంతాలను గుర్తించి ప్రజలను అప్రమత్తం చేయాలి.అలాగే ప్రజలకు ఎలాంటి ప్రాణనష్టం గానీ, ఆస్తి నష్టం గానీ జరగకుండా తక్షణ ముందస్తు రక్షణ చర్యలు చేపట్టాలి.ప్రజలకు ఎమ్మెల్యే చిర్రి బాలరాజు అత్యవసర విజ్ఞప్తి మరియు హెచ్చరికలు: వాగులు దాటే సాహసం చేయవద్దు: కొండవాగులు, రహదారుల మధ్య ప్రవహించే కాలువలు, వాగుల్లో వరద నీటి ప్రవాహం అత్యధికంగా ఉంది. కాబట్టి ప్రజలు ఎట్టి పరిస్థితుల్లోనూ వాటిని దాటేందుకు ప్రయత్నించవద్దని హెచ్చరించారు.అత్యవసర పరిస్థితులు ఉన్నవారు మాత్రమే బయటకు రావాలని, అధికారులు సూచించిన తూచా తప్పకుండా పాటిస్తూ సురక్షిత ప్రాంతాల్లో ఉండాలని కోరారు.అధికారులకు సహకరించండి : వాతావరణం పూర్తిగా చక్కబడి, ముసురు వీడే వరకు ప్రజలందరూ అత్యంత అప్రమత్తంగా ఉండాలని, ప్రభుత్వ యంత్రాంగానికి పూర్తిగా సహకరించాలని ఎమ్మెల్యే చిర్రి బాలరాజు విజ్ఞప్తి చేశారు.

ప్రొఫెసర్ల ప్రోత్సాహంతో బ్యాక్ బెంచర్ నుంచి బ్యాంక్ మేనేజర్ స్థాయికి ఎదిగా

యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా అసిస్టెంట్ జనరల్ మేనేజర్ జి.వి.బి.డి.హరిప్రసాద్

బాపట్ల : నవంబర్ 4 (ప్రజా వీక్షణం)

బాపట్ల వ్యవసాయ కళాశాల అనేక మంది విద్యార్థుల జీవితాలలో వెలుగులు నింపిందని, నూటికి నూరు శాతం సక్సెస్ రేట్ ఉన్న ఏకైక కళాశాల ఇదేనని యూనియన్ బ్యాంక్ అఫ్ ఇండియా అసిస్టెంట్ జనరల్ మేనేజర్ మరియు మేనేజింగ్ డైరెక్టర్ అఫ్ శ్రీనిధి జి.వి.బి.డి.హరి ప్రసాద్ అన్నారు. వ్యవసాయ కళాశాలలో జరిగిన దీక్షారంభ కార్యక్రమంలో అతిధి ఉపన్యాసకుడుగా పాల్గొన్న ఆయన నూతన విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగిస్తూ ఉపాధ్యాయ వృత్తి అత్యంత కీలకమైనదని, ఈ కళాశాల ఉపాధ్యాయులు అహర్నిశలు విద్యార్థుల శ్రేయస్సు కోసమే కృషి చేస్తారని, వారి మార్గదర్శకత్వంలో నడిచిన ప్రతి ఒక్కరూ విజయాలను సాధించారని, అందుకు 2003 బ్యాచ్ పూర్వ విద్యార్థిగా బ్యాక్ బెంచెర్ నుండి బ్యాంకు మేనేజర్ స్థాయికి ఎదిగిన నేనే ప్రత్యక్ష ఉదాహరణ అన్నారు. ఈ నాలుగు సంవత్సరాల డిగ్రీ విద్యను క్రమశిక్షణతో చదువుకోవటమేకాక భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలన్నారు. ఓటమికి కృంగిపోకూడదని, దానిని ప్రోత్సాహంగా మలుచుకొని ముందుకు సాగితే విజయం తప్పకుండా వరిస్తుందన్నారు. విద్యార్థులు భావ వ్యక్తీకరణ నైపుణ్యం, సాంకేతిక నైపుణ్యం, ఆచరణాత్మక జ్ఞానం, ఆర్థిక వ్యవస్థ అవగాహన, నాయకత్వ లక్షణాలను పెంపొందించుకుంటే సమాజంలో వారు ఏ రంగంలోనైనా రాణిస్తారన్నారు. ఉద్యోగాల కోసం కృషి



చేయడమే కాకుండా ఉద్యోగాల కల్పన చేసే దిశగా మీ ఆలోచనలు ఎదగాలన్నారు. భారత దేశంలో ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రంలోనే స్టార్ట్ అప్ కంపెనీల ఆవిర్భావానికి అధిక ప్రోత్సాహం లభిస్తుందని, ముఖ్యంగా వ్యవసాయ రంగంలో దీనికి అధిక ప్రాధాన్యముందని, కాబట్టి ఈ కంపెనీల ఏర్పాటుపట్ల దృష్టి సారించి దేశ జి.డి.పి. అభివృద్ధికి కృషి చేయాలన్నారు. వికసిత్ భారత్ లోని ముఖ్యాంశం ఇదేనన్నారు. విద్య నిరంతరం కొనసాగే జీవన స్రవంతిలాంటిదని, ఎప్పుడూ చదువుతూ ఉండటం మానసిక ఆరోగ్యానికి దోహదపడుతుందని తెలిపారు. అనంతరం హరి ప్రసాద్ ను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో డా.ఎస్.ఆర్.కోటేశ్వర రావు, డా. కె.ఎస్.ఆర్.పాల్, డా. ఎం.శ్రీరేఖ, డా.కె.శ్రీనివాసులు, డా.కె.చంద్రశేఖర్, డా.టి.మధుమతి, డా. ఆర్.బాల మురళీధర్ నాయక్, డా.పి.సుధా జాకబ్, డా.డి.రమేష్ మరియు విద్యార్థినీ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

సాటి మనిషికి సహాయం చేయడమే నిజమైన మానవత్వం!

బాపట్లలో పేదలు, వృద్ధులకు రక్షణ సైన్యం ఆధ్వర్యంలో సేవా కార్యక్రమం

బాపట్ల : నవంబర్ 4 (ప్రజా వీక్షణం)



ఆపదలో ఉన్నవారికి అండగా నిలవడం, నిరుపేదలకు చేయూతనివ్వడం,వృద్ధుల ముఖాల్లో చిరునవ్వులు నింపడమే నిజమైన మానవత్వమని పలువురు పేర్కొన్నారు.క్రైస్తవ సేవా పరిచర్యలో భాగంగా బాపట్ల స్థానిక అంబేద్కర్ నగర్ రక్షణ సైన్యం చర్చిలో పేదలు, వృద్ధులకు సహాయ కార్యక్రమం నిర్వహించారు.సాటి మనిషి కష్టాలను గుర్తించి, మానవతా దృక్పథంతో సహాయం చేయడానికి ముందుకు వచ్చిన సాతులూరి సురేష్ మిలింగ్టన్ సహకారంతో,సంఘ వై.పి.ఎస్.ఎం.రత్న ప్రసాద్ ఆధ్వర్యంలో ఈ సేవా కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు.ఈ కార్యక్రమానికి బాపట్ల మండల రక్షణ సైన్యం నాయకులు వంపుగూడి యేసుపాదం ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.స్థానిక సంఘ కాపరులు మేజర్ కె. చంద్రకుమార్, మరియమ్మ దంపతులు అధ్యక్షత వహించారు.ఈ సందర్భంగా మండల నాయకులు మాట్లాడుతూ..... సమాజంలో ఆర్థికంగా వెనుకబడినవారికి, నిరుపేదలకు, వృద్ధులకు సహాయం చేయడం కేవలం దాతృత్వం మాత్రమే కాదని, అది మానవత్వానికి నిజమైన నిదర్శనమని అన్నారు. దేవుడు మనకు అనుగ్రహించిన ఆశీర్వాదాలను అవసరంలో ఉన్నవారితో పంచుకోవడం క్రైస్తవ జీవన విధానంలో ముఖ్యమైన భాగమని పేర్కొన్నారు. సేవ అనేది మాటలకే పరిమితం కాకుండా చేతల్లో కనిపించాలని, సమాజంలోని బలహీన వర్గాలకు అండగా నిలవాలని పిలుపునిచ్చారు.అనంతరం సంఘంలోని వృద్ధులకు నిత్యావసర సరుకులు, గొడుగులు పంపిణీ చేశారు. ఈ సహాయం వృద్ధులకు ఎంతో ఉపయోగకరంగా నిలిచింది. ఈ కార్యక్రమంలో సంఘ సెక్రటరీ నత్తల ప్రసాద్, పొనుగుపాటి రాజేష్ జెరూసన్, కూరగంటి శ్యాంకుమార్, సంఘ మహిళా సెక్రటరీ కోపూరి నాగమణి వివిధ సంఘాలకు చెందిన రక్షణ సైన్యం నాయకులు, పెద్దలు, మహిళా సంఘస్థులు,సంఘ సభ్యులు పాల్గొన్నారు.

ప్రజావీక్షణం
దినపత్రిక
GENERAL NEWS
05 గురువారం నవంబర్ 2026
5
www.prajaveekshanam.in

నందిగామ మున్సిపల్ పీఠంపై కూటమి జెండా.. అంబరాన్నంటిన విజయోత్సవ సంబరాలు



-ప్రజల తీర్పుతో ప్రతిపక్షానికి గట్టి గుణపాఠం. రెండు ఓట్లు రూ.150 కోట్ల అభివృద్ధికి పునాదులు ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య

నందిగామ: నవంబర్ 4 (ప్రజా వీక్షణం)

నందిగామ మున్సిపల్ ఎన్నికల్లో కూటమి అభ్యర్థులు ఘనవిజయం సాధించి మున్సిపల్ పీఠాన్ని కైవసం చేసుకోవడంతో పట్టణంలో విజయోత్సవ సంబరాలు అంబరాన్నంటాయి. ఈ సందర్భంగా భారీ ఎత్తున బాణాసంచా కాల్చి, నియోజకవర్గ జనసేన పార్టీ సమన్వయకర్త విజయవాడ దుర్గ గుడి డైరెక్టర్ తంబళ్లపల్లి రమాదేవి,మున్సిపల్ చైర్మన్ శాకమూరు వంశీధర్, కూటమి నాయకులు, కార్యకర్తలతో కలిసి విజయోత్సవాల్లో పాల్గొన్న ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే శ్రీమతి తంగిరాల సౌమ్య పార్టీ శ్రేణుల్లో నూతన ఉత్సాహాన్ని నింపారు.అనంతరం తన కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య మాట్లాడుతూ. నందిగామ పట్టణ ప్రజలు కూటమిపై ఉంచిన విశ్వాసం, అందించిన చారిత్రాత్మక విజయానికి పేరుపేరునా కృతజ్ఞతలు తెలిపారు.గొడ్డలి పార్టీకి ప్రజలే గుణపాఠం చెప్పారు.ప్రస్తుతం అధికారంలో ఉన్నది కూటమి ప్రభుత్వం కానీ గొడ్డలి పార్టీ ప్రభుత్వం కాదని, అయినప్పటికీ తామే ఇంకా అధికారంలో ఉన్నామనే భ్రమలో ప్రతిపక్ష నేతలు బతుకుతున్నారని విమర్శించారు. మున్సిపల్ ఎన్నికల్లో పోటీ చేస్తున్న అభ్యర్థులను బెదిరించడం, తిరిగి అధికారంలోకి వస్తే కేసులు పెడతామంటూ హెచ్చరించడం వంటి నీచ రాజకీయాలు ప్రజాస్వామ్యానికి హేయమన్నారు. గతంలో అధికారంలో ఉన్నప్పుడు వ్యక్తిగత దాడులు, అక్రమ కేసులు, అన్యాయాలతో తమను ఇబ్బందులకు గురిచేసిన వారికి నందిగామ ప్రజలు ఓటు రూపంలో తగిన గుణపాఠం చెప్పారని స్పష్టం చేశారు.రెండు ఓట్లు.. రూ.150 కోట్ల అభివృద్ధికి మెట్లు.నందిగామ మున్సిపల్ ఎన్నికల్లో ప్రజలు వేసిన రెండు ఓట్లు కేవలం అభ్యర్థుల గెలుపునకు మాత్రమే పరిమితం కాదని, రాబోయే రోజుల్లో పట్టణంలో చేపట్టబోయే సుమారు రూ.150 కోట్ల అభివృద్ధి పనులకు అవి పునాదులని ఎమ్మెల్యే పేర్కొన్నారు. అభివృద్ధి చేసి ఓటు అడిగామని, అందుకు ప్రతిఫలంగా పట్టణ ప్రజలు అత్యధిక మెజారిటీలతో కూటమి అభ్యర్థులను ఆశీర్వదించారని తెలిపారు.ఇది మాటల ప్రభుత్వం కాదని, చేతల ప్రభుత్వమని పేర్కొంటూ నందిగామ పట్టణ భవిష్యత్తును మార్చేలా పలు అభివృద్ధి కార్యక్రమాలను కార్యరూపంలోకి తీసుకువస్తున్నామని వివరించారు.

నందిగామ అభివృద్ధికి మహా ప్రణాళిక.

- రూ.103 కోట్లతో కృష్ణా జలాలను ప్రతి ఇంటికీ అందించే బృహత్తర తాగునీటి పథకం.
- నందిగామకు కేంద్రీయ విద్యాలయం ఏర్పాటు.
- 100 పడకల ప్రభుత్వ ఆసుపత్రి నిర్మాణం.
- 50 పడకల ఇంటిగ్రేటెడ్ ఆయుష్ ఆసుపత్రి.
- నూవీ నిధులతో పట్టణంలోని రహదారులన్నింటినీ సిమెంట్ రోడ్లుగా అభివృద్ధి చేయడం.
- పక్కా డ్రైనేజీ వ్యవస్థ ఏర్పాటు.
- పట్టణ ప్రజలకు ఆహ్లాదకరమైన వాతావరణాన్ని అందించేలా పార్కు నిర్మాణం.
- ఆధునిక సౌకర్యాలతో నూతన మున్సిపల్ కార్యాలయ భవనం నిర్మాణం.ఈ అభివృద్ధి కార్యక్రమాలన్నీ కేవలం కాగితాలకే పరిమితం కాలేదని, ఇప్పటికే శంకుస్థాపనలు, కార్యాచరణ ద్వారా ప్రజలకు అభివృద్ధి ఫలితాలను కళ్లకు కట్టినట్లు.చూపిస్తున్నామని సౌమ్య స్పష్టం చేశారు.

నూతన చైర్మన్‌కు, కౌన్సిలర్లకు అభినందనలు.నందిగామ మున్సిపల్ చైర్మన్‌గా ఎన్నికైన శాఖమూరి వంశీధర్‌తో పాటు ఎన్నికల బరిలో విజయం సాధించిన కౌన్సిలర్లందరికీ ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య ప్రత్యేక అభినందనలు, శుభాకాంక్షలు తెలిపారు. రాజకీయల్లో గెలుపోటములు సహజమని, ఓటమి చెందిన అభ్యర్థులు నిరుత్సాహపడాల్సిన అవసరం లేదని, ప్రజల మధ్య ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు.ప్రజలతో మమేకమై కూటమి ప్రభుత్వానికి మంచి పేరు తీసుకురావాలి.నూతనంగా ఏర్పడనున్న మున్సిపల్ పాలకవర్గంలోని ప్రతి ఒక్కరూ నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉంటూ, వారి కుటుంబ సభ్యుల్లో ఒకరిగా కలిసిపోయి పనిచేయాలని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు. ప్రజల సమస్యలను తమ సమస్యలుగా భావించి పరిష్కారానికి చిత్తశుద్ధితో కృషి చేయాలని, నందిగామ పట్టణాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లి కూటమి ప్రభుత్వానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.నందిగామ ప్రజలు అందించిన ఈ చారిత్రాత్మక విజయాన్ని బాధ్యతగా స్వీకరిస్తూ, పట్టణ అభివృద్ధే లక్ష్యంగా ముందుకు సాగుతామని ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య స్పష్టం చేశారు.

దూడలకు నట్టల నివారణ మందుల పంపిణీ కార్యక్రమం..

దేవరకద్ర నవంబర్ 4 ప్రజా వీక్షణం

దేవరకద్ర మండల పరిధిని గోప్లాపూర్ గ్రామంలో పశువైద్య శాఖ ఆధ్వర్యంలో బుధవారం పశువైద్య అధికారులు దూడలకు నట్టల నివారణ మందుల పంపిణీ కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో భాగంగా గోప్లాపూర్‌తో పాటు గుడిబండ, కోయిల్‌సాగర్ గ్రామాల్లో కూడా దూడలకు నట్టల నివారణ మందులు అందజేశారు.దూడల్లో నట్టల నివారణ చేయడం వల్ల వాటి ఆరోగ్యం మెరుగుపడటంతో పాటు, ఎదుగుదల సక్రమంగా ఉంటుంది. నట్టల వల్ల కలిగే పోషకాహార లోపం, రక్తహీనత, బరువు తగ్గడం, జీర్ణ సంబంధిత సమస్యలను నివారించవచ్చు. పశువుల రోగనిరోధక శక్తి పెంపొందించడంలో కూడా నట్టల నివారణ కీలక పాత్ర పోషిస్తుంది.కావున పశుపోషకులు తమ దూడలకు పశువైద్యుల సూచనల మేరకు క్రమం తప్పకుండా నట్టల నివారణ మందులు వేయించి, పశువుల ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని పశువైద్య శాఖ సూచించింది.పశువుల ఆరోగ్యమే పశు సంపద అభివృద్ధికి పునాది అని పశు వైద్య అధికారులు అన్నారు.



బాపట్ల జిల్లా అప్పికట్ల గ్రామంలో వరద బాధితులకు ఆహార పొట్లాలు అందజేత

బాపట్ల.నవంబర్ 4. (ప్రజా వీక్షణం)

బాపట్ల జిల్లా అప్పికట్ల గ్రామంలో సంభవించిన వరద ప్రభావానికి గురైన ప్రజలను ఆదుకోవడానికి భారతీయ జనతా పార్టీ (దీప్తీ) మండల అధ్యక్షుడు దొండపాటి శివాజీ ఆధ్వర్యంలో సహాయక చర్యలు ముమ్మరంగా చేపట్టడం జరిగింది.భారీ వర్షాలు మరియు వరద నీరు ఇళ్లలోకి చేరి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న నిరుపేద కుటుంబాలు, వరద బాధితులను నేరుగా పరామర్శించి వారికి తక్షణ సహాయంగా వండిన ఆహార పొట్లాలు మరియు రక్షిత మంచినీటి సీసాలను పంపిణీ చేశారు. ఈ క్లిష్ట సమయంలో స్థానిక బిజెపి నాయకులు మరియు కార్యకర్తలు అంతా ఏకమై బాధితులకు అండగా నిలిచారు.ఈ సందర్భంగా మండల అధ్యక్షుడు దొండపాటి శివాజీ మాట్లాడుతూ.. వరద ముప్పు పూర్తిగా తొలగిపోయే వరకు బాధితులకు అవసరమైన అన్ని సహాయక చర్యలు నిరంతరం కొనసాగిస్తామని, గ్రామ ప్రజలకు పార్టీ ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటుందని భరోసానిచ్చారు. ఈ కార్యక్రమంలో పలువురు స్థానిక బిజెపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

డ్రైనేజీ లేదు.. కనీస వసతులు అంతకంటే లేవు!





-యానాదుల దీనావస్థపై కూటమి ప్రభుత్వాన్ని నిలదీసిన భీమిరెడ్డి వెంకన్నబాబులి

-కామవరపుకోట లో పేదల కష్టాలు పాలకులకు కనిపించడం లేదా?

- వైయస్సార్సీపీ ఎస్టీ సెల్ భీమిరెడ్డి వెంకన్న బాబు ఆగ్రహంలి

కామవరపుకోట, నవంబర్ 4 (ప్రజా వీక్షణం)

ఏలూరు జిల్లా కామవరపుకోట మండల కేంద్రంలోని యానాదుల కాలనీలో పరిస్థితులు అత్యంత దయనీయంగా మారాయి. కనీస మౌలిక వసతులు కరువవడంతో పాటు, డ్రైనేజీ వ్యవస్థ పూర్తిగా అస్తవ్యస్తంగా తయారైంది. అలాగే ఇళ్లలోకి సైతం మురుగునీరు చేరడంతో కాలనీవాసులు తీవ్ర నరకయాతన అనుభవిస్తున్నారు. మరోవైపు వర్షాలకు, దుర్భర వాతావరణానికి పూరి గుడిసెల్లో నివసిస్తున్న ఈ పేద యానాది కుటుంబాలు బిక్కుబిక్కుమంటూ ప్రాణభయంతో కాలం వెళ్లదీస్తున్నాయి. రాత్రి అయితే ఎప్పుడు ఇల్లు కూలుతుందోనని, పాములు, తేళ్లు ఏ రూపంలో ముంచుకొస్తాయోనని వారు నిద్రలేని రాత్రులు గడుపుతున్నారు.ఈ దారుణ పరిస్థితులపై వైయస్సార్సీపీ ఎస్టీ సెల్ రాష్ట్ర కార్యదర్శి భీమిరెడ్డి వెంకన్నబాబు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ప్రభుత్వ, స్థానిక కూటమి నాయకుల వైఖరిపై ఆయన తీవ్రస్థాయిలో మండిపడ్డారు. పేదల సంక్షేమమే ధ్యేయమని చెప్పుకునే పాలకులకు ఈ నిరుపేదల ఆకలి కేకలు, కన్నీళ్లు కనిపించడం లేదా అని ఆయన ప్రశ్నించారు.కూటమి నాయకులను ఉద్దేశించి భీమిరెడ్డి వెంకన్నబాబు ఘాటుగా స్పందిస్తూ... “ఎన్నికల సమయంలో ఓట్ల కోసం గడప గడపకూ తిరిగిన నాయకులు... గెలిచిన తర్వాత ఈ పేదల దీనావస్థను ఎందుకు పట్టించుకోవడం లేదు? డ్రైనేజీ వ్యవస్థ లేక ఇళ్లలోకి నీరు చేరుతుంటే, తలదాచుకోవడానికి ఇల్లు లేక ఉన్న చిన్నపాటి పూరి గుడిసెల్లో వర్షం కురుస్తుంటే అధికారంలో ఉన్న నాయకులకు మనసు రావడం లేదా? యానాదుల బతుకులు ఎన్నాళ్లకు ఈ దుర్భర పరిస్థితుల నుండి బయటపడతాయి? పేదల బతుకులతో చెలగాటమాడుతున్న కూటమి నాయకులు ఇప్పటికైనా కళ్లు తెరవాలి. తక్షణమే స్పందించి కాలనీలో మురుగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలి. కురుస్తున్న ఇళ్లకు మరమ్మతులు చేపట్టి, అర్హులందరికీ పక్కా ఇళ్లు మంజూరు చేయాలి”అని ఆయన డిమాండ్ చేశారు.అలాగే కాలనీ వాసులకు తక్షణ సాయం అందించకపోతే వైయస్సార్సీపీ ఎస్టీ సెల్ ఆధ్వర్యంలో బాధితులతో కలిసి పెద్దఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని, ప్రభుత్వంపై పోరాటం ఉధృతం చేస్తామని భీమిరెడ్డి వెంకన్నబాబు హెచ్చరించారు.



హనుమాన్ టెంపుల్ -- ఐటీసీ రోడ్డుపై మృత్యుపాశంగా మారిన స్లైడ్ కర్వ్ ఆకారపు మలుపులు!

ప్రమాదాలు జరుగుతున్నా మౌనంగా ఎందుకు? తక్షణమే భద్రతా చర్యలు చేపట్టాలి -- ప్రజల డిమాండ్

పటాన్ చేరు : నవంబర్ 4(ప్రజా వీక్షణం)

బొల్లారం డివిజన్272 పరిధిలోని హనుమాన్ టెంపుల్ నుంచి ఐటీసీకి వెళ్లే ప్రధాన రహదారిపై ఉన్న ఆకారపు మలుపులు వాహనదారుల పాలిట మృత్యుపాశంగా మారుతున్నాయి. ఈ మలుపుల వద్ద తరచూ ప్రమాదాలు జరుగుతూ పలువురు ప్రాణాలు కోల్పోయిన ఘటనలు ఆందోళన కలిగిస్తున్నాయి. ప్రమాదకర మలుపులపై సంబంధిత అధికారులు ఇప్పటికైనా కళ్లు తెరవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.
ప్రజల ప్రాణాలతో చెలగాటం వద్దు!ప్రమాదాలు జరిగిన తర్వాత స్పందించడం కాకుండా, ముందుగానే నివారణ చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు. రహదారిపై ప్రమాద హెచ్చరిక బోర్డులు, రేడియం సూచికలు, స్పీడ్ బ్రేకర్లు, అవసరమైన రోడ్డు భద్రతా ఏర్పాట్లు తక్షణమే చేయాలని విజ్ఞప్తి చేస్తున్నారు.
సంబంధిత శాఖల అధికారులు వెంటనే క్షేత్రస్థాయిలో పరిశీలన చేపట్టి ప్రమాదాల నివారణకు శాశ్వత పరిష్కారం చూపాలి. మరో ప్రాణం బలికాకముందే చర్యలు తీసుకోవాలని ప్రజలు గట్టిగా డిమాండ్ చేస్తున్నారు.



GENERAL NEWS
05 గురువారం నవంబర్ 2026
6
www.prajaveekshanam.in
ప్రజావీక్షణం
దినపత్రిక

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా: ములకలపల్లి మండలంలో భారీ వర్షాలు

- ఉగ్రరూపం దాల్చిన వాగులు, వంతెన కూలి రాకపోకలు బంద్!

ములకలపల్లి, నవంబర్ 04:(ప్రజా వీక్షణం)

ములకలపల్లి మండలంలో గత రెండు రోజులుగా కురుస్తున్న ఎడతెరిపిలేని భారీ వర్షాలకు వాగులు, వంకలు ఉగ్రరూపం దాల్చి పొంగి ప్రవహిస్తున్నాయి. ములకలపల్లి మండల వ్యాప్తంగా కుండపోత వర్షం కురవడంతో జనజీవనం పూర్తిగా స్తంభించిపోయింది.అలాగే భారీ వర్షాల కారణంగా ఈ ఉధృతిలో వాగులో చిక్కుకున్న ఒక వ్యక్తిని రెస్క్యూ టీం సహాయంతో సురక్షితంగా బయటకు తీసుకురావడం జరిగింది. అయితే, మూకమామిడి – మొగరలగుప్ప గ్రామాల మధ్య ఉన్న వాగులో వంతెన పూర్తిగా తెగిపోవడంతో గ్రామస్తులకు రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. ఎటు నుంచి ఏ మార్గం లేకపోవడంతో గ్రామ ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. చెరువులు అలుగు పారడంతో రోడ్లు కోతకు గురై వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. నీరు ప్రమాదకర స్థాయిలో ఉధృతంగా ప్రవహిస్తోంది. అంతేకాకుండా, మూకమామిడి పంచాయతీ పరిధిలో చెరువు పొంగి పొర్లడంతో వరద నీరు ఇళ్లలోకి చేరి పలు ఇళ్లు ముంపునకు గురయ్యాయి.ఈ సందర్భంగా సర్పంచ్ కోర్సా ఆదిలక్ష్మి మాట్లాడుతూ.. ప్రజలు అత్యవసరమైతే తప్ప బయటకు రావద్దని, వాగులు, వంకల వైపు ఎవరూ వెళ్లకూడదని సూచించారు. అత్యవసరమైతే పంచాయతీ సిబ్బందికి తెలియపరచాలని, పంచాయతీలో హెల్ప్ లైన్ ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. వాగులో చిక్కుకున్న వ్యక్తిని కాపాడిన రెస్క్యూ టీంకు, సమాచారం అందించిన వెంటనే సహకరించిన స్థానిక ఎస్సై మధు ప్రసాదుకు, ఎమ్మార్వో స్వాతి బిందు మరియు అగ్రికల్చర్ డిపార్ట్మెంట్ అధికారులకు ఆమె ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.





ఆహార వృథాను అరికట్టి.. సుస్థిర జీవనశైలిని అలవర్చుకోవాలి

స్పెషల్ గ్రేడ్ కమిషనర్ ఏసుబాబు

తాడేపల్లిగూడెం ప్రతినిధి, నవంబరు 4 (ప్రజా వీక్షణం)

ఆహార వృథాను అరికట్టి, పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా కృషి చేయాలని తాడేపల్లిగూడెం పురపాలక సంఘం స్పెషల్ గ్రేడ్ కమిషనర్ ఎం. ఏసుబాబు సూచించారు. స్థానిక పురపాలక సంఘ కార్యాలయంలో బ్రిక్స్ సుస్థిర జీవనశైలి వారోత్సవాలను పురస్కరించుకుని బుధవారం ఆయన అధ్యక్షతన సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ ఏసుబాబు మాట్లాడుతూ సుస్థిర ఆహార వ్యవస్థలను అనుసరిద్దాం అనే నినాదంతో ప్రజల్లో అవగాహన కల్పించాలని అధికారులకు, సిబ్బందిని ఆదేశించారు. అవసరానికి మించి ఆహారం వండటం, వడ్డించడం, పారవేయడం వంటి అలవాట్లను విడనాడాలని సూచించారు. మిగిలిన ఆహారాన్ని వృథా చేయకుండా అవసరమైన వారికి అందించాలని, ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించాలని తెలిపారు.తడి, పొడి చెత్తను ఇంటి వద్దే వేరు చేసి మున్సిపల్ సిబ్బందికి అందించాలని, స్థానికంగా పండించిన ఆహార పదార్థాలకు ప్రాధాన్యమివ్వాలని సూచించారు. ప్రకృతి వనరులను పొదుపుగా వినియోగించుకుంటూ పర్యావరణ హిత జీవనశైలిని అలవర్చుకోవాలన్నారు. ఈ నెల 7 వరకు నిర్వహించనున్నవారోత్సవాల్లో భాగంగా పట్టణంలో మార్నింగ్ వాక్‌లు, పార్కుల్లో పరిశుభ్రత కార్యక్రమాలు, పాఠశాలలు, కళాశాలల్లో అవగాహన సదస్సులు, గృహస్థాయిలో సేంద్రియ ఎరువుల తయారీపై ప్రదర్శనలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు.పౌరులందరూ ఈ కార్యక్రమాల్లో భాగస్వాములై 'వృథాను తగ్గిద్దాం.. భూమిని కాపాడుదాం' అనే లక్ష్య సాధనకు సహకరించాలని కమిషనర్ పిలుపునిచ్చారు.ఈ సమావేశంలో అసిస్టెంట్ కమిషనర్ డి. భవానీ బాబు, శానిటేషన్ సూపర్వైజర్ సోమేశ్వరరావు, ఎన్విరాన్మెంటల్ ఇంజనీర్ హరీష్, పురపాలక సిబ్బంది పాల్గొన్నారు.



తుఫాను ప్రభావంతో చింతలపాడు గ్రామంలో 100 ఎకరాలకు పైగా వరి పంట నేలమట్టం. రైతులకు తక్షణ నష్టపరిహారం అందించాలి

స్థానిక రైతు కూనపనేని ప్రసాద్ విజ్ఞప్తి

చందర్లపాడు. నవంబర్ 4(ప్రజా వీక్షణం)

ఎన్టీఆర్ జిల్లా, చందర్లపాడు మండలం, చింతలపాడు గ్రామం:మురుసు తుఫాను ప్రభావంతో ఎన్టీఆర్ జిల్లా చందర్లపాడు మండలం చింతలపాడు గ్రామంలో రైతులు తీవ్రంగా నష్టపోయారు. తుఫాను కారణంగా గ్రామ పరిధిలో సుమారు 100 ఎకరాలకు పైగా సాగు చేసిన వరి పంట పూర్తిగా నేలకొరిగి తీవ్ర నష్టం వాటిల్లింది. చేతికొచ్చే దశలో ఉన్న వరి పంట నేలమట్టం కావడంతో రైతులు తీవ్ర ఆవేదనకు గురవుతున్నారు.ఈ సందర్భంగా గ్రామ రైతు కూనపనేని ప్రసాద్ మాట్లాడుతూ, ఎంతో కష్టపడి, అప్పులు చేసి, పెట్టుబడులు పెట్టి సాగు చేసిన వరి పంట తుఫాను ప్రభావంతో పూర్తిగా నేలకొరిగిందని, దీంతో రైతులు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొనే పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు.
ముఖ్యంగా ఎల్‌నినో ప్రభావంతో ఇప్పటికే తీవ్ర అనావృష్టి పరిస్థితులు నెలకొని, వర్షాభావం కారణంగా రైతులు సాగు సమయంలో ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొన్నారని తెలిపారు. సరైన వర్షాలు లేకపోయినా, ఎన్నో కష్టనష్టాలకు ఓర్చి, నీటి కోసం ఇబ్బందులు పడుతూ, అధిక ఖర్చులు భరిస్తూ ఎంతో శ్రమించి వరి పంటను కాపాడుకున్నారని పేర్కొన్నారు. పంట చేతికొచ్చే సమయంలో తుఫాను రూపంలో ప్రకృతి మరోసారి రైతులపై పగబట్టినట్లుగా తీవ్ర నష్టం కలిగించిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికే అనావృష్టితో ఆర్థికంగా కుంగిపోయిన రైతులకు ఇప్పుడు తుఫాను కారణంగా పంట నేలకొరగడం మరింత కోలుకోలేని నష్టాన్ని మిగిల్చిందని అన్నారు.ప్రభుత్వ అధికారులు తక్షణమే గ్రామంలో పర్యటించి పంట నష్టాన్ని క్షేత్రస్థాయిలో పరిశీలించి, సమగ్రంగా నష్టాన్ని అంచనా వేయాలని కోరారు. నష్టపోయిన ప్రతి రైతు వివరాలను నమోదు చేసి, ప్రభుత్వం తక్షణమే న్యాయమైన నష్టపరిహారం అందించాలని, రైతులకు అవసరమైన సహాయ చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు.అదేవిధంగా స్థానిక ఎమ్మెల్యే మరియు ప్రభుత్వ విప్ శ్రీమతి తంగిరాల సౌమ్య ప్రత్యేక చొరవ తీసుకొని సంబంధిత వ్యవసాయ, రెవెన్యూ అధికారులతో మాట్లాడి, చింతలపాడు గ్రామంలో జరిగిన పంట నష్టంపై ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు. బాధిత రైతులకు త్వరితగతిన న్యాయం జరిగేలా ప్రభుత్వ పరంగా తక్షణ చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో గ్రామానికి చెందిన పలువురు రైతులు పాల్గొని తమ పంట నష్టాన్ని వివరిస్తూ ప్రభుత్వానికి తమ ఆవేదనను తెలియజేశారు. ప్రకృతి వైపరీత్యాల కారణంగా వరుసగా నష్టపోతున్న రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని, అనావృష్టి మరియు తుఫాను కారణంగా జరిగిన నష్టాలను పరిగణనలోకి తీసుకొని, నష్టపోయిన ప్రతి రైతుకు న్యాయమైన పరిహారం అందించాలని వారు ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేశారు.



పెద్దవాగు ప్రాజెక్టు ఉగ్రరూపం.. వేలేరుపాడు మండలంలో హైఅలర్ట్!



వేలేరుపాడు మండలం నవంబర్ 05(ప్రజా వీక్షణం)

పెద్దవాగు ప్రాజెక్టుకు భారీగా వరద నీరు పోటెత్తుతుండటంతో వేలేరుపాడు మండలంలో తీవ్ర భయాందోళనకర పరిస్థితులు నెలకొన్నాయి. ప్రాజెక్టు నిండుకుండలా మారుతుండటంతో దిగువ ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేస్తూ అధికార యంత్రాంగం రంగంలోకి దిగింది. వరద ఉధృతి ప్రమాదకర స్థాయికి చేరుతుండటంతో మండలంలోని పలు గ్రామాలకు తీవ్ర ముంపు ప్రమాదం పొంచివున్నట్లు అధికారులు హెచ్చరికలు జారీ చేశారు.ఈ నేపథ్యంలో కమ్మరిగూడెం, ఒంటిబండ, కోయమాదారం, అల్లూరి నగర్, సోందే గొల్లగూడెం, వసంతవాడ, గుళ్ళవాయి, కూచిరాల తదితర గ్రామాల ప్రజలు తక్షణమే అప్రమత్తమై సురక్షితమైన ప్రదేశాలకు, పునరావాస కేంద్రాలకు తరలివెళ్లవలసిందిగా అధికారులు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. ప్రాణనష్టం జరగకుండా ఉండేందుకు క్షేత్రస్థాయిలో అధికారులు ముమ్మరంగా చర్యలు చేపట్టారు.
ఈ అకస్మిక వరద తాకిడి కారణంగా మండలవ్యాప్తంగా రైతులు తీవ్ర కోలుకోలేని నష్టాన్ని చవిచూశారు. వందలాది ఎకరాల్లోని వ్యవసాయ భూములు పూర్తిగా జలమయం కావడంతో, చేతికి వచ్చిన పంటలన్నీ నీట మునిగి పూర్తిగా దెబ్బతిన్నాయి. సర్వస్వం కోల్పోయిన అన్నదాతలు దిక్కుతోచని స్థితిలో ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.
ప్రమాద తీవ్రత ఎక్కువగా ఉన్న కమ్మరిగూడెం గ్రామంలో పరిస్థితి మరింత ఆందోళనకరంగా మారింది. దీంతో సీఐ సురేష్ స్వయంగా రంగంలోకి దిగి, గ్రామస్థులతో మాట్లాడి వారిని అక్కడి నుండి సురక్షిత ప్రాంతాలకు ఖాళీ చేయించే బాధ్యతను భుజాన వేసుకున్నారు. ఎలాంటి ప్రాణనష్టం జరగకుండా పోలీసు, రెవెన్యూ సిబ్బంది సహాయక చర్యలను వేగవంతం చేశారు. ప్రజలందరూ ఎలాంటి అజాగ్రత్తకు తావివ్వకుండా, అధికారుల సూచనలను పాటిస్తూ పూర్తిస్థాయిలో సహకరించాలని అధికారులు విజ్ఞప్తి చేస్తున్నారు.



హిమ్మత్ నగర్, కురిక్యాల, గంగాధర, లక్ష్మీదేవిపల్లి గ్రామాల్లో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించిన ఎమ్మెల్యే

చొప్పదండి ని.వ గంగాధర మండలం నవంబర్ 4 (ప్రజా వీక్షణం)

ప్రభుత్వం ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన కొనుగోలు కేంద్రాల్లోనే రైతులు దాన్యం అమ్మి మద్దతు ధర పొందాలని ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం సూచించారు. కరీంనగర్ జిల్లా గంగాధర మండలం హిమ్మత్ నగర్, కురిక్యాల,గంగాధర, లక్ష్మీదేవిపల్లి గ్రామాల్లో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను బుధవారం ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు దళారులను నమ్మి మోసపోవద్దని సూచించారు. రైతులు ఇబ్బంది పడకుండా కొనుగోలు కేంద్రాల నిర్వహకులు ఏర్పాట్లు చేయాలని సూచించారు. గన్ని సంచులు, పరదాలు, తూకం యంత్రాలను అందుబాటులో ఉంచాలని పేర్కొన్నారు. కేంద్రాలకు ధాన్యం తీసుకువచ్చిన రైతుల వివరాలను నమోదు చేసుకొని, తేమ శాతం వచ్చిన వెంటనే వడ్లు కొనుగోలు చేయాలని, రైతు వివరాలను ఆన్లైన్లో నమోదు చేసి రైతుల ఖాతాలో ధాన్యం డబ్బులు జమ అయ్యేలా చూడాలని సూచించారు. కేంద్రాల్లో ఏవైనా ఇబ్బందులు ఉంటే తమ దృష్టికి తీసుకువస్తే పరిష్కరిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ రెవెన్యూ శ్రీనివాసరెడ్డి, జిల్లా సహకార అధికారి రామాంజనేయ చార్య, సింగిల్ విండో చైర్మన్లు వెలిచాల తిర్మల్ రావు, దూలం బాల గౌడ్, తాసిల్దార్ అంబటి రజిత, ఎంపీడీవో రామ్, ఏపిఎం కుమారస్వామి కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మంత్రి మహేందర్,మహిళా కాంగ్రెస్ మండల అధ్యక్షురాలు చిరుత మంగ,మాజీ జెడ్పిటిసి సత్తు కనకయ్య,జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షులు పురుమల్ల మనోహర్, సర్పంచ్ ల ఫోరమ్ మండల అధ్యక్షుడు ముద్దం నగేష్,సర్పంచ్ లు పడాల భాగ్యలక్ష్మి రాజన్న,రామిడి రాజిరెడ్డి,బాసవేని శ్రీనివాస్,రేండ్ల శ్రీనివాస్,బీర్ల ఆనంద్,ఆరె తేజశ్రీ – రాజశేఖర్,మల్కాపురం రాజేశ్వరి రాజేశం,కడారి రేణుక కనకయ్య,చిందం ఆంజనేయులు,కోలేపాక కవిత మల్లేశం,ధీకొండ బాబలక్ష్మి మధు,గుండవేని లావణ్య తిరుపతి,గుడి రజని ప్రవీణ్ రెడ్డి,రాచమల్ల రవి,కాంగ్రెస్ నాయకులు రొమాల రమేష్, సాగి అజయ్ రావు,రాచమల్ల భాస్కర్,గుజ్జుల బాపు రెడ్డి,అత్తపురం తిరుపతి, గంగాధర ప్రవీణ్,కడారి కుమారస్వామి,అట్ల రాజి రెడ్డి,అట్ల శేఖర్ రెడ్డి,పిట్టల కమలాకర్,వేముల అంజి,పొత్తూరి ప్రభాకర్,తాళ్ల సురేష్,జారతి సత్తన్న,ఆకుల అంజన్న,పవుల్,బెజ్జంకి కళ్యాణ్ , తాళ్ల దిలీప్,కార్యకర్తలు మరియు రైతులు పాల్గొన్నారు.

ప్రజావీక్షణం
దినపత్రిక

GENERAL NEWS

05 గురువారం నవంబర్ 2026

7

www.prajaveekshanam.in

ఎన్నికల సెలవుల్లోనూ ప్రైవేట్ టీచర్లకు తప్పని తిప్పలు:

బాపట్లలో ప్రవేట్ స్కూల్ యాజమాన్యాల హుకుంపై విద్యాశాఖ చర్యలు తీసుకోవాలని డిమాండ్.



బాపట్ల : నవంబర్ 4 (ప్రజా వీక్షణం)

రాష్ట్రంలో ఎన్నికల నేపథ్యంలో ప్రభుత్వం అధికారికంగా విద్యాసంస్థలకు సెలవులు ప్రకటించినప్పటికీ, బాపట్ల పట్టణంలోని ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు ఉపాధ్యాయుల పట్ల అత్యంత కఠినంగా, పక్షపాత ధోరణితో వ్యవహరిస్తున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ప్రజాస్వామ్యంలో అత్యంత కీలకమైన ఓటు హక్కును వినియోగించుకోవడానికి వెళ్లే ఉపాధ్యాయులకు కనీస ఊరట ఇవ్వకుండా, ఖచ్చితంగా స్కూళ్లకు హాజరు కావాలంటూ యాజమాన్యాలు జారీ చేస్తున్న హుకుంలపై ప్రైవేట్ టీచర్లు తీవ్ర ఆగ్రహం, ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.ఓటు హక్కుకు ఆటంకం: దూరప్రాంతాల టీచర్ల ఆందోళనసెలవు దినాల్లో కూడా పాఠశాలలకు రావలసిందేనని యాజమాన్యాలు నిబంధనలు పెట్టడం వల్ల, ఓట్లు వేయడానికి తమ సొంత ఊర్లకు లేదా దూర ప్రాంతాలకు వెళ్లాల్సిన ఉపాధ్యాయులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఒకవైపు ప్రభుత్వం ప్రతి ఒక్కరూ ఓటు హక్కు వినియోగించుకోవాలని అవగాహన కల్పిస్తుంటే, ప్రైవేట్ విద్యాసంస్థలు మాత్రం తమ స్వార్థం కోసం ఉపాధ్యాయుల పౌర హక్కులను కాలరాస్తున్నాయని ఉపాధ్యాయ సంఘాలు మండిపడుతున్నాయి.

జిల్లా విద్యాశాఖ అధికారులు స్పందించాలిప్రభుత్వ నిబంధనలను బేఖాతరు చేస్తూ, ఉపాధ్యాయులపై ఒత్తిడి తెస్తున్న ప్రైవేట్ స్కూల్స్ యాజమాన్యాల తీరుపై బాపట్ల జిల్లా విద్యాశాఖ అధికారులు (డిఈఓ)తక్షణమే స్పందించి కఠిన చర్యలు తీసుకోవాలని బాధితులు కోరుతున్నారు.ఎన్నికల నిబంధనలను ఉల్లంఘిస్తూ సెలవు రోజుల్లో స్కూళ్లు నడిపించే లేదా ఉపాధ్యాయులను విధులకు రమ్మని ఒత్తిడి చేసే విద్యాసంస్థల గుర్తింపును రద్దు చేయాలని డిమాండ్ చేస్తున్నారు.దూర ప్రాంతాలకు వెళ్లి ఓటు వేయాల్సిన ప్రైవేట్ ఉపాధ్యాయులను ఉన్నతాధికారులు ఆదుకోవాలని, తమకు న్యాయం జరిగేలా చూడాలని పట్టణంలోని ప్రైవేట్ స్కూల్స్ టీచర్లు విజ్ఞప్తి చేస్తున్నారు.

జమ్ములపాలెం కాలనీ చర్చి నందు ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాన్ని పరిశీలించిన జిల్లా కలెక్టర్

బాపట్ల : నవంబర్ 04 (ప్రజా వీక్షణం)

బాపట్ల జిల్లా లో మురసు తుఫాన్ ప్రభావం నేపథ్యంలో లోతట్టు ప్రాంతాల గ్రామ ప్రజలను బాపట్ల మండలంలోని జమ్ములపాలెం గ్రామం చర్చి నందు ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాలలో ఉన్న వారిని బుధవారం రాత్రి జిల్లా కలెక్టర్ డాక్టర్ వి.వినోద్ కుమార్ పరిశీలించారు.పునరావాస కేంద్రాల్లో ఆశ్రయం పొందుతున్న ప్రజలతో మాట్లాడి వారి క్షేమ సమాచారాన్ని అడిగి తెలుసుకున్నారు.వారికి అందిస్తున్న భోజనం, తాగునీరు, ఇతర మౌలిక సదుపాయాల గురించి ఆరా తీశారు. బాధితులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన అన్ని సదుపాయాలు కల్పించాలని అధికారులను ఆదేశించారు.పునరావాస కేంద్రం వద్ద యండి ఆర్ ఎఫ్ బృందాన్ని అందుబాటులో ఉంచాలని, పిల్లలు వయోవృద్ధులు బయటకు వెళ్లకుండా ఉండాలని సూచించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ పిల్లల కు బిస్కెట్లు పంపిణీ చేశారు.జిల్లా కలెక్టర్ వెంట జిల్లా అగ్నిమాపక అధికారి వినయ్,ఇరిగేషన్ శాఖ డి ఈ ధనలక్ష్మి,తహశీల్దార్ షేక్ సలీమా,వి ఆర్ ఓ లు తదితరులు ఉన్నారు.



15 కేవీ సామర్థ్యంతో రెండు ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు.

కొమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా నవంబర్ 04 (ప్రజా వీక్షణం న్యూస్)

కొమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా కాగజ్ నగర్ మండలంలోని కోసిని గ్రామంలో ప్రజా బాట కార్యక్రమంలో భాగంగా కోసిని గ్రామంలో విద్యుత్ శాఖ అధికారులు పర్యటించారు. గ్రామ ప్రజల విద్యుత్ సమస్యలను పరిష్కరించే దిశగా 15 కేవీ సామర్థ్యంతో రెండు ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేశారు.ఈ కార్యక్రమంలో ఆసిఫాబాద్‌కు చెందిన డి.ఈ. టెక్నికల్ అండ్ సేఫ్టీ ఆఫీసర్ వి. సుధాకర్, ఏఈ రాంప్రసాద్‌తో పాటు విద్యుత్ శాఖ సిబ్బంది పాల్గొన్నారు. గ్రామ సర్పంచ్ వసాకే పుల్లబాయి, వార్డు మెంబర్ శ్రీనివాస్, గ్రామ పెద్దలు రామయ్య, శ్రీను, హన్మంతు తదితరులు పాల్గొన్నారు.ప్రజా బాట కార్యక్రమం ద్వారా గ్రామస్థాయిలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను అధికారులు పరిశీలించి, వాటి పరిష్కారానికి చర్యలు చేపడుతున్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా రెండు ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటు జరగడంతో గ్రామంలో విద్యుత్ సరఫరా సమస్యల పరిష్కారానికి దోహదపడుతుందని గ్రామస్థులు ఆశాభావం వ్యక్తం చేశారు.

12 ఏళ్ల సాగునీటి కష్టాలకు తెర..
300 ఎకరాలకు నీరందేలా కృషి చేసిన వసాకే హన్మంతు...

హన్మంతు సేవలకు రైతుల నీరాజనం.. ఘనంగా సన్మానం...



సిర్పూర్ కాగజ్ నగర్ ప్రతినిధి: నవంబర్ 4(ప్రజా వీక్షణం న్యూస్)

కొమురం భీమ్ ఆసిఫాబాద్ కాగజ్‌నగర్ మండలం కోసిని గ్రామపంచాయతీ పరిధిలోని కోతులకుంట ప్రాంత రైతులు గత 12 ఏళ్లుగా ఎదుర్కొంటున్న సాగునీటి కష్టాలకు ఎట్టకేలకు పరిష్కారం లభించింది. సుమారు 300 ఎకరాల వ్యవసాయ భూములకు సాగునీరు అందక రైతులు పడుతున్న ఇబ్బందులను గుర్తించిన కాగజ్‌నగర్ మండల మాలి సంఘం జనరల్ సెక్రటరీ వసాకే హన్మంతు ప్రత్యేక చొరవ తీసుకుని సమస్య పరిష్కారానికి కృషి చేశారు.చిన్న కాలువలు సక్రమంగా లేకపోవడంతో ఏళ్ల తరబడి సాగునీరు అందక పంటలు ఎండిపోయే దుస్థితి నెలకొంది. రైతుల కష్టాలను గుర్తించిన హన్మంతు సంబంధిత అధికారులతో పలుమార్లు సంప్రదింపులు జరిపి, కాలువల సమస్యను పరిష్కరించేలా కృషి చేశారు. ఆయన నిరంతర ప్రయత్నాల ఫలితంగా సుమారు 300 ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందడంతో రైతుల్లో ఆనందం వెల్లివిరిసింది.రైతుల కష్టానికి అండగా నిలిచిన సేవకు ఘన గుర్తింపు12 ఏళ్లుగా పరిష్కారం కోసం ఎదురుచూస్తున్న సాగునీటి సమస్యను పరిష్కరించేందుకు చొరవ చూపిన వసాకే హన్మంతును కోసిని గ్రామ సర్పంచ్ వసాకే పుల్లబాయి ఆధ్వర్యంలో రైతులు, గ్రామ పెద్దలు, యువకులు, మహిళలు ఘనంగా సన్మానించి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ.. రైతుల కష్టాలను తనవిగా భావించి, వందల ఎకరాలకు సాగునీరు అందేలా కృషి చేయడం అభినందనీయమని కొనియాడారు. పదేళ్లకు పైగా వేధిస్తున్న సమస్య పరిష్కారానికి చొరవ చూపిన హన్మంతు సేవలను రైతులు ఎప్పటికీ మరువబోమని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో రైతులు మల్లికార్జున్, రవి, రామయ్య, రవీందర్, శ్రీనివాస్, మోతిరావు, నవీన్, మమత, సుశీల, మోదంపూరి శంకర్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.12 ఏళ్ల నిరీక్షణకు ఫలితం.. 300 ఎకరాల రైతులకు సాగునీటి భరోసా కల్పించడంలో కీలకంగా కృషి చేసిన వసాకే హన్మంతుకు గ్రామ రైతుల నుంచి అభినందనలు వెల్లువెత్తాయి...

బొల్లారంలో రోడ్డులోకి కుంగిపోయిన మ్యాన్‌హోల్..
ప్రమాదాలకు ఆహ్వానం!

రోడ్డు స్థాయికి దిగువకు వెళ్లిన మ్యాన్‌హోల్‌తో వాహనదారులకు తప్పని ఇబ్బందులు.. పట్టించుకోని అధికారులు!

పటాన్ చేరు: నవంబర్ 4 (ప్రజా వీక్షణం)



బొల్లారం డివిజన్ 272 ఎస్ సి కాలనీ అంగన్‌వాడీ కేంద్రానికి చిన్న పిల్లలు, గర్భిణులు మరియు బాలింతలు నిత్యం వచ్చి వెళ్తుంటారు. ఈ క్రమంలో రహదారిపై కుంగిపోయిన మ్యాన్ హోల్ వల్ల చిన్న పిల్లలకు లేదా రాత్రి వేళల్లో వెళ్లే పాదచారులకు . వాహనలకు.ముప్పు వాటిల్లే అవకాశం ఉందని స్థానికులు అధికారుల దృష్టికి తీసుకొచ్చారు.

ఎస్‌డబ్ల్యూసీ గోదాంలో కలెక్టర్, ఎస్పీ తనిఖీలు.

-బియ్యం నాణ్యతలో రాజీ పడొద్దు.. అధికారులకు కలెక్టర్ ఆదేశం.

-ఆరు బఫర్ గోదాంల హమాలీలకు లేబర్ కార్డులు ఇప్పిస్తాం.

గోదాంలలో బియ్యం నిల్వ, నాణ్యత విషయంలో ఎలాంటి నిర్లక్ష్యం చేయొద్దని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ అధికారులను ఆదేశి ంచారు. బుధవారం కోదాడ సమీపం లోని బాలాజీనగర్ ఎస్‌డబ్ల్యూసీ గోదా ంను జిల్లా కలెక్టర్, ఎస్పీ కె. నరసింహ సందర్శించి తనిఖీలు నిర్వ హించారు. గోదాంలోని బియ్యం నిల్వలను, నిర్వహణ తీరును పరిశీలిం చారు. స్టాక్ రికార్డులను తనిఖీ చేయడంతో పాటు బియ్యం శాంపిల్స్ సేకరించి నాణ్యత పరీక్షలు చేయిం చారు. పరీక్ష ఫలితాలు సంతృ ప్తికరంగా ఉన్నాయని అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లా డుతూ పేదలకు పంపిణీ చేసే సన్న బియ్యాన్ని జాగ్రత్తగా నిల్వ చేయాలని సూచించారు. బియ్యం నాణ్యత విషయంలో ఎలాంటి రాజీ పడకూడదని గోదాం మేనేజర్, టెక్నికల్ అసిస్టెంట్లకు స్పష్టం చేశారు. నిల్వ చేసే విధానం, భద్రతా ప్రమాణాలు, ఫస్ట్ ఇన్ ఫస్ట్ అవుట్ (ఎఫ్ఐఎఫ్ఓ) పద్ధతిని తప్పనిసరిగా పాటించాలని ఆదేశించారు. రికార్డులను ఎప్పటికప్పుడు సక్రమంగా నిర్వహించాలని సూచించారు.హమాలీలకు లేబర్ కార్డులు అనంతరం గోదాంలో పనిచేస్తున్న హమాలీలతో కలెక్టర్ మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. తమకు లేబర్ కార్డులు ఇప్పించాలని వారు కోరగా కలెక్టర్ వెంటనే స్పందించారు. సంబంధిత లేబర్ అధికారితో మాట్లాడి జిల్లాలోని ఆరు బఫర్ గోదాంలలో పనిచేస్తున్న హమాలీలందరికీ లేబర్ కార్డులు అందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. హమాలీల ఇతర సమస్యలను కూడా పరిశీలించి పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. దీంతో హమాలీలు కలెక్టర్‌కు కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఆర్డిఓ సూర్యనారాయణ, జిల్లా సివిల్ సప్లైస్ మేనేజర్ శ్రీధర్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్ రమాదేవి, తాసిల్దార్ సంతోష్ కిరణ్ ఎస్‌డబ్ల్యూసీ మేనేజర్ సందీప్, టెక్నికల్ అసిస్టెంట్లు భాస్కర్ రెడ్డి, అరుణ తదితరులు పాల్గొన్నారు.

ప్రజావీక్షణం
దినపత్రిక

ఏపీ మున్సిపల్ ఎన్నికల విజయంపై జనసేన నేతల హర్షం

పవన్ కళ్యాణ్ నాయకత్వానికి ప్రజల మద్దతు .. దాసరి రావిష్

మహబూబాబాద్, ప్రతినిధి (నవంబర్ 4) (ప్రజా వీక్షణం)న్యూస్ :

ఆంధ్రప్రదేశ్ మున్సిపల్ ఎన్నికల్లో ఎన్డీఏ కూటమి సాధించిన విజయంపై మహబూబాబాద్ జిల్లా జనసేన పార్టీ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. జనసేన పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ నాయకత్వం పై ప్రజలు విశ్వాసం ఉంచారని పార్టీ పార్లమెంట్ నియోజకవర్గ కో-ఆర్డినేటర్ దాసరి రావిష్ పేర్కొన్నారు. ఈ విజయం ప్రజాస్వామ్యానికి, ప్రజల ఆకాంక్షలకు ప్రతిబింబమని అన్నారు. ఎన్నికల్లో విజయం సాధించిన జనసేన అభ్యర్థులకు ఆయన అభినందనలు తెలిపారు. ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేరుస్తూ పట్టణాల అభివృద్ధికి కృషి చేయాలని ఆకాంక్షిస్తూ, పవన్ కళ్యాణ్ అవినీతి రహిత పాలన లక్ష్యంగా చేస్తున్న కృషికి ప్రజల మద్దతు లభిస్తోందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా జిల్లా ఇన్‌చార్జి మెరుగు చక్రపాణి, డోర్నకల్ నియోజకవర్గ ఇన్‌చార్జి చింత రమేష్, నాయకులు ఎండీ ఆసిఫ్, వేర్పుల అనిల్, కె. ఉదయ్, మేకల గోపాల్, తగరం వివేక్, చక్రధర్, రాధాకృష్ణన్, దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొని విజయోత్సవం నిర్వహించారు.



ఆర్టీసీ కండక్టర్ ప్రవళిక మృతి బాధాకరం

ప్రవళిక కుటుంబాన్ని ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకోవాలి మాజీ జెడ్పీటీసీ పాల్వంచ దుర్గ

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి (ప్రజా వీక్షణం)నవంబర్: 04




అశ్వాపురం మండలం మిట్టగూడెం గ్రామ సమీపంలో గత నెల 25వ తేదీన జరిగిన ఆర్టీసీ బస్సు వివాదంలో తీవ్రంగా గాయపడిన ఆర్టీసీ కండక్టర్ ప్రవళిక మృతి చెందడం అత్యంత బాధాకరమని మాజీ జెడ్పీటీసీ పాల్వంచ దుర్గ ఆవేదన వ్యక్తం చేశారు.బస్సు వివాదం నేపథ్యంలో చోటుచేసుకున్న ఘటనలో కండక్టర్ ప్రవళిక బస్సు టైర్ల కింద పడి తీవ్ర గాయాలపాలయ్యారు. వెంటనే మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌కు తరలించగా, అప్పటి నుంచి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ బుధవారం ఉదయం సుమారు 10 గంటల సమయంలో మృతి చెందినట్లు సమాచారం.ప్రవళిక మృతి పట్ల పాల్వంచ దుర్గ తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. విధి నిర్వహణలో జరిగిన ఈ విషాద ఘటనలో ఒక మహిళా ఉద్యోగిని ప్రాణాలు కోల్పోవడం బాధాకరమన్నారు. ప్రవళిక కుటుంబం పెద్ద దిక్కును కోల్పోయి తీవ్ర విషాదంలో మునిగిపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రవళిక కుటుంబాన్ని ప్రభుత్వం తక్షణమే ఆదుకోవాలని, కుటుంబంలో అర్హులైన ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం కల్పించాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా ప్రభుత్వం తగిన ఆర్థిక సహాయం అందించి, బాధిత కుటుంబానికి అండగా నిలవాలని కోరారు. ఇలాంటి కష్ట సమయంలో ప్రవళిక కుటుంబ సభ్యులు ధైర్యం కోల్పోకుండా ఉండాలని, సమాజంలోని ప్రతి ఒక్కరూ వారికి అండగా నిలిచి మనోధైర్యం కల్పించాలని పాల్వంచ దుర్గ విజ్ఞప్తి చేశారు.ప్రవళిక మృతి పట్ల మరోసారి ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ, ఆమె కుటుంబానికి తన సంతాపాన్ని వ్యక్తం చేశారు.

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ని కలిసిన టీజేఎస్ రాష్ట్ర కమిటీ

హుజూరాబాద్: నవంబర్ 4 (ప్రజా వీక్షణం)

తెలంగాణ జన సమితి రాష్ట్ర అధ్యక్షులు, ఎమ్మెల్సీ కోదండరాం నాయకత్వంలో టీజేఎస్ రాష్ట్ర కమిటీ మంగళవారం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలిసి రాష్ట్రంలో పెండింగ్ లో ఉన్న పలు సమస్యలతో పాటు స్థానిక సమస్యలను చర్చించినట్లు తెలంగాణ జన సమితి రాష్ట్ర ఉపాధ్యక్షులు ముక్కెర రాజు తెలిపారు. ఎన్నినో కారణంగా ఇబ్బంది పడుతున్న రైతులను ఆదుకోవాలని, విద్యార్థులకు రావాల్సిన ఫీజ్ రీయింబర్స్మెంట్ బకాయిలను వెంటనే చెల్లించాలని, ఖాళీగా ఉన్న పోస్టులను వెంటనే భర్తీ చేయాలని, తెలంగాణ ఉద్యమకారుల కోసం తగిన సహాయక చర్యలను తీసుకోవాలని పెండింగ్ లో ఉన్న ప్రాజెక్టుల నిర్మాణాన్ని పూర్తి చేయాలని, ఉద్యోగులకు రావాల్సిన బకాయిలను వెంటనే చెల్లించాలని, వారు ముఖ్యమంత్రిని కోరగా దానికి సానుకూలంగా స్పందించిన ముఖ్యమంత్రి అన్ని సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చినట్లు ముక్కెర రాజు తెలిపారు.



సింగరేణి ఎస్ఎంఎస్ ప్లాంట్‌లో టన్నేజ్ బేసిస్ మాయాజాలం...!



టన్నేజ్ కాంట్రాక్టు ఎందుకు? ఆన్‌లైన్ మస్టర్ల నాటకం ఎందుకు...?

కాంట్రాక్టర్‌కు లాభాలా...? కార్మికులకు కష్టాలా...? సింగరేణికి ఆర్థిక భారమా...?

టన్నేజ్ విధానం తొలగించి ఎం అండ్ ఆర్ మస్టర్లు అమలు చేస్తే సంస్థకు ఆదా కాదా...?

18 ఏళ్ల ప్లాంట్ చరిత్రలో ఎన్నడూ లేని విధానాలపై ఉన్నతాధికారులు సమాధానం చెప్పాలి...!

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి (ప్రజా వీక్షణం) నవంబర్ : 04

కోట్లాది రూపాయల ప్రజాధనంతో నడుస్తున్న సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ మణుగూరు ఏరియా ఎస్ఎంఎస్ ప్లాంట్‌లో అసలు ఏం జరుగుతోంది? టన్నేజ్ బేసిస్ కాంట్రాక్టు ఒకవైపు.. ఆన్‌లైన్ మస్టర్ల నిర్వహణ మరోవైపు.. అసలు ఈ రెండు విధానాల మధ్య ఉన్న సంబంధం ఏమిటి? కాంట్రాక్టర్ టన్నేజ్ ప్రాతిపదికన పనులు నిర్వహిస్తున్నప్పుడు మళ్లీ ఎం అండ్ ఆర్ మస్టర్లను ఆన్‌లైన్ విధానంలో ఎందుకు అనుసంధానం చేస్తున్నారు? ఈ విధానం వల్ల ఎవరికి ప్రయోజనం? సంస్థకు లాభమా? నష్టమా? కార్మికులకు మాత్రం ఎందుకు ఇబ్బందులు? అనే ప్రశ్నలు ఇప్పుడు తీవ్ర చర్చనీయాంశంగా మారుతున్నాయి.

టన్నేజ్ బేసిస్ కాంట్రాక్టు ఉంటే మస్టర్ల అవసరం ఏమిటి...?

సింగరేణిలోని ఇతర ఏరియాలతో పోలిస్తే రామగుండం, మణుగూరు ఎస్ఎంఎస్ ప్లాంట్లలో టన్నేజ్ బేసిస్ విధానం అమలుపై ప్రశ్నలు తలెత్తుతున్నాయి. కాంట్రాక్టర్‌కు టన్నేజ్ ప్రాతిపదికన పనులు అప్పగించినప్పుడు, అదే పనులకు సంబంధించి ఆన్‌లైన్ మస్టర్లను ఎందుకు అనుసంధానం చేస్తున్నారు? టన్నేజ్ బేసిస్ విధానంలో కాంట్రాక్టర్‌కు చెల్లింపులు ఏ ప్రాతిపదికన చేస్తున్నారు? ఎం అండ్ ఆర్ మస్టర్లలో కార్మికుల హాజరు ఏ ప్రాతిపదికన నమోదు చేస్తున్నారు? ఈ రెండు విధానాలను కలిపి అమలు చేయడానికి ఉన్న ఒప్పంద నిబంధనలు ఏమిటి?సింగరేణి ఉన్నతాధికారులు ఈ ప్రశ్నలకు స్పష్టమైన సమాధానం చెప్పాలి. నిబంధనల పేరుతో కార్మికులను ఇబ్బందులకు గురిచేసే పరిస్థితులు ఉంటే వాటిని తక్షణమే సమీక్షించాలి.

టన్నేజ్ విధానం తొలగిస్తే సింగరేణికి ఆదా కాదా...?

ఇక్కడ అసలు ప్రశ్న ఇదే! టన్నేజ్ బేసిస్ విధానం వల్ల సంస్థకు ఎంత ఖర్చవుతోంది? అదే పనులను టన్నేజ్ బేసిస్ విధానం తొలగించి నేరుగా ఎం అండ్ ఆర్ మస్టర్ల విధానంలో నిర్వహిస్తే సింగరేణికి ఎంత ఆర్థిక ప్రయోజనం కలుగుతుంది?ఒకవైపు టన్నేజ్ కాంట్రాక్టు చెల్లింపులు.. మరోవైపు మస్టర్ల నిర్వహణ.. ఈ విధానం వల్ల సంస్థపై పడుతున్న ఆర్థిక భారాన్ని ఎప్పుడైనా అధికారులు లెక్కించారా? టన్నేజ్ బేసిస్ కాంట్రాక్టు కొనసాగించడం సంస్థకు నిజంగా ఆర్థికంగా ప్రయోజనకరమా? లేక ఎం అండ్ ఆర్ మస్టర్ల విధానంలో పనులు నిర్వహిస్తే సంస్థకు మరింత ఆదా అవుతుందా?ఈ రెండు విధానాలపై సమగ్ర ఆర్థిక విశ్లేషణ ఎందుకు చేయకూడదు? సింగరేణి ఖజానాకు లాభం చేకూర్చే విధానాన్ని అమలు చేయాల్సిన బాధ్యత అధికారులపై లేదా?

మ్యాన్‌పవర్ సరిపోదు.. కార్మికులపై పనిభారం మాత్రం ఎక్కువా...?

టన్నేజ్ బేసిస్ కాంట్రాక్టు నిర్వహిస్తున్న కాంట్రాక్టర్ అవసరమైన మేరకు మ్యాన్‌పవర్‌ను సమకూర్చడం లేదని కార్మికుల నుంచి ఆరోపణలు వినిపిస్తున్నాయి. తగినంత మంది కార్మికులను కేటాయించకుండా ఉన్న సిబ్బందిపైనే పనిభారం మోపుతున్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.కాంట్రాక్టు నిబంధనల ప్రకారం ఎంతమంది కార్మికులు ఉండాలి? వాస్తవంగా ఎంతమంది విధులకు హాజరవుతున్నారు? ఆన్‌లైన్ మస్టర్లలో ఎంతమంది నమోదు అవుతున్నారు? కాంట్రాక్టర్ సమర్పిస్తున్న బిల్లుల్లో ఎంతమంది కార్మికుల వివరాలు చూపిస్తున్నారు? వాస్తవ పరిస్థితులకు, రికార్డులకు మధ్య ఏమైనా వ్యత్యాసాలు ఉన్నాయా?ఈ వివరాలపై విజిలెన్స్, అంతర్గత ఆడిట్ అధికారులు తనిఖీలు నిర్వహించాల్సిన అవసరం ఉంది.

18 ఏళ్ల చరిత్ర కలిగిన ప్లాంట్‌లో ఇదేం కొత్త ప్రయోగం...?



2008లో ప్రారంభమైన మణుగూరు ఎస్ఎంఎస్ ప్లాంట్‌కు దాదాపు 18 ఏళ్ల చరిత్ర ఉంది. ఇన్నేళ్లుగా కొనసాగుతున్న ప్లాంట్‌లో ప్రస్తుతం అమలవుతున్న మస్టర్ల విధానం, టన్నేజ్ బేసిస్ కాంట్రాక్టు నిర్వహణపై కార్మికుల్లో అసంతృప్తి వ్యక్తమవుతోంది.గతంలో అమలైన విధానాలు ఏమిటి? ప్రస్తుతం తీసుకొచ్చిన మార్పులు ఏమిటి? ఈ మార్పులకు ఎవరు అనుమతించారు? వాటి వల్ల సంస్థకు, కార్మికులకు కలిగిన ప్రయోజనం ఏమిటి? అనే అంశాలపై పూర్తి వివరాలు వెల్లడించాలి.

ప్రాజెక్ట్ ఆఫీసర్ బాధ్యత ఏమిటి? పర్యవేక్షణ ఎక్కడ...?

ఎస్ఎంఎస్ ప్లాంట్ ప్రాజెక్ట్ ఆఫీసర్ ఈ వ్యవహారంపై సమాధానం చెప్పాల్సిన సమయం ఆసన్నమైంది. కాంట్రాక్టర్‌కు టన్నేజ్ బేసిస్‌పై పనులు అప్పగించినప్పుడు మ్యాన్‌పవర్ కొరత ఎందుకు ఏర్పడుతోంది? ఆన్‌లైన్ మస్టర్ల నిర్వహణలో పారదర్శకత ఉందా? కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించడానికి ఎలాంటి చర్యలు తీసుకున్నారు?

కార్మికుల ఇబ్బందులు అధికారుల దృష్టికి వస్తున్నా పరిష్కారం ఎందుకు కనిపించడం లేదు? కాంట్రాక్టు నిర్వహణపై నిరంతర పర్యవేక్షణ చేయాల్సిన బాధ్యత ఎవరిది? అధికారులు కేవలం రికార్డులకే పరిమితమవుతున్నారా? లేక క్షేత్రస్థాయిలో పరిస్థితులను పరిశీలిస్తున్నారా?

సింగరేణి ఉన్నతాధికారులకు సూటి ప్రశ్నలు...!

1.టన్నేజ్ బేసిస్ కాంట్రాక్టు, ఎం అండ్ ఆర్ ఆన్‌లైన్ మస్టర్లను ఒకేసారి నిర్వహించడానికి ఉన్న నిబంధన ఏమిటి...? 2.టన్నేజ్ బేసిస్ విధానం వల్ల సంస్థకు ఏటా ఎంత ఖర్చవుతోంది...? 3.ఎం అండ్ ఆర్ మస్టర్ల విధానంలో పనులు నిర్వహిస్తే సంస్థకు ఎంత ఆర్థిక ఆదా కలుగుతుంది...? 4.కాంట్రాక్టర్ సరిపడా మ్యాన్‌పవర్ సమకూర్చకపోతే బాధ్యత ఎవరిది...? 5.ఆన్‌లైన్ మస్టర్లు, వాస్తవ కార్మికుల హాజరు, కాంట్రాక్టర్ బిల్లులను ఎప్పుడైనా క్రాస్ చెక్ చేశారా...? 6.ఇతర ఏరియాలతో పోలిస్తే మణుగూరు ఎస్ఎంఎస్ ప్లాంట్‌లో భిన్నమైన విధానం అమలుకు అనుమతి ఎవరిచ్చారు...?

ఇప్పటికైనా ఉన్నతాధికారులు మేల్కొనాలి...!

మణుగూరు ఏరియా జనరల్ మేనేజర్, సింగరేణి డైరెక్టర్లు, సీఎండీ తక్షణమే స్పందించి ఎస్ఎంఎస్ ప్లాంట్‌లో అమలవుతున్న టన్నేజ్ బేసిస్ కాంట్రాక్టు, ఎం అండ్ ఆర్ మస్టర్ల విధానంపై సమగ్ర విచారణ చేపట్టాలి. కాంట్రాక్టు ఒప్పందాలు, టన్నేజ్ లెక్కలు, మ్యాన్‌పవర్ కేటాయింపులు, ఆన్‌లైన్ మస్టర్లు, బిల్లులు, చెల్లింపుల వివరాలను పరిశీలించాలి.సంస్థకు ఆర్థికంగా ప్రయోజనం కలిగించే విధానం ఏదో పారదర్శకంగా లెక్కించి నిర్ణయం తీసుకోవాలి. కార్మికులపై అనవసరమైన పనిభారం పడకుండా చూడాలి. కాంట్రాక్టర్ ప్రయోజనాల కంటే సింగరేణి సంస్థ ప్రయోజనాలు, కార్మికుల సంక్షేమానికి ప్రాధాన్యత ఇవ్వాలి.చివరిగా ఒకటే ప్రశ్న.. టన్నేజ్ బేసిస్ విధానం వల్ల సంస్థకు నిజంగా లాభం ఉంటే ఆ లెక్కలను బయటపెట్టండి. నష్టం ఉంటే ఆ విధానాన్ని కొనసాగించడానికి కారణం ఏమిటో చెప్పండి. ఎం అండ్ ఆర్ మస్టర్ల విధానంలో సంస్థకు ఆదా కలిగే అవకాశం ఉంటే దానిని ఎందుకు పరిశీలించడం లేదు?సింగరేణి అంటే కేవలం కాంట్రాక్టులు, బిల్లులు, మస్టర్లు కాదు.. వేలాది కార్మికుల శ్రమతో నిర్మితమైన సంస్థ. కార్మికులను ఇబ్బందులకు గురిచేసే విధానాలపై మౌనం వీడి, సంస్థకు నష్టం కలగకుండా, కార్మికులకు అన్యాయం జరగకుండా అధికారులు తక్షణమే చర్యలు తీసుకోవాలి. ఈ వ్యవహారంపై ఉన్నతస్థాయి విచారణ జరిపి వాస్తవాలను బహిర్గతం చేయాలని కార్మిక వర్గాలు డిమాండ్ చేస్తున్నాయి.

తెలంగాణ రక్షణ సేన బలోపేతమే లక్ష్యంగా ముందుకు సాగాలి

- తెలంగాణ రక్షణ సేనలో జిల్లా నూతన కమిటీల నియామకాలు
- అధ్యక్షులు శిరవేణి స్వప్న,నియోజకవర్గ అధ్యక్షుడు సలేంద్ర కొమురయ్య

పెద్దపల్లిప్రతినిధి (ప్రజా వీక్షణం)

క్షేత్రస్థాయిలో తెలంగాణ రక్షణ సేన పార్టీని తిరుగులేని శక్తిగా తీర్చిదిద్దడంతోపాటు బడుగు, బలహీన వర్గాల హక్కుల పరిరక్షణే ధ్యేయంగా పార్టీ బీసీ సెల్ కమిటీలను నియమించామ ని తెలంగాణ రక్షణ సేన పెద్దపల్లి జిల్లా అధ్యక్షురాలు శిరవేణి స్వప్న, నియోజక వర్గ అధ్యక్షుడు సలేంద్ర కొమురయ్య స్పష్టం చేశారు. తెలంగాణ రక్షణ సేన పార్టీ అధినేత్రి కల్వకుంట్ల కవిత ఆదేశాల మేరకు పెద్దపల్లి జిల్లా, నియోజకవర్గ, మండల స్థాయి నూతన కమిటీలను స్థానిక ప్రెస్ క్లబ్‌లో నిర్వహించిన సమావేశంలో పార్టీ జిల్లా అధ్యక్షులు శిరవేణి స్వప్న, పెద్దపల్లి నియోజకవర్గ అధ్యక్షుడు సలేంద్ర కొమురయ్య అధికారికంగా ప్రకటించారు. క్షేత్రస్థాయిలో సంస్థాగత నిర్మాణాన్ని పటిష్టం చేస్తూ, ప్రజల సమస్యలపై నిరంతరం గళమెత్తే సమర్థులైన నాయకులకు ఈ బాధ్యత లు అప్పగించినట్లు వారు వెల్లడించారు. ఈ నియామ కాల్లో జిల్లా బీసీ సెల్ అధ్యక్షుడిగా ఉస్తెం శ్రీనివాస్, జిల్లా ట్రేడ్ యూనియన్ అధ్యక్షుడిగా భోగాని శంకర్ గౌడ్, పెద్దపల్లి నియోజకవర్గ స్పోర్ట్స్ వింగ్ అధ్యక్షులుగా దాడి ప్రవంతి బాధ్యతలు స్వీకరించారు. మండల స్థాయి కమిటీల్లో భాగంగా పెద్దపల్లి రూరల్ అధ్యక్షుడి గా ఉప్పు గట్టేష్, ప్రధాన కార్యదర్శిగా ఎంచెర్ల స్వామి నియమితులు కాగా, సుల్తానాబాద్ రూరల్ అధ్యక్షుడిగా మల్యాల కరుణాకర్, ప్రధాన కార్యదర్శిగా పోసాని కృష్ణలకు బాధ్యతలు అప్పగించారు. అనంతరం జిల్లా అధ్యక్షురాలు శిరవేణి స్వప్న,నియోజకవర్గ అధ్యక్షుడు సలేంద్ర కొమురయ్య మాట్లాడుతూ వెనుకబడిన, బడుగు, బలహీన వర్గాల హక్కుల సాధన కోసం నూతన కమిటీల ప్రతినిధులు సైనికుల్లా పనిచేయాలని దిశానిర్దేశం చేశారు.పార్టీ అధినేత్రి కల్వకుంట్ల కవిత సంకల్పించిన పాంచజ న్యాలైన నాణ్యమైన ఉచిత విద్య,వైద్యం,ఆరోగ్యం,సామాజిక న్యాయం వంటి ఐదు కీలక అంశాలతో పాటు,భూమి లేని నిరుపేదలకు, నిర్వాసితు లకు అండగా నిలిచే ప్రతిష్టాత్మక భూలక్ష్మి-ఎకరం భూమి విధానాన్ని గ్రామగ్రామాన ప్రతి గడపకూ చేరవేసే బాధ్యతను కార్యకర్తలు భుజానకెత్తు కోవాలని పిలుపునిచ్చారు. అదేవిధంగా పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ఓటర్ నమోదు గడువు పొడిగింపు కోసం పార్టీ అధినేత్రి కల్వకుంట్ల కవిత స్వయంగా ఎన్నికల సంఘాన్ని కలిసి పోరాడారని, ఆమె విజ్ఞప్తికి స్పందించి గడువు పెంచినందుకు ఎన్నికల కమిషన్‌కు పెద్దపల్లి జిల్లా కమిటీ పక్షాన ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. నూతనంగా ఏర్పాటైన పార్టీ ఎజెండాను దృష్టిలో ఉంచుకుని అర్హులైన ప్రతి విద్యార్థి, పట్టభద్రుడు వెంటనే ఓటు హక్కు నమోదు చేసుకునేలా నాయకులు క్షేత్రస్థాయిలో సహకరించాలని కోరారు. రాబోయే రోజుల్లో పెద్దపల్లి జిల్లాలో తెలంగాణ రక్షణ సేనను తిరుగులేని శక్తిగా తీర్చిదిద్దుతామని నాయకులు స్పష్టం చేశారు. తమపై సంపూర్ణ విశ్వాసం తో గురుతర బాధ్యతలు అప్పగించిన పార్టీ అధినేత్రి కల్వకుంట్ల కవితకు నూతన బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు ఉస్తెం శ్రీనివాస్, కమిటీల బాధ్యులు కృతజ్ఞతలు తెలుపగా, కొత్తగా ఎన్నికైన వారికి స్థానిక నాయకులు, కార్యకర్తలు పూలమాలలు వేసి శుభాకాంక్షలు తెలియజేశారు.

Printed & published owned by K.SRAVAN KUMAR. Printed Published RK PRINTING PRESS at 6-1-948 Boyawada Street Nalgonda.Pin : 508001. Head office: 2-66-121/122

ప్రజావీక్షణం
దినపత్రిక
GENERAL NEWS
05 గురువారం నవంబర్ 2026
www.prajaveekshanam.in

త్రాగునీటికి ఇబ్బంది లేకుండా చర్యలు చేపట్టాలి - జిల్లా కలెక్టర్ కె. హరిత

ఆసిఫాబాద్, నవంబర్ 4 (ప్రజా వీక్షణం):

జిల్లాలో త్రాగునీటికి ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ప్రతిరోజు సరఫరా చేసే విధంగా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ కె. హరిత అన్నారు.జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సముదాయంలో గల కలెక్టర్ ఛాంబర్ లో పంచాయతీరాజ్, మిషన్ భగీరథ, ఇంట్రా గ్రిడ్ అధికారులతో త్రాగునీటి సరఫరాపై సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని ప్రతి గ్రామానికి త్రాగునీటి సరఫరా చేయాలని, ఏ గ్రామంలోనూ ఇబ్బంది తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈ నెల 16వ తేదీ నుండి డిసెంబర్ 31వ తేదీ వరకు ప్రత్యేక డ్రైవ్ చేపట్టాలని, ప్రతి బోరు, సింగిల్ ఫేజ్ మోటారు, ఓవర్ హెడ్ ట్యాంకులు, గ్రిడ్ పైప్ లైన్ల పనులను పరిశీలించి, మరమ్మత్తు అవసరం ఉన్నట్లయితే వెంటనే చేపట్టాలని తెలిపారు. అధికారులు సమన్వయంతో పనిచేసి త్రాగునీటి సమస్య రాకుండా యుద్ధ ప్రాతిపదికన చర్యలు తీసుకోవాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో జిల్లా పంచాయతీ అధికారి బిక్షపతి, మిషన్ భగీరథ ఈ.ఈ. రాకేష్, ఇంట్రా గ్రిడ్ ఈ.ఈ. ఎం.ఏ. సిద్ధిఖీ తదితరులు పాల్గొన్నారు.



ఈ-హెచ్.ఆర్.ఎం.ఎస్.పై అవగాహన పెంచుకోవాలి: కలెక్టర్ కే హరిత

ఆసిఫాబాద్, నవంబర్ 4(ప్రజా వీక్షణం)

రాష్ట్ర ఆర్థిక శాఖ నూతనంగా ప్రవేశపెట్టిన ఈ – హెచ్.ఆర్.ఎం.ఎస్., ఈ – సాంక్షన్ లపై అన్ని శాఖల డి.డి.ఓ.లు అవగాహన కలిగి ఉండాలని జిల్లా కలెక్టర్ కె. హరిత అన్నారు.బుధవారం జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సమావేశ మందిరంలో అన్ని ప్రభుత్వ శాఖల డి.డి.ఓ.లకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమానికి హాజరయ్యారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ఆర్థిక శాఖ నూతనంగా ప్రవేశపెట్టిన ఈ – హెచ్.ఆర్.ఎం.ఎస్., ఈ – సాంక్షన్ విభాగాల ద్వారా కాగిత రహిత కార్యకలాపాలను పారదర్శకంగా నిర్వహించేందుకు చర్యలు తీసుకోవాలని తెలిపారు. విభాగాల నిర్వహణపై అందిస్తున్న ఈ శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని, ప్రతి అంశం పట్ల అవగాహన పెంచుకోవాలని తెలిపారు. ఈ నెల 5వ తేదీన మండల స్థాయి డి.డి.ఓ.లకు, 6న డి.డి.ఓ.లందరికీ అవగాహన కల్పిస్తారని తెలిపారు.ఈ కార్యక్రమంలో జిల్లా ఖజానా శాఖ అధికారి హమీద్ షా ఖాన్, డి.డి.ఓ.లు పాల్గొన్నారు.



వాంకిడి సీడీపీవో కార్యాలయంలో నిర్లక్ష్యం..!

అంగన్వాడీ ఆయా పోస్టుల ఇంటర్వ్యూలో కనీసం టెంట్ కూడా లేదు..

ఎండలో గంటల తరబడి నిలబడిన గర్భిణులు, మహిళలు

ఆసిఫాబాద్, నవంబర్ 4(ప్రజా వీక్షణం):

ఆసిఫాబాద్ జిల్లా వాంకిడి మండల కేంద్రంలోని సీడీపీవో కార్యాలయంలో నిర్లక్ష్యం బయటపడింది. అంగన్వాడీ ఆయా పోస్టుల ఇంటర్వ్యూకు హాజరైన మహిళలు ఎండలో గంటల తరబడి నిలబడాల్సి వచ్చింది.ఇంటర్వ్యూకు వచ్చిన వారిలో గర్భిణులు, పసి పిల్లల తల్లులు, వృద్ధులు కూడా ఉన్నారు. అయినా వారి కోసం కనీసం టెంట్ ఏర్పాటు చేయలేదు. కూర్చోవడానికి కుర్చీలు, తాగడానికి మంచినీటి సౌకర్యం కూడా లేకపోవడంతో మహిళలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.ఉదయం నుంచి సాయంత్రం వరకు ఎండలో నిలబడి ఉండటం గమనార్హం. అధికారులు మహిళలను ఎండలో నిలబెట్టడం చర్చనీయంగా మారింది. ఇంత పెద్ద సంఖ్యలో మహిళలు వస్తారని తెలిసినా అధికారులు ముందస్తు ఏర్పాట్లు చేయకపోవడం దారుణమని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.అధికారులు కనీసం టెంట్, కుర్చీలు, మంచినీరు ఏర్పాటు చేయాల్సిందని, మహిళల పట్ల ఇంత నిర్లక్ష్యం తగదని స్థానికులు డిమాండ్ చేశారు.

కళలకు నిలయం ఇందూరు

జిల్లా స్థాయి యువజనోత్సవంలో ఎమ్మెల్యే ధన్ పాల్...

నిజామాబాద్ నవంబర్ 4 (ప్రజా వీక్షణం) ప్రతినిధి:

కళలకు, క్రీడలకు నిలయంగా ఇందూరు నిలుస్తోందని అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ తెలిపారు. మేరా యువ భారత్ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి యువజనోత్సవాల ముగింపు కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ...ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం యువతను అనేక రకాలుగా ప్రోత్సహిస్తోందన్నారు. ప్రధానంగా " మై భారత్ " పేరుతో యువతలో నాయకత్వ లక్షణాలు, సామాజిక సేవాభావం పెంపొందించేలా తీర్చిదిద్దుతుందన్నారు. యువతలో విద్యా, నైపుణ్యం, క్రీడా స్ఫూర్తి, సామాజిక బాధ్యత, దేశభక్తి వంటి లక్షణాలు ఉండాలన్నారు. ఇటువంటి పోటీల ద్వారా ఈ లక్షణాలు అలవడుతాయాన్నారు. క్రీడాకారులకు యువ కళాకారులకు తన వంతు సహాయం తన ట్రస్టు ద్వారా ఎల్లప్పుడూ ఉంటుందన్నారు. ఇందూరులో పెండింగ్లో ఉన్న కళాభారతి, క్రీడా స్టేడియాలను పూర్తి చేయడమే తన లక్ష్యమన్నారు. ఇప్పటికే అనేకసార్లు రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినట్లు గుర్తు చేశారు. అలాగే జిల్లా స్థాయిలో గెలుపొందిన వారు రాష్ట్ర, జాతీయ స్థాయిలో రాణించి ఇందూరు పేరును నిలబెట్టాలన్నారు. అలాగే యువత డ్రగ్స్ కి, మత్తు పదార్థాలకు దూరంగా ఉంటూ కళల్లో రాణించాలన్నారు. అనంతరం ఆయా అంశాల్లో గెలుపొందిన యువతీ యువకులకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో జిల్లా యువజన అధికారి రమేష్, జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి పవన్ కుమార్, తెలంగాణ విశ్వ విద్యాలయం ప్రొఫెసర్ అపర్ణ, బాలభవన్ సూపరింటెండ్ ఉమాబాల, న్యాయ నిర్ణేతలు పుష్ప, శ్వేతా రెడ్డి, సిర్ప లింగం, కోకిల నాగరాజు తదితరులు పాల్గొన్నారు.



శబరిమలకు పాద యాత్ర ప్రారంభం

నాగర్ కర్నూల్ జిల్లా ప్రతినిధి: (ప్రజా వీక్షణం) నవంబర్ 4

నాగర్ కర్నూల్ జిల్లా కేంద్రానికి చెందిన అనిల్ స్వామి బుధవారం జిల్లా కేంద్రంలోని అయ్యప్ప స్వామి ఆలయంలో పూజలు నిర్వహించి బీచుపల్లి కి బయలుదేరారు డిసెంబర్ 9 వరకు మహా పాదయాత్ర ద్వారా శబరిమలకు చేరుకోవడం జరుగుతుందని ఆయన తెలిపారు. నియమ నిష్ఠలతో పాదయాత్రను పూర్తి చేయడం జరుగుతుందని బీచుపల్లి లో ప్రారంభమయ్యే పాదయాత్ర డిసెంబర్ 9న శబరిమలకు చేరుకుంటుందని భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. 15వ సారి మాల ధారణ స్వీకరించడం జరిగిందని వివరించారు ఈ కార్యక్రమంలో అయ్యప్ప స్వామి దేవాలయ కమిటీ అధ్యక్షుడు సుందర్ గురు స్వామి ప్రధాన కార్యదర్శి ప్రవీణ్ గురు స్వామి శివ గురుస్వామి అనిల్ గురు స్వామి ప్రదీప్ గురుస్వామితోపాటు పలువురు గురు స్వాములు అయ్యప్ప స్వాములు పాల్గొన్నారు



సాంఘిక సంక్షేమ శాఖ జిల్లా అధికారిగా అదనపు బాధ్యతలు స్వీకరించిన జాదవ్ అంబాజీ

ఘనంగా సన్మానించి స్వాగతం పలికిన సాంఘిక సంక్షేమ శాఖ అధికారులు, సిబ్బంది

ఆసిఫాబాద్, నవంబర్ 4 (ప్రజా వీక్షణం):

కుమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ జిల్లా అధికారిగా గిరిజన సంక్షేమ శాఖ ఉపసంచాలకులు జాదవ్ అంబాజీ అదనపు బాధ్యతలు స్వీకరించారు. బుధవారం జిల్లా కలెక్టర్ కె. హరిత ఆదేశాల మేరకు ఆయనకు సాంఘిక సంక్షేమ శాఖ జిల్లా అధికారిగా అదనపు బాధ్యతలు అప్పగించారు.ఈ సందర్భంగా కార్యాలయానికి చేరుకున్న జాదవ్ అంబాజీకి సాంఘిక సంక్షేమ శాఖ అధికారులు, కార్యాలయ సిబ్బంది ఘనంగా సన్మానించి పుష్పగుచ్ఛాలతో స్వాగతం పలికారు.ఈ సందర్భంగా జాదవ్ అంబాజీ మాట్లాడుతూ తనపై నమ్మకంతో సాంఘిక సంక్షేమ శాఖ జిల్లా అధికారిగా అదనపు బాధ్యతలు అప్పగించిన జిల్లా కలెక్టర్ కె. హరితకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. తనకు అప్పగించిన బాధ్యతలను అంకితభావంతో నిర్వహిస్తూ సాంఘిక సంక్షేమ శాఖ అభివృద్ధికి, శాఖ పరిధిలోని విద్యార్థులు, లబ్ధిదారుల సంక్షేమానికి అన్ని విధాలుగా కృషి చేస్తానని తెలిపారు. శాఖలోని అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేస్తూ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ చేరేలా కృషి చేస్తానని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో సాంఘిక సంక్షేమ శాఖ అధికారులు, కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.





ఆసిఫాబాద్ లో ఘనంగా కుమురం భీం స్మారక జెండా ఆవిష్కరణ

కుమురం భీం ఆశయాల సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలి : డీసీసీ అధ్యక్షురాలు ఆత్రం సుగుణక్క

ఆసిఫాబాద్, నవంబర్ 4 (ప్రజా వీక్షణం):

జిల్లా రాజ్ గోండ్ సేవా సమితి ఆధ్వర్యంలో కుమురం భీం స్మారక జెండా ఆవిష్కరణతో పాటు వర్ధంతి వారోత్సవాలను బుధవారం ఆసిఫాబాద్ పట్టణంలో ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి డీసీసీ అధ్యక్షురాలు ఆత్రం సుగుణక్క ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కుమురం భీం స్మారక జెండా ఆవిష్కరణలో పాల్గొని, ఆయన విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా ఆత్రం సుగుణక్క మాట్లాడుతూ జల్, జంగల్, జమీన్ నినాదంతో ఆదివాసీల హక్కులు, ఆత్మగౌరవం కోసం పోరాడిన గొప్ప యోధుడు కుమురం భీం అని కొనియాడారు. ఆయన పోరాట స్ఫూర్తి, త్యాగాలు భావితరాలకు ఆదర్శమని, కుమురం భీం ఆశయాల సాధనతో పాటు ఆదివాసీల హక్కుల పరిరక్షణ, సంక్షేమం, అభివృద్ధికి కాంగ్రెస్ పార్టీ కట్టుబడి ఉందని తెలిపారు. ఆయన చూపిన పోరాట బాటలో ప్రతి ఒక్కరూ నడవాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కు, అంకుసాపూర్ సర్పంచ్ టెకం గంగారాం, వగుదాం సర్పంచ్ జూగాదిరావ్, సమేలా సర్పంచ్ సంతోష్, మాజీ ఎంపీపీ మోతిరం, డీసీసీ కార్యవర్గ సభ్యుడు పేందూర్ సుధాకర్, శిడం అర్జు, మాడవి రగునాథ్, గురనులే నారాయణ, ఉప్పుల కృష్ణ, బాజీరావు, మారుతీ, చందన్ శావ్, జిల్లా రాజ్ గోండ్ సేవా సమితి నాయకులు, ఆదివాసీ సంఘాల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.



మృతికి విద్యుత్ శాఖకు ఎలాంటి సంబంధం లేదు.

విద్యుత్ ఎస్ ఈ నారాయణ నాయక్...

మెదక్ 04 నవంబర్ 2026(ప్రజా వీక్షణం)పతినిధి,



జిల్లా కేంద్రం మెదక్ పట్టణంలో ఈనెల రెండో తేదీన రాత్రి 9:30 గంటల సమయంలో చికిత్స కోసం వచ్చిన తిరుపతి కిషన్ మృతికి విద్యుత్ శాఖకు ఎలాంటి సంబంధం లేదని మెదక్ విద్యుత్ ఎస్ ఈ నారాయణ నాయక్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 3వ తేదీన సాయంత్రం 6:30 గంటల సమయంలో గవర్నమెంట్ హాస్పిటల్లో విద్యుత్ సరఫరా నిలిచిపోగా ఎఫ్ఓసి నెంబర్ కు సుమారు ఏడున్నర గంటల సమయంలో ఫోన్ కాల్ చేయడం జరిగింది. మా సిబ్బంది వెళ్లి పరీక్షించగా మీటర్ ఏలాంటి సమస్య లేకపోవడంతో పాటు డయాసిస్ కేంద్రానికి తప్ప మిగతా అన్ని భవనాలకు విద్యుత్ సరఫరా అయింది. డయాలసిస్ కేంద్రానికి వెళ్లే కేబుల్ ను మార్చుకోమని సంబంధిత జూనియర్ అసిస్టెంట్ ఉదయ్ కు మా సిబ్బంది తెలియజేయడం జరిగింది. అనంతరం వారు ప్రవేట్ ఎలక్ట్రిషన్ తో మరమ్మతులు చేయించుకునే సమయంలో ఆస్పత్రికి సంబంధించిన జనరేటర్ ను సైతం నిలిపివేసి పనులు చేపట్టారు. అదే సమయంలో అనగా సుమారు రాత్రి 9:30 గంటల సమయంలో మృతుడు తిరుపతి కిషన్ రోడ్డు ప్రమాదంలో గాయపడగ చికిత్స కోసం ఆసుపత్రికి తీసుకురావడం జరిగింది. అతనికి చికిత్స అందించడం కంటే మరమ్మత్తులకే ప్రాధాన్యం ఇచ్చిన ఆస్పత్రి అధికారులు, సిబ్బంది జనరేటర్ ను ఆన్ చేసి విద్యుత్ పునరుద్ధరించలేకపోయారు. ఫలితంగా సకాలంలో చికిత్స అందక అతడు మరణించడం జరిగింది. అంతేకానీ విద్యుత్ శాఖ నిర్లక్ష్యం ఏ మాత్రం లేదని ఈ సందర్భంగా తెలియజేస్తున్నాం.

భూసార పరీక్షల ఆధారంగానే ఎరువుల వినియోగం

రైతులకు కేవీకే శాస్త్రవేత్త వేణు సూచన

హుజూరాబాద్ రూరల్ / నవంబర్ 4 (ప్రజా వీక్షణం):



రైతులు తమ పొలాల్లో క్రమం తప్పకుండా భూసార పరీక్షలు నిర్వహించి, పరీక్షల ఫలితాల ఆధారంగానే ఎరువులను వినియోగించాలని జమ్మికుంట కృషి విజ్ఞాన కేంద్రం (కేవీకే) శాస్త్రవేత్త వేణు సూచించారు. హుజూరాబాద్ మండలం కాట్రపల్లి గ్రామంలో వ్యవసాయ శాఖ, జమ్మికుంట కేవీకే సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన 'ఖేతీ బచావో అభియాన్' కార్యక్రమంలో ఆయన పాల్గొని రైతులకు పలు సూచనలు చేశారు.ఈ సందర్భంగా వేణు మాట్లాడుతూ.. భూసార పరీక్షల ద్వారా నేలలో ఉన్న పోషక పదార్థాలను గుర్తించి, అవసరమైన మేరకే ఎరువులు వాడటం వల్ల సాగు ఖర్చులు తగ్గడంతో పాటు భూసారం దెబ్బతినకుండా కాపాడుకోవచ్చని తెలిపారు. రైతులు విచక్షణారహితంగా ఎరువులు వినియోగించకుండా శాస్త్రీయ పద్ధతులను పాటించాలని సూచించారు.అనంతరం వ్యవసాయ అధికారి భూమిరెడ్డి మాట్లాడుతూ.. ఎల్నినో ప్రభావంతో వాతావరణ పరిస్థితుల్లో మార్పులు చోటుచేసుకునే అవకాశం ఉన్నందున రైతులు నీటి లభ్యతను దృష్టిలో ఉంచుకుని ఆరుతడి పంటల సాగుకు ప్రాధాన్యత ఇవ్వాలని తెలిపారు. తక్కువ నీటితో పండే పంటలను ఎంపిక చేసుకోవడం ద్వారా వర్షాభావ పరిస్థితుల్లోనూ నష్టాలను తగ్గించుకోవచ్చని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్, వ్యవసాయ విస్తరణ అధికారి (ఏఈఓ), వ్యవసాయ శాఖ సిబ్బంది, కేవీకే ప్రతినిధులు, గ్రామ రైతులు తదితరులు పాల్గొన్నారు.

GENERAL NEWS

05 గురువారం నవంబర్ 2026

www.prajaveekshanam.in

ప్రజావీక్షణం దినపత్రిక

రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీల్లో ఎన్ ఆర్ ఎస్ విద్యార్థి ప్రతిభ.

కోదాడ:

స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో మంగళవారం భువనగిరిలో నిర్వహించిన రాష్ట్రస్థాయి అండర్ 17 వాలీబాల్ పోటీల్లో కోదాడ పట్టణానికి చెందిన ఎన్ ఆర్ ఎస్ కాలేజీలో ఇంటర్ ఫస్ట్ ఇయర్ విద్యార్థి తేజశ్రీ ఉమ్మడి నల్గొండ జిల్లా జట్టుకు ఎంపికైంది. అంతేకాక ఆ పోటీల్లో మంచి ప్రతిభ కనబర్చి బెస్ట్ ప్లేయర్ అవార్డు పొందింది. ఈ సందర్భంగా బుధవారం కాలేజీలో జరిగిన కార్యక్రమంలో తేజశ్రీని కాలేజీ చైర్మన్ వడ్డే రాజేష్ చౌదరి, డైరెక్టర్ మనోహర్ రెడ్డి, కరస్పాండెంట్ వేణుగోపాలరావు, ప్రిన్సిపాల్ జీ వీ, వైస్ ప్రిన్సిపల్ పీ ఎన్ ఆర్ తో పాటు పలువురు లెక్చరర్లు అభినందించారు. తేజశ్రీ భవిష్యత్తులో కూడా మరిన్ని విజయాలు సాధించాలని వారు కోరారు.



ప్రజల ఆత్మగౌరవానికి ప్రతీకగా నిలిచిన పైలాన్‌ను కూల్చివేయడం దుర్మార్గం

- కూల్చివేసిన పైలాన్‌ను వెంటనే పునరుద్ధరించాలి.

- - కక్షసాధింపు చర్యలతో గత అభివృద్ధిని చెరిపివేయలేరు

- మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్

(ప్రజా వీక్షణం),గోదావరిఖని:-....!

లేబర్ కోర్టు ఎదుట ఉన్న పైలాన్‌ను కూల్చివేసిన ఘటనను రామగుండం మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్ తీవ్రంగా ఖండించారు. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ పాలనలో రామ గుండం ప్రాంతంలో జరిగిన అభి వృద్ధికి, ప్రజల ఆత్మగౌరవానికి ప్రతీకగా నిలిచిన పైలాన్‌ను కక్షపూ రితంగా కూల్చివేయడం దుర్మార్గమని ఆయన మండిపడ్డారు. బుధవారం గోదావరిఖని ప్రెస్ క్లబ్‌లో నిర్వ హించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. కేసీఆర్ పాలన లో రామగుండం నగరాన్ని అభివృద్ధి పథంలో నడిపించామని, కార్పొరేషన్ పరిధిలోని ప్రతి ఇంటికి మిషన్ భగీరథ ద్వారా తాగునీరు, ప్రతి గల్లీలో రహదారులు, డ్రైనేజీలు, వీధి దీపాలు ఏర్పాటు చేశామని చందర్ గుర్తుచేశారు. ప్రజల అవసరాల కోసం కోట్లాది రూపాయలు వెచ్చించి నిర్మించిన అభివృద్ధి పనులకు సంబంధించిన గుర్తులను తొలగిస్తే భవిష్యత్ తరాలకు ఆ అభివృద్ధి ఎలా తెలుస్తుందని ప్రశ్నించారు. గత పాలనలో జరిగిన అభివృద్ధి ఆనవాళ్లను చెరిపివేయడం ద్వారా ప్రజల జ్ఞాపకాల నుంచి వాటిని తొలగించలేరని అన్నారు. పైలాన్ కూల్చివేత సమయంలో తాము శాంతియుతంగా నిరసన తెలిపి, జేసీబీలను నిలిపివేయాలని కోరినా పోలీసులు పట్టించుకోలేదని చందర్ ఆరోపించారు. పోలీసుల వ్యవహారశైలి ప్రజాస్వామ్యానికి విరుద్ధంగా ఉందని, అధికార పార్టీకి అనుకూలంగా వ్యవహరిస్తున్నారనే భావన కలిగించేలా పోలీసుల చర్యలు ఉన్నాయని విమర్శించారు. ప్రస్తుత పాలకులు రామగుండం ప్రాంతానికి చేసిన అభివృద్ధి ఏమిటో ప్రజలకు వివరించాలని చందర్ డిమాండ్ చేశారు. అభివృద్ధి పనులను ముందుకు తీసుకెళ్లాల్సిన పాలకులు గతంలో నిర్మించిన కట్టడాలను కూల్చివేయడంపై దృష్టి పెట్టడం సరికాదన్నారు. ప్రజల్లో విద్వేషాలు సృష్టించడం, వివాదాలకు తావివ్వడం మినహా పాలకులు సాధిస్తు న్నదేమిటని ప్రశ్నించారు. రాజ్యాంగబద్ధంగా ప్రజలకు సేవ చేయాల్సిన బాధ్యతను విస్మరించి అభివృద్ధి నిర్మాణాలను ధ్వంసం చేయడం తగదన్నారు. ప్రజలు, కార్మికులు, డ్రైవర్లు ఈ కక్షసాధింపు చర్యలను గమనిస్తున్నారని చందర్ పేర్కొన్నారు. స్థానిక ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ మక్కన్ సింగ్‌తో పాటు సంబంధిత అధికారులు ఇలాంటి చర్యలకు పాల్పడితే ప్రజల నుంచి తగిన ప్రతిఘటన ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు. కూల్చివేసిన పైలాన్‌ను వెంటనే పునరుద్ధరించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ మీడియా సమావేశంలో రాష్ట్ర నాయకులు కౌశిక హరి, ఫ్లోర్ లీడర్ మేకల సమ్మయ్య, కార్పొరేటర్లు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



అప్పన్నపేట పాఠశాలకు 50 బెంచీలు

పెద్దపల్లిప్రతినిధి,(ప్రజా వీక్షణం)

మండలంలోని అప్పన్నపేట జడ్పీ ఉన్నత పాఠశాలకు ఎంకే ఫౌండేషన్ ఆధ్వర్యం లో 50 బెంచీలను అందిం చారు. విద్యార్థులకు కూర్చునేందుకు సరైన సౌకర్యం లేదని తెలుసుకునిఫౌండేషన్ వ్యవస్థాపకుడు, ఎమ్మెల్సీ మల్క కొముర య్య బెంచీలు అందించిన ట్లు తెలిపారు. ఈ సందర్భం గా కొమురయ్య మాట్లాడు తూ తాను పదో తరగతి వరకు ఇదే పాఠశాలలో చదువుకున్నానని, బంధం పల్లి నుంచి ఐదు కిలోమీట ర్లు నడిచి వచ్చి విద్యా భ్యాసం చేశానని తన బాల్యం గుర్తుచేసుకున్నారు. తనకు విద్యాబుద్ధులు నేర్పిన పాఠశాల అభివృద్ధికి సహకరించడం బాధ్యతగా భావిస్తున్నానన్నారు. గతం లో పాఠశాలకు ఆర్చ్, గేటు కూడా అందించినట్లు తెలి పారు. బెంచీల వితరణపై పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయులు, గ్రామస్థ లు ఎంకే ఫౌండేషన్‌కు కృతజ్ఞతలు తెలిపారు.



మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందరు, కౌశిక హరి కి బహిరంగ సవాల్

కాంగ్రెస్ పార్టీ నాయకులు గుండేటి శంకర్.

రామగుండం అభివృద్ధి ప్రదాత శాసనసభ్యులు రాజ్ ఠాకూర్ మక్కాన్ సింగ్ పై

నిరాధార ఆరోపణలు చేస్తే సహించేది లేదు

రామగుండం బిఆర్ఎస్ నాయకుడు కౌశిక హరి కి ఒకటే మాట...

(ప్రజా వీక్షణం), గోదావరిఖని:

రామగుండం ప్రజలు మీ మాటలను, మీరు చేసే ఆరోపణలను గుడ్డిగా నమ్మే పరిస్థితుల్లో లేరు... రామగుండం నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధిని చూసి ఓర్వలేక మా నాయకుడు రాజ్ ఠాకూర్ మక్కాన్ సింగ్ పై పదేపదే తప్పుడు ఆరోపణలు చేయడం మీ రాజకీయ దిగజారుడుతనానికి నిదర్శనం...రాజ్ ఠాకూర్ మక్కాన్ సింగ్ ని విమర్శిస్తే మీరు పెద్ద నాయకులు అయిపోతారని అనుకుంటున్నారేమో! కానీ ప్రజలు మీ మాటలను నమ్మే పరిస్థితిలో లేరు...నాయకుడిపై విమర్శలు చేసే ముందు మీరు మీ గతాన్ని ఒకసారి గుర్తు చేసుకోవాలి... మీ రాజకీయ ప్రస్థానంలో చోటుచేసుకున్న వివాదాలు, మీపై వచ్చిన ఆరోపణల గురించి కూడా ప్రజలకు సమాధానం చెప్పాల్సిన బాధ్యత మీపై ఉంది...మీ వెంట ఉన్న నాయకులపై, గతంలో జరిగిన వివాదాస్పద ఘటనలపై ప్రజల్లో ఉన్న ప్రశ్నలకు సమాధానాలు చెప్పకుండా, ఇతరులపై ఆరోపణలు చేయడం ఎంతవరకు సమంజసం

వాటిపై కూడా మీరు స్పష్టత ఇవ్వాలి...

రామగుండం అభివృద్ధిని చూసి ఓర్వలేక మా నాయకుడిపై మీరు చేస్తున్న ఆరోపణలను ప్రజలు గమనిస్తున్నారు... శ్రీఅభివృద్ధి పనుల గురించి మాట్లాడకుండా వ్యక్తిగత విమర్శలకు దిగడం వల్ల ప్రజల్లో మీపై విశ్వాసం పెరగదు... కౌశిక హరి .. రాజకీయాలు అంటే కేవలం ఆరోపణలు చేయడం కాదు... ప్రజల మధ్య ఉండి ప్రజల సమస్యలను పరిష్కరించడం, అభివృద్ధి కోసం పనిచేయడం... నాయకుడు రాజ్ ఠాకూర్ మక్కాన్ సింగ్ రామగుండం అభివృద్ధినే లక్ష్యంగా పెట్టుకుని ముందుకు సాగుతున్నారు... రామగుండం నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నడిపించాలనే సంకల్పంతో పనిచేస్తున్నారు... మా నాయకుడిపై నిరాధార ఆరోపణలు చేస్తే చూస్తూ ఊరుకునేది లేదు... ప్రతి విమర్శకు ప్రజాస్వామ్య పద్ధతిలో, వాస్తవాలతో సమాధానం చెబుతాం... మీరు ఎన్ని ఆరోపణలు చేసినా, ప్రజలకు కావాల్సింది అభివృద్ధి, సంక్షే మం, ఉపాధి, కార్మికుల భద్రత. వ్యక్తిగత దూషణలు కాదు... మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్ కి గతంలో రామగుండం ఎమ్మెల్యేగా పనిచేసిన కోరుకంటి చందర్ కూడా ప్రజలకు సమాధానం చెప్పాల్సిన అనేక ప్రశ్నలు ఉన్నాయి... ముఖ్యంగా =ఖీజూలో ఉద్యోగాలు ఇప్పిస్తామనే పేరుతో కోట్ల రూపాయల లావాదేవీలు జరిగాయంటూ



గతంలో వెలువడిన ఆరోపణలపై మీ వైఖరి ఏమిటి? ఆ ఆరోపణల్లో వాస్తవం లేదని భావిస్తే ప్రజల సమక్షంలో బహిరంగంగా వివరణ ఇవ్వాలి... ఉద్యోగాల కోసం ఆశపడి ఎదురుచూసిన నిరుద్యోగ యువతకు న్యాయం జరిగిందా? ఈ వ్యవహారంపై పూర్తి పారదర్శకత ఎందుకు చూపడం లేదు? ప్రజలకు సమాధానం చెప్పాల్సిన బాధ్యత మీపై లేదా?ఇతరులపై ఆరోపణలు చేసే ముందు గతంలో మీ పాలనలో చోటుచేసుకున్న వివాదాలు, మీపై వచ్చిన ఆరోపణలపై కూడా సమాధానం చెప్పాలి... రాజకీయ విమర్శలు అందరికీ వర్తిస్తాయి... ఒకరిని ప్రశ్నించే ముందు మరొకరు కూడా ప్రజలకు జవాబుదారీగా ఉండాలి...గుర్తుంచుకోండి... బిఆర్ఎస్ నాయకులారా! ప్రజలే అంతిమ నిర్ణేతలు... తగిన సమయంలో ప్రజలే తమ తీర్పుతో సమాధానం చెబుతారు...రామగుండం అభివృద్ధి ప్రదాత మా నాయక రామగుండం శాసనసభ్యులు రాజ్ ఠాకూర్ మక్కాన్ సింగ్ అన్న రామగుండం నియోజవర్గం అభివృద్ధి బాటలో నడుస్తుంది టిఆర్ఎస్ నాయకులు ఖబర్దార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు గుండేటి శంకర్ ఖబర్దార్.

జమ్మికుంటలో సన్న బియ్యం అక్రమంలో సీఐడీ దూకుడు

మూడు రైస్ మిల్లుల్లో సోదాలు

జమ్మికుంట, (ప్రజా వీక్షణం)నవంబర్ 4..

జమ్మికుంట పట్టణంలో సన్నబియ్యానికి బదులు దొడ్డు బియ్యం సరఫరా చేసిన ఘటనలో సీఐడీ పోలీసులు దర్యాప్తును ముమ్మరం చేశారు.ఈ కేసులో 10 రోజుల క్రితం అదుపులోకి తీసుకున్న ముగ్గురు రైస్ మిల్లర్ల యజమానులు ఒల్లాల మల్లికార్జున్, యాంసాని సంపత్, లెంకలపల్లి మధు లను నేడు విచారణ నిమిత్తం సీఐడీ పోలీసులు జమ్మికుంటకు తీసుకువచ్చారు.బుధవారం ఉదయం నుండి సాయంత్రం వరకు వీరి రైస్ మిల్లుల్లో సీఐడీ అధికారులు విస్తృత తనిఖీలు చేపట్టారు. మిల్లుల్లోని పలు కీలక ఫైళ్లను స్వాధీనం చేసుకుని, నిందితులతో సీన్ రీ కన్స్ట్రక్షన్ నిర్వహించినట్లు సమాచారం.



పరామర్శించిన మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట.

కమాన్ పూర్, నవంబర్ 4

కమాన్ పూర్ మండలంలోని పెంచికల్ పేట్ గ్రామానికి చెందిన సిరవేణ మధునమ్మ ఇటీవలే మరణించగా వారి చిత్రపటానికి పూలమాల వేసి, నివాళులుర్పించి, వారి కుటుంబ సభ్యులను మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్ పరామర్శించి, ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. అలాగే అదే గ్రామానికి చెందిన బీఆర్ఎస్ పార్టీ నాయకులు చిమ్మనవేన మల్లేష్ అనారోగ్యంతో బాధపడుతూ, ఆసుపత్రిలో చికిత్స పొంది ఇంటికి రాగ వారిని పరామర్శించి, మనోధైర్యంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.



ఈ-హెచ్ఆర్ఎంఎస్, ఈ-శాంక్షన్స్, వామిస్‌పై అధికారులకు శిక్షణ

నిజామాబాద్ నవంబర్ 4 (ప్రజా వీక్షణం)ప్రతినిధి

: జిల్లా పాలనాధికారి ఆదేశాల మేరకు ఈ-హెచ్ఆర్ఎంఎస్ (e-HRMS), ఈ-శాంక్షన్స్ (e-Sanctions), వామిస్ (WAMIS -- వర్క్స్ అకౌంట్స్) అంశాలపై జిల్లా స్థాయి అధికారులకు బుధవారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు.నిజామాబాద్ సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం (ఐడీఓసీ) సమావేశ మందిరంలో జిల్లా ట్రెజరీ అధికారి కే.దశరథ్ ఆధ్వర్యంలో ఈ శిక్షణ కార్యక్రమం జరుగగా, అదనపు కలెక్టర్ రాజాగౌడ్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఇందులో భాగంగా ఈ-హెచ్ఆర్ఎంఎస్ ద్వారా ఉద్యోగుల మానవ వనరుల నిర్వహణ, ఈ-శాంక్షన్స్ ద్వారా ప్రభుత్వ నిధుల మంజూరు ప్రక్రియ, వామిస్ ద్వారా పనులకు సంబంధించిన ఆర్థిక, అకౌంట్స్ నిర్వహణ విధానాలపై సంబంధిత అధికారులకు అవగాహన కల్పించారు. ఆయా ఆన్‌లైన్ వ్యవస్థల వినియోగం, వాటి ద్వారా చేపట్టాల్సిన విధివిధానాలు, ప్రభుత్వ మార్గదర్శకాల అమలుపై వివరించారు.జిల్లాలోని అన్ని శాఖల జిల్లా అధికారులు (హెచ్ఓడీలు), డ్రాయింగ్ అండ్ డిస్బర్సింగ్ అధికారులు (డీడీఓలు) ఈ శిక్షణ కార్యక్రమానికి హాజరయ్యారు. ప్రభుత్వ ఆదేశాల ప్రకారం సంబంధిత ఆన్‌లైన్ వ్యవస్థలను సమర్థవంతంగా వినియోగిస్తూ, విధుల్లో పారదర్శకత, జవాబుదారీతనం పెంపొందించాలని అదనపు కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమంలో ఏ.పీ.ఏ.ఓ దేవీసింగ్ తదితరులు పాల్గొన్నారు.



గ్రంథాలయ అభివృద్ధికి విశేష కృషి చేస్తున్నట్లు జిల్లా గ్రంథాలయ సంస్థ అధ్యక్షులు శ్రీమతి సుహాసిని రెడ్డి తెలిపారు.

మెదక్ 04 నవంబర్ 2026 (ప్రజా వీక్షణం) ప్రతినిధి,

బుధవారం.జిల్లా గ్రంథాలయ సంస్థ, మెదక్ లో సాధారణ సర్వసభ్య సమావేశం జిల్లా గ్రంథాలయ సంస్థ అధ్యక్షులు శ్రీమతి సుహాసిని రెడ్డి కార్యదర్శి మనోజ్ కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగాసమావేశంలో గ్రంథాలయ సంస్థ అభివృద్ధికి సంబంధించి దాదాపు 21 అంశాలపై చర్చ జరిగింది. ఈ సమావేశంలో సభ్యులు అయిన జిల్లా స్థాయి అధికారులు జిల్లా విద్యాశాఖ అధికారి శ్రీ రాజు, మరియు ఇతర జిల్లా స్థాయి అధికారులు హాజరయ్యారూ . కార్యక్రమంలో భాగంగా పాఠకుల కోసం ఎల్నినో సందర్భంగా నీటి పొదుపు కార్యక్రమంలో భాగంగా నీటి వనరులు సద్వినియోగం చేసుకుంటూ తగిన ఏర్పాటు చేయడం జరిగింది. ఈ ఏర్పాటు కార్యక్రమాన్ని గ్రంథాలయంలో మంచి నీటి సౌకర్యం అందించాలని స్వయంగా సంస్థ నిధులతో ఏర్పాటు చేయడం జరిగింది ఈ సౌకర్యాన్ని గ్రంథాలయ సంస్థ అధ్యక్షులు మరియు కార్యదర్శి మరియు జిల్లా విద్యాశాఖ అధికారి గారి సమక్షంలో ప్రారంభోత్సవం చేయడం జరిగింది



ప్రజావీక్షణం
దినపత్రిక
SPORTS/ BUSINESS
05 గురువారం నవంబర్ 2026
www.prajaveekshanam.in



భారత పేసర్ల ధాటికి కివీస్ విలవిల..

తొలి వన్డేలో 185 పరుగులకే ఆలౌట్

-తొలి వన్డేలో కివీస్‌ను 185 పరుగులకే కట్టడి చేసిన భారత్

-అద్భుతంగా రాణించిన భారత యువ పేస్ దళం

-అర్ష్‌దీప్ సింగ్ 4, గుర్నూర్ బ్రార్ 3, కంబోజ్ 2 వికెట్లతో విజృంభణ

-చివర్లో మెరుపు ఇన్నింగ్స్‌తో ఆకట్టుకున్న బ్లెయిర్ టిక్నర్ (34)

-కివీస్ బ్యాటర్లలో టిమ్ సీఫర్ట్ (38) టాప్ స్కోరర్

ఆక్లాండ్‌లోని ఈడెన్ పార్క్ వేదికగా జరుగుతున్న తొలి వన్డేలో భారత యువ పేస్ దళం అద్భుతంగా రాణించింది. అనుభవం లేని బౌలర్లతో బరిలోకి దిగినా, పదునైన బంతులతో న్యూజిలాండ్ బ్యాటింగ్ లైనప్‌ను కుప్పకూల్చారు. అర్ష్‌దీప్ సింగ్, గుర్నూర్ బ్రార్, అన్షుల్ కంబోజ్‌ల విజృంభణతో కివీస్ 40.2 ఓవర్లలో 185 పరుగులకే ఆలౌటైంది. అర్ష్‌దీప్ నాలుగు వికెట్లు పడగొట్టగా, బ్రార్ మూడు వికెట్లు, కంబోజ్ రెండు వికెట్లు తీసి ఆకట్టుకున్నారు.టాస్ గెలిచి బౌలింగ్ ఎంచుకున్న భారత్ ఆరంభంలోనే అదరగొట్టింది. అర్ష్‌దీప్ సింగ్ తన పేస్‌తో కివీస్ ఓపెనర్లకు కళ్లెం వేశాడు. తొలుత విల్ యంగ్ (9), ఆ తర్వాత హెన్రీ నికోల్స్ (9) పుల్ షాట్లకు ప్రయత్నించి పెవిలియన్ చేరారు. దీంతో 44 పరుగులకే న్యూజిలాండ్ రెండు కీలక వికెట్లు కోల్పోయింది. ఈ దశలో క్రీజులోకి వచ్చిన టిమ్ సీఫర్ట్ (38) దూకుడుగా ఆడి స్కోరు బోర్డును కదిలించాడు. మూడు ఫోర్లు, రెండు సిక్సర్లతో అలరించిన సీఫర్ట్‌ను గుర్నూర్ బ్రార్ ఔట్ చేసి భారత్‌కు కీలక బ్రేక్ ఇచ్చాడు.ఆ తర్వాత డారిల్ మిచెల్ (28) ఇన్నింగ్స్‌ను చక్కదిద్దే ప్రయత్నం చేశాడు. అయితే, కెప్టెన్ టామ్ లాథమ్ (3)ను గుర్నూర్ బ్రార్ తన అద్భుతమైన వన్ హ్యాండ్ క్యాచ్‌తో పెవిలియన్‌కు పంపడంతో కివీస్ కష్టాలు రెట్టింపయ్యాయి. ప్రమాదకరంగా మారుతున్న మిచెల్‌ను రోహిత్ శర్మ అద్భుత ఫీల్డింగ్‌తో రనౌట్ చేయడంతో న్యూజిలాండ్ 99 పరుగులకే 5 వికెట్లు కోల్పోయి పీకల్లోతు కష్టాల్లో పడింది. అన్షుల్ కంబోజ్ తన అద్భుతమైన బౌలింగ్‌తో మిచెల్ సాంట్నర్ (4), నాథన్ స్మిత్ (1) వికెట్లను పడగొట్టాడు. గ్లెన్ ఫిలిప్స్ (30) కాసేపు పోరాడినా, అర్ష్‌దీప్ బౌలింగ్‌లో ఔటయ్యాడు.ఒక దశలో 146 పరుగులకే 8 వికెట్లు కోల్పోయిన కివీస్.. 150 పరుగులు కూడా చేస్తుందా అనిపించింది. కానీ, చివర్లో బ్లెయిర్ టిక్నర్ (23 బంతుల్లో 34) ఊహించని విధంగా చెలరేగాడు. నాలుగు భారీ సిక్సర్లతో విరుచుకుపడి భారత బౌలర్లపై ఎదురుదాడికి దిగాడు. ముఖ్యంగా అర్ష్‌దీప్ వేసిన 38వ ఓవర్లో మూడు సిక్సర్లతో 23 పరుగులు రాబట్టాడు. అతనికి జాకబ్ డఫీ (15) నుంచి సహకారం లభించడంతో కివీస్ గౌరవప్రదమైన స్కోరు చేయగలిగింది. చివరకు గుర్నూర్ బ్రార్ బౌలింగ్‌లో టిక్నర్ ఔటవ్వడంతో న్యూజిలాండ్ ఇన్నింగ్స్‌కు తెరపడింది. భారత బౌలర్లలో అర్ష్‌దీప్ 4/70, బ్రార్ 3/44, కంబోజ్ 2/22తో రాణించారు.

కుర్రాళ్లు మెరవగా.. కింగ్ కొట్టగా..



టీ20 సిరీస్‌లో న్యూజిలాండ్‌పై పంజా విసిరిన భారత్ వన్డే ఫార్మాట్‌లోనూ అదరగొట్టింది. చిన్న మైదానంలో మన పేస్ దళంపై ఉన్న అపనమ్మకాన్ని పటా పంచలు చేస్తూ యువ పేసర్లు అర్ష్‌దీప్ సింగ్ (4/70), గుర్నూర్ బ్రార్ (3/44), అన్షుల్ కాంబోజ్ (2/22) బంతితో మెప్పిస్తే.. ఛేజ్ కింగ్ విరాట్ కోహ్లీ (51 బంతుల్లో 13 ఫోర్లు, 1 సిక్స్‌తో 74) తన పుట్టిన రోజుకు ముందే అభిమానులకు బర్త్‌డే గిఫ్ట్ ఇస్తూ క్లాసిక్ ఇన్నింగ్స్‌తో సత్తా చాటాడు. దాంతో బుధవారం జరిగిన తొలి వన్డేలో డక్‌వర్త్ లూయిస్ పద్ధతిలో 5 వికెట్ల తేడాతో కివీస్‌ను చిత్తు చేసిన టీమిండియా ఐదు వన్డేల సిరీస్‌లో శుభారంభం చేసింది.వర్షం అంతరాయం కలిగించిన ఈ పోరులో తొలుత భారత పేస్ దెబ్బకు కివీస్ 40.2 ఓవర్లలో 185 పరుగులకే కుప్పకూలింది. టిమ్ సిఫర్ట్ (38), గ్లెన్ ఫిలిప్స్ (30), డారిల్ మిచెల్ (28) మాత్రమే పోరాడారు. వర్షం కారణంగా 32 ఓవర్లలో 143 పరుగులుగా సవరించిన లక్ష్యాన్ని భారత్ 5 వికెట్లు కోల్పోయి 22.4 ఓవర్లలోనే ఛేదించింది. కోహ్లీతో పాటు కెప్టెన్ శుభ్‌మన్ గిల్ (37) కూడా రాణించాడు. అన్షుల్ కాంబోజ్‌కు ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్ అవార్డు దక్కింది. ఇరు జట్ల మధ్య రెండో వన్డే శనివారం వెల్లింగ్టన్‌లో జరుగుతుంది.చెలరేగిన పేస్ దళం సీనియర్ పేసర్లు బుమ్రా, ప్రసిద్ధ్ కృష్ణ గైర్హాజరీలో భారత్-ఏ తరఫున ఆడిన సిరాజ్‌కు విశ్రాంతి ఇచ్చిన కెప్టెన్ గిల్, హెడ్ కోచ్ గంభీర్ కేవలం 29 వన్డేల సంయుక్త అనుభవం ఉన్న యువ పేస్ దళాన్ని బరిలోకి దించింది. వారి నమ్మకాన్ని నిలబెడుతూ పంజాబ్ జోడీ అర్ష్‌దీప్ సింగ్, 6 అడుగుల 5 అంగుళాల పొడగరి బ్రార్ కివీస్ బ్యాటర్లను తీవ్రంగా భయపెట్టారు. పవర్‌ప్లేలో అదరగొట్టిన అర్ష్‌దీప్... షార్ట్ లెంగ్త్ బాల్‌తో విల్ యంగ్ (9) ఆపై హెన్రీ నికోల్స్ (9)ను ఔట్ చేసి న్యూజిలాండ్‌ను దెబ్బతీశాడు.ఫీల్డింగ్ మారిన తర్వాత బంతిని అందుకున్న బ్రార్ తన ఎత్తును ఉపయోగిస్తూ వేగవంతమైన బౌన్స్ బంతులతో కివీస్‌ను వణికించాడు. క్రీజులో కుదురుకున్న సిఫర్ట్‌ను పెవిలియన్ చేర్చడమే కాకుండా.. సీనియర్ బ్యాటర్ టామ్ లాథమ్ (3) రిటర్న్ క్యాచ్‌తో పెవిలియన్ చేర్చి ప్రత్యర్థికి షాకిచ్చాడు. కొద్దిసేపటికే డారిల్ మిచెల్ రనౌటవ్వడంతో కివీస్ 109/5తో ఇబ్బందుల్లో పడింది. అక్కడి నుంచి అన్షుల్ హవా మొదలైంది. కట్టుదిట్టమైన బౌలింగ్‌తో తన 10 ఓవర్లలో కోటాలో ఏకంగా 46 డాట్ బాల్స్ వేసి అతను ప్రత్యర్థి బ్యాటర్లపై ఒత్తిడి పెంచాడు. వరుస ఓవర్లలో శాంట్నర్ (4),నేథన్ స్మిత్ (1)ను వెనక్కుపంపడంతో కివీస్ 115/7తో నిలిచింది. అర్ష్‌దీప్, బ్రార్ మిగతా ముగ్గురి పని పట్టడంతో ఆతిథ్య జట్టు 200 మార్కు కూడా చేరుకోలేకపోయింది.కోహ్లీ జోరుగురువారం తన 38వ పుట్టినరోజు జరుపుకోనున్న విరాట్ కోహ్లీ ఒకరోజు ముందే బ్యాట్‌తో విధ్వంసం సృష్టించాడు. చిన్న లక్ష్య ఛేదనలోఓపెనర్ రోహిత్ శర్మ (0) డకౌటైనా.. కోహ్లీ తన ట్రేడ్‌మార్క్ కవర్ డ్రైవ్‌లు, పుల్ షాట్లతో హోరెత్తించాడు. ఇన్నింగ్స్ ఆరో బంతికే శాంట్నర్ క్యాచ్‌తో రోహిత్‌ను ఔట్ చేసిన జేమీసన్ కివీస్ క్యాంప్‌లో ఆశలు రేపాడు. కానీ, కెప్టెన్ గిల్ తోడుగా అద్భుతంగా ఆడిన విరాట్ ఆ జట్టు ఆశలపై నీళ్లు కుమ్మరించాడు. ప్రతీ బౌలర్‌ను అలవోకగా ఎదుర్కుంటూ పరుగులు రాబట్టాడు.11వ ఓవర్లో వర్షంతో ఆటకు అంతరాయం కలగడంతో లక్ష్యాన్ని తొలుత 40 ఓవర్లలో 167 పరుగులు సవరించారు. ఆట తిరిగి మొదలైన వెంటనే మళ్లీ చినుకులు పడటంతో రెండోసారి లక్ష్యాన్ని సవరించినా.. కోహ్లీ-గిల్ ఏకాగ్రత కోల్పోకుండా బ్యాటింగ్ చేశారు. ఇద్దరూ రెండో వికెట్‌కు 113 పరుగుల భాగస్వామ్యంతో విజయానికి బాటలు వేశారు. టీ20 స్టయిల్‌లో వేగంగా ఆడిన విరాట్ 35 బంతుల్లోనే అర్ధ శతకం పూర్తి చేసుకున్నాడు. ముఖ్యంగా టిక్నర్‌ను టార్గెట్ చేసి క్లాసిక్ షాట్లు కొట్టాడు. స్కోరు వంద దాటిన తర్వాత గిల్‌ను ఔట్ చేసిన నేథన్ ఈ జోడీని విడదీయగా.. గెలుపు ముంగిట కోహ్లీ, అక్షర్ (0)తో పాటు శ్రేయస్ అయ్యర్ (15)ను డఫీ వెంటవెంటనే పెవిలియన్ చేర్చినా రాహుల్ (3 నాటౌట్), నమన్ ధీర్ (5 నాటౌట్) లాంఛనం పూర్తి చేశారు.



సంక్షిప్త స్కోర్లున్యూజిలాండ్: 40.2 ఓవర్లలో 185 (సిఫర్ట్ 38, ఫిలిప్స్ 30, అర్ష్‌దీప్ 4/70, బ్రార్ 3/44, అన్షుల్ 2/22); భారత్: (టార్గెట్ 32 ఓవర్లలో 143): 22.4 ఓవర్లో 147/5 (కోహ్లీ 74, గిల్ 37, డఫీ 3/49) 80 వన్డేల్లో కోహ్లీకి ఇది 80వ అర్ధసెంచరీ. ఈ ఫార్మాట్‌లో అత్యధిక ఫిఫ్టీల్లో రెండో ప్లేస్‌లో ఉన్నాడు. సచిన్ (96) టాప్‌లో నిలిచాడు.

ప్రిక్వార్టర్స్‌కు అన్మోల్, తన్వి




బీడబ్ల్యూఎఫ్ కొరియా ఓపెన్ సూపర్ 500 టోర్నమెంట్‌లో భారత యువ షట్లర్లు అన్మోల్ ఖర్బ్, తన్వి శర్మ ప్రిక్వార్టర్స్‌కు చేరుకున్నారు. బుధవారం జరిగిన మహిళల సింగిల్స్ తొలి రౌండ్‌లో అన్మోల్ 21-19, 21-18తో రాచెల్ (కెనడా)ను ఓడించగా మరో పోరులో తన్వి 21-16, 12-21, 21-17తో మనామి సుయిజు (జపాన్)పై పోరాడి గెలిచింది. తదుపరి రౌండ్‌లో అన్మోల్.. జపాన్ స్టార్ షట్లర్ అకానె యమగుచితో తలపడనుండగా తన్వి సైతం జపాన్‌కే చెందిన ఐదో సీడ్ హినా అకెచితో ఆడనుంది.పురుషుల సింగిల్స్‌లో భారత ఆశలు మోస్తున్న సీనియర్ షట్లర్ హెచ్ఎస్ ప్రణయ్.. 15-21, 21-23తో యొ టె బిన్ (సౌత్ కొరియా) చేతిలో ఓడి తొలిరౌండ్‌కే ఇంటిబాట పట్టాడు.

డబ్ల్యూపీఎల్ 2027:

తొలి మ్యాచ్‌లో ఆర్సీబీ, ముంబై ఢీ..



మహిళల ప్రీమియర్ లీగ్ (డబ్ల్యూ) ఐదో సీజన్‌కు రంగం సిద్ధమైంది. క్రికెట్ అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్న ఈ టోర్నమెంట్ షెడ్యూల్‌ను నిర్వాహకులు ప్రకటించారు. జనవరి 14 నుంచి ఫిబ్రవరి 7 వరకు ఈ మెగా ఈవెంట్ జరగనుంది. వడోదర వేదికగా జరిగే తొలి మ్యాచ్‌లోనే డిఫెండింగ్ ఛాంపియన్ రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు (=జదీ), రెండుసార్లు విజేతగా నిలిచిన ముంబై ఇండియన్స్ (వీ×) జట్లు తలపడనున్నాయి.ఈ సీజన్‌లోని మొత్తం 22 మ్యాచ్‌లకు వడోదరలోని బీసీఏ స్టేడియం, ముంబైలోని బ్రబౌర్న్ స్టేడియం సమానంగా ఆతిథ్యం ఇవ్వనున్నాయి. ఈ రెండు వేదికలకు డబ్ల్యూపీఎల్ నిర్వహణలో మంచి అనుభవం ఉంది. గతంలో 2023, 2025 సీజన్లలో బ్రబౌర్న్ స్టేడియం మ్యాచ్‌లకు వేదిక కాగా, 2025, 2026 సీజన్లలో వడోదర స్టేడియంలో మ్యాచ్‌లు జరిగాయి. గతేడాది ఆర్సీబీ ఛాంపియన్‌గా నిలిచిన ఫైనల్ మ్యాచ్ వడోదరలోనే జరిగింది. విశేషమేమిటంటే, డబ్ల్యూపీఎల్ ఫైనల్ ముగిసిన వారం తర్వాత, ఫిబ్రవరి 14 నుంచి 28 వరకు జరిగే తొలి ఐసీసీ మహిళల ఛాంపియన్స్ ట్రోఫీకి కూడా ఈ రెండు మైదానాలే ఆతిథ్యం ఇవ్వబోతున్నాయి.టోర్నమెంట్‌లో తొలి 11 మ్యాచ్‌లు జనవరి 14 నుంచి 24 వరకు వడోదరలో జరుగుతాయి. ఆ తర్వాత జనవరి 25న విరామం ఇచ్చి, మిగిలిన 9 లీగ్ మ్యాచ్‌లు, ప్లేఆఫ్స్ ముంబైలోని బ్రబౌర్న్ స్టేడియంలో నిర్వహిస్తారు. ముంబైలో జనవరి 26 నుంచి ఫిబ్రవరి 3 వరకు లీగ్ మ్యాచ్‌లు జరుగుతాయి. ప్రతి జట్టు మిగిలిన నాలుగు జట్లతో రెండేసి సార్లు తలపడుతుంది.పాయింట్ల పట్టికలో అగ్రస్థానంలో నిలిచిన జట్టు నేరుగా ఫైనల్‌కు అర్హత సాధిస్తుంది. రెండు, మూడు స్థానాల్లో నిలిచిన జట్ల మధ్య ఫిబ్రవరి 5న ఎలిమినేటర్ మ్యాచ్ జరుగుతుంది. ఇందులో గెలిచిన జట్టు ఫిబ్రవరి 7న జరిగే ఫైనల్‌లో అగ్రశ్రేణి జట్టుతో తలపడుతుంది. ఈ సీజన్‌లోని అన్ని మ్యాచ్‌లు, ప్లేఆఫ్స్‌తో సహా, రాత్రి 7:30 గంటలకు ప్రారంభమవుతాయి. మధ్యాహ్నం మ్యాచ్‌లు ఏవీ లేవు.



నా ఫేవరెట్ కెప్టెన్లు ఆ ఇద్దరే..

నా కెప్టెన్సీ మాత్రం కష్టకాలంలో గడిచింది: సచిన్

-గంగూలీ, ధోనీ తన ఫేవరెట్ కెప్టెన్లని చెప్పిన సచిన్

-తన కెప్టెన్సీ సమయంలో జట్టును ఎంచుకునే స్వేచ్ఛ ఉండేది కాదన్న మాస్టర్

-90వ దశకంలో భారత క్రికెట్ చీకటి రోజుల్లో ఉందని వ్యాఖ్య

-దక్షిణాఫ్రికా కెప్టెన్ టెంబా బవుమాపై ప్రశంసల వర్షం

-2007లో కెప్టెన్సీని నిరాకరించడంతోనే ధోనీకి బాధ్యతలు దక్కాయని వెల్లడి

భారత క్రికెట్ దిగ్గజం, మాస్టర్ బ్లాస్టర్ సచిన్ టెండూల్కర్ తన సుదీర్ఘ కెరీర్‌లో అత్యంత ఇష్టమైన కెప్టెన్ల పేర్లను వెల్లడించాడు. ఎందరో సారథుల కింద ఆడినప్పటికీ, సౌరవ్ గంగూలీ, మహేంద్ర సింగ్ ధోనీలే తన దృష్టిలో అత్యుత్తమ కెప్టెన్లని స్పష్టం చేశాడు. ఇటీవల అభిమానులతో జరిగిన ఒక ప్రశ్నోత్తరాల కార్యక్రమంలో సచిన్ ఈ ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు.“మీరు ఆడిన వారిలో వ్యక్తిగతంగా మీకు ఇష్టమైన కెప్టెన్ ఎవరు?” అని ఒక అభిమాని అడిగిన ప్రశ్నకు సచిన్ బదులిచ్చాడు. “నాకు ఇష్టమైన కెప్టెన్ల విషయానికొస్తే, సౌరవ్ గంగూలీ, ఎంఎస్ ధోనీ కచ్చితంగా నా జాబితాలో అగ్రస్థానంలో ఉంటారు” అని తెలిపాడు. గంగూలీ కెప్టెన్సీలో సచిన్ 2003 ప్రపంచకప్ ఫైనల్ ఆడగా, ధోనీ సారథ్యంలో 2011లో ప్రపంచకప్ గెలిచిన జట్టులో సభ్యుడిగా ఉన్నాడు.ఈ సందర్భంగా తన కెప్టెన్సీ అనుభవాలను కూడా సచిన్ గుర్తుచేసుకున్నాడు. “భారత జట్టుకు కెప్టెన్‌గా వ్యవహరించడం గొప్ప గౌరవం. అయితే, ఆ సమయంలో నాకు పూర్తి స్వేచ్ఛ ఉండేది కాదు. నాకు నచ్చిన జట్టును పూర్తిగా ఎంచుకునే అవకాశం ఎప్పుడూ లేదు. 1990లలో ఉన్నదానికంటే బీసీసీఐ ఇప్పుడు చాలా ప్రొఫెషనల్‌గా మారింది. ఆ కాలంలో భారత క్రికెట్ చాలా చీకటి దశను చూసింది” అని వివరించాడు.ఇదే సమయంలో, దక్షిణాఫ్రికా కెప్టెన్ టెంబా బవుమాపై సచిన్ ప్రశంసలు కురిపించాడు. “బవుమా స్ఫూర్తిని నేను ఎంతో ఆరాధిస్తాను. అతను జట్టును ముందుండి నడిపించి, దక్షిణాఫ్రికా క్రికెట్‌కు అద్భుతమైన ఫలితాలను అందించాడు. దక్షిణాఫ్రికా ఐసీసీ టైటిల్ గెలవడం ప్రపంచ క్రికెట్‌కు ఎంతో మంచిది” అని కొనియాడాడు.సచిన్ 1996 నుంచి 2000 మధ్య రెండుసార్లు భారత టెస్టు జట్టుకు కెప్టెన్‌గా 25 మ్యాచ్‌లలో బాధ్యతలు నిర్వర్తించాడు. 2000 మార్చిలో దక్షిణాఫ్రికాతో స్వదేశంలో సిరీస్ ఓటమి తర్వాత కెప్టెన్సీ నుంచి తప్పుకున్నాడు.



రజనీకాంత్ 'ధర్మన్'లో శ్రీలీల!

సూపర్‌స్టార్ రజనీకాంత్ ప్రధాన పాత్రలో తెరకెక్కుతున్న ప్రతిష్టాత్మక చిత్రం 'ధర్మన్'. యువ దర్శకుడు అశ్వత్ మారిముత్తు ఈ సినిమాకు దర్శకత్వం వహిస్తుండగా లెజెండరీ నటుడు కమల్ హాసన్‌కు చెందిన 'రాజ్ కమల్ ఫిల్మ్స్ ఇంటర్నేషనల్' మరియు 'టర్మరిక్ మీడియా' బ్యానర్లు సంయుక్తంగా ఈ భారీ బడ్జెట్ చిత్రాన్ని నిర్మిస్తున్నాయి.కొద్దికాలంగా సోషల్ మీడియాలోనూ, సినీ వర్గాలలోనూ శ్రీలీల ఈ చిత్రంలో నటిస్తారనే వార్తలు జోరుగా ప్రచారంలో ఉన్నాయి. తాజాగా మేకర్స్ ఈ ఊహాగానాలన్నింటికీ తెరదించుతూ అధికారిక ప్రకటన విడుదల చేశారు. సోషల్ మీడియా వేదికగా ఓ ప్రత్యేక వీడియోను పంచుకుంటూ.. టాలెంటెడ్ నటి శ్రీలీల 'ధర్మన్' చిత్రంలో భాగం కాబోతున్నట్లు స్పష్టం చేశారు.ఈ చిత్రంలో రజనీకాంత్ ఇప్పటివరకు చూడని విభిన్నమైన పాత్రలో వైద్యుడిగా (డాక్టర్) కనిపించనున్నట్లు తెలుస్తోంది. కేవలం రజనీకాంత్ మాత్రమే కాకుండా, ఈ సినిమాలో ఎంపిక చేసిన తారాగణం కూడా చాలా ప్రత్యేకంగా ఉంది. రామ్ పోతినేని, గ్లామరస్ నటి సిమ్రాన్, రాశీఖన్నా, స్టార్ హీరోయిన్ నయనతార, కమెడియన్ యోగిబాబు తదితరులు ఈ చిత్రంలో కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఇంతమంది స్టార్స్ ఒకే సినిమాలో నటిస్తుండటంతో సినిమాపై అంచనాలు తారాస్థాయికి చేరాయి.

మనసును కదిలించే భావోద్వేగాల ప్రయాణం..
ఓటీటీలోకి మనోజ్ బాజ్‌పాయ్ 'లాస్ట్ మ్యాన్ ఇన్ టవర్'



మారుతున్న ఆధునిక నగరాలు, వేగవంతమైన పట్టణీకరణ నేపథ్యంలో మానవ సంబంధాల సంక్లిష్టతలను, జ్ఞాపకాలకు ఇచ్చే విలువను అత్యంత సహజంగా ఆవిష్కరిస్తూ తెరకెక్కిన అద్భుతమైన భావోద్వేగ చిత్రమే 'లాస్ట్ మ్యాన్ ఇన్ టవర్'. ప్రఖ్యాత నటులు మనోజ్ బాజ్‌పాయ్, బోమన్ ఇరానీ, దివ్య దత్తా ప్రధాన పాత్రల్లో నటించిన ఈ విభిన్నమైన చిత్రం ప్రముఖ ఓటీటీ వేదిక జీ5లో నవంబర్ 6 నుంచి ప్రేక్షకుల ముందుకు రానుంది. ప్రముఖ రచయిత అరవింద్ అడిగా రాసిన ఇదే పేరుతో ఉన్న ప్రసిద్ధ నవల ఆధారంగా తెరకెక్కిన ఈ చిత్రానికి బెన్ రేఖి దర్శకత్వం వహించగా, టాలీవుడ్ ప్రముఖ నిర్మాత రానా దగ్గుబాటి నిర్మాణ సంస్థ స్పిరిట్ మీడియా అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్మించింది. ఈ చిత్రానికి సూనీ తారాపోరేవాలా స్క్రిప్ట్ అందించడం విశేషం.ముంబై నగరంలోని ఓ పాత హౌసింగ్ సొసైటీ రీడెవలప్‌మెంట్ నేపథ్యంలో సాగే ఈ కథ, ఒక వ్యక్తి తన ఇంటి కోసం, గతంతో ఉన్న అనుబంధం కోసం చేసే ఒంటరి పోరాటం చుట్టూ తిరుగుతుంది. ముంబైలోని పిరమిడ్ హౌసింగ్ సొసైటీలో యోగేశ్ మిశ్రా అనే రిటైర్డ్ ఫిజిక్స్ టీచర్‌గా మనోజ్ బాజ్‌పాయ్ కనిపించనున్నారు. ఆ భవనాన్ని పునర్నిర్మించేందుకు (రీడెవలప్‌మెంట్) డెవలపర్ ధర్మేన్ షా పాత్రలో బోమన్ ఇరానీ భారీ మొత్తంలో డబ్బును ఆఫర్ చేసినప్పటికీ, తనకు ఎంతో ఇష్టమైన ఇంటిని, అక్కడి మనుషుల మధ్య ఉన్న ఆత్మీయతను వదులుకోవడానికి యోగేశ్ మిశ్రా అంగీకరించడు. ఈ ఒప్పందం వల్ల తమకు మెరుగైన భవిష్యత్తు ఉంటుందని భావించే ఆ అపార్ట్‌మెంట్‌లోని మిగతా వారంతా ఈ రీడెవలప్‌మెంట్‌కు సంసిద్ధులవుతారు. కానీ, యోగేశ్ మాత్రం ఇందుకు ఒప్పుకోకపోవడంతో సొసైటీలో తీవ్రమైన వివాదం రాజుకుంటుంది.ఈ సంఘర్షణలో తన కుమారుడికి మంచి భవిష్యత్తును అందించాలని తపించే గృహిణి సంగీత పురి పాత్రలో దివ్య దత్తా నటించగా, ఆమె ఆశయమే యోగేశ్‌కు వ్యతిరేకంగా నిలబడేలా చేస్తుంది. ఒకప్పుడు ఎంతో సన్నిహితంగా ఉన్న స్నేహితులే, తమ ఆశలకు అడ్డుపడుతున్నాడని భావించి యోగేశ్‌ను దూరం పెట్టడం, సమాజంలో ఒక వ్యక్తి నమ్మకాలు అందరి ఆశయాలకు ఎదురునిలిచినప్పుడు ఎదురయ్యే ఒంటరితనాన్ని ఈ చిత్రంలో అత్యంత శక్తివంతంగా చూపించారు. ఈ సందర్భంగా దర్శకుడు బెన్ రేఖి మాట్లాడుతూ.. కష్టకాలంలో కుటుంబంతో, సమాజంతో మనకున్న అనుబంధాన్ని ఎలా కాపాడుకోవాలనే అంశాన్ని ఈ సినిమా చర్చిస్తుందని, కాలం గడిచేకొద్దీ ఈ కథ మరింత ప్రాధాన్యం సంతరించుకుంటోందని తెలిపారు.నటుడు మనోజ్ బాజ్‌పాయ్ మాట్లాడుతూ.. యోగేశ్ మిశ్రా పాత్రలోని సంక్లిష్టత, మొండితనం, జ్ఞాపకాలపై ఉండే గాఢమైన అనుబంధం నన్ను ఎంతగానో ఆకట్టుకున్నాయని, ఇల్లు అంటే కేవలం నాలుగు గోడలు కాదనే విషయాన్ని ఈ చిత్రం గుర్తుచేస్తుందని పేర్కొన్నారు. నటి దివ్య దత్తా మాట్లాడుతూ.. పాత్రల ప్రవర్తనను కేవలం మంచి, చెడుగా కాకుండా వారి పరిస్థితుల ఆధారంగా సహజంగా చూపించామని, ఈ సినిమాలోని సంఘర్షణ ప్రతి ఒక్కరికీ కనెక్ట్ అవుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. నిర్మాత రానా దగ్గుబాటి మాట్లాడుతూ.. మనుషులు తాము తీసుకునే నిర్ణయాలు, దేనిని వదులుకోవడానికి ఇష్టపడరు అనే అంశాల చుట్టూ సాగే ఈ మానవీయ కథలో ప్రధాన తారాగణం అద్భుతమైన నటన కనబరిచిందని కొనియాడారు. మధ్యతరగతి ప్రజల ఆశలు, ఆకాంక్షలు, జ్ఞాపకాలకు విలువనిచ్చే ఈ ప్రత్యేకమైన సినిమా నవంబర్ 6 నుంచి హిందీతో పాటు పలు భాషల్లో జీ5లో స్ట్రీమింగ్ కానుండటంతో ప్రేక్షకుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి.

చిన్ననాటి జ్ఞాపకాల్లోకి తీసుకెళ్లే 'సమ్మర్ హాలిడేస్'..
ఘనంగా ప్రీ రిలీజ్ వేడుక

-పెద్దలు కూడా పిల్లల్లా ఎంజాయ్ చేసే సినిమా ఇదన్న కిరణ్ అబ్బవరం
-ఘనంగా జరిగిన ప్రీ రిలీజ్ వేడుకకు హాజరైన అల్లు అరవింద్, బాబీ
-చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తుచేసే అందమైన కథతో రూపకల్పన
-ఇది పిల్లల సినిమా కాదు, పెద్దల చిత్రమన్న నిర్మాత ధీరజ్ మొగిలినేని
-నవంబర్ 6న థియేటర్లలోకి రానున్న ఫ్యామిలీ ఎంటర్‌టైనర్



విభిన్నమైన కథలతో విజయాలు అందుకుంటున్న నిర్మాత ధీరజ్ మొగిలినేని తన ధీరజ్ మొగిలినేని ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌పై నిర్మిస్తున్న చిత్రం 'సమ్మర్ హాలిడేస్'. శ్రీకర్ దర్శకత్వంలో మాస్టర్ రోహన్, మాస్టర్ అరుణ్, బేబీ ఖుషి ప్రధాన పాత్రల్లో తెరకెక్కిన ఈ చిత్రం నవంబర్ 6న థియేటర్లలో విడుదల కానుంది. ఈ నేపథ్యంలో హైదరాబాద్‌లో చిత్ర ప్రీ రిలీజ్ వేడుకను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ప్రముఖ నిర్మాత అల్లు అరవింద్, హీరో కిరణ్ అబ్బవరం, దర్శకుడు బాబీ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.ఈ సందర్భంగా హీరో కిరణ్ అబ్బవరం మాట్లాడుతూ, "ఈ సినిమా చూస్తున్నప్పుడు పెద్దలు కూడా తమ బాల్యంలోకి వెళ్లిపోయి పిల్లల్లా మారి ఎంజాయ్ చేస్తారు. ఈతరం పిల్లలు చాలా టాలెంట్‌తో, కాన్ఫిడెంట్‌గా ఉన్నారు. బిజీ లైఫ్‌లో మనం మర్చిపోయిన ఎన్నో జ్ఞాపకాలను, అమ్మమ్మ ఊరి అనుభూతులను ఈ సినిమా గుర్తు చేస్తుంది. ఇది చిన్న సినిమాగా అనిపించడం లేదు. నిర్మాత ధీరజ్ నమ్మకం నిజమై, ఈ చిత్రం పెద్ద విజయం సాధించాలి" అని ఆకాంక్షించారు.నిర్మాత అల్లు అరవింద్ మాట్లాడుతూ, "ధీరజ్ నాతో కలిసి పనిచేశాడు. గీతా ఆర్ట్స్ లాగే క్వాలిటీ విషయంలో రాజీ పడకుండా ఈ సినిమాను తీర్చిదిద్దాడని విన్నాను. ఇలాంటి మంచి చిత్రాలను కిరణ్ అబ్బవరం లాంటి హీరోలు సపోర్ట్ చేయడం అభినందనీయం. ఇది అందరికీ మంచి నోస్టాల్జిక్ అనుభూతినిస్తుంది" అని అన్నారు.సహజనటి జయసుధ మాట్లాడుతూ, "ఇది పిల్లల సినిమా కాదు, ఇద్దరు చిన్న హీరోలు నటించిన సినిమా. వేసవి సెలవుల చుట్టూ అల్లుకున్న ఈ కథ అందరికీ కనెక్ట్ అవుతుంది. పెద్ద నిర్మాతలు కూడా ఇలాంటి చిన్న చిత్రాలను ప్రోత్సహించాలి" అని సూచించారు.నిర్మాత ధీరజ్ మొగిలినేని మాట్లాడుతూ, "ఇది పిల్లలు నటించిన పెద్దల సినిమా. ఈ చిత్రం చూశాక ప్రతి ఒక్కరూ తమ చిన్ననాటి స్నేహితులకు ఫోన్ చేస్తారు. కుటుంబమంతా కలిసి చూసేలా, మన జ్ఞాపకాలను గుర్తుచేసేలా ఉంటుంది" అని తెలిపారు. దర్శకుడు బాబీ మాట్లాడుతూ, ఈ సినిమా వినోదంతో పాటు మంచి సందేశం ఇస్తుందని, పిల్లలతో సినిమా తీయడం అంత సులువు కాదని, దర్శకుడు శ్రీకర్‌ను అభినందించారు.


నాగార్జున సినిమాలో టబు విశ్వరూపం..
పుట్టినరోజున అదిరిపోయే సర్‌ప్రైజ్



--'కింగ్100'లో టబు ఫస్ట్‌లుక్ విడుదల
-మహంతి ఝాన్సీ రాణిగా టబు పరిచయం
-రాజకుటుంబ నేపథ్యంతో రాజకీయ నాయకురాలి పాత్ర
-అదృష్టాన్ని నమ్మేవారిని ద్వేషించే వ్యక్తిత్వం
-డిసెంబరు 24న ప్రపంచవ్యాప్తంగా సినిమా విడుదల

అక్కినేని నాగార్జున హీరోగా నటిస్తున్న 'కింగ్100' చిత్రంపై ఆసక్తి పెరుగుతోంది. తాజాగా ఈ సినిమాలో టబు పాత్రను పరిచయం చేస్తూ చిత్రబృందం ఆమె ఫస్ట్‌లుక్ పోస్టర్‌ను విడుదల చేసింది. పుట్టినరోజు సందర్భంగా టబుకు శుభాకాంక్షలు తెలుపుతూ.. 'మహంతి ఝాన్సీ రాణి'గా ఆమెను పరిచయం చేసింది. రాజసం, రాజకీయ నేపథ్యం, గంభీరమైన వ్యక్తిత్వంతో ఈ పాత్ర ఉండబోతున్నట్లు గ్లింప్స్ ద్వారా తెలుస్తోంది.ఈ సినిమాలో టబు పాత్రకు సంబంధించిన గ్లింప్స్ ఆసక్తికరంగా ఉంది. ప్రపంచంలో రెండు రకాల మనుషులుంటారని ఆమె పాత్ర నమ్ముతుంది. ఒకరు కష్టాన్ని నమ్మేవారు.. మరొకరు అదృష్టాన్ని నమ్మేవారు. అయితే అదృష్టాన్ని నమ్మే వ్యక్తులంటే మహంతి ఝాన్సీ రాణికి అస్సలు పడదని ఈ వీడియోలో చూపించారు. ఆమె రాజకుటుంబానికి చెందిన వ్యక్తిగా, రాజకీయాల్లో కీలక పాత్ర పోషించే నాయకురాలిగా కనిపించనుంది.నాగార్జున పుట్టినరోజు సందర్భంగా ఈ ఏడాది ఆగస్టులో 'కింగ్100' టైటిల్‌ను చిత్రబృందం ప్రకటించింది. అప్పుడే సినిమా విడుదల తేదీని కూడా వెల్లడించింది. డిసెంబరు 24న ప్రపంచవ్యాప్తంగా ప్రేక్షకుల ముందుకు తీసుకురానున్నారు. ఆ సందర్భంగా విడుదల చేసిన తొలి గ్లింప్స్‌లో నాగార్జున స్టైలిష్, హుందా లుక్‌లో కనిపించాడు.డబ్బున్నవారు, డబ్బులేనివారు.. ప్రపంచంలో మనుషులు రెండే రకాలుగా ఉంటారని నాగార్జున తన పాత్ర ద్వారా చెప్పిన డైలాగ్ ఆకట్టుకుంది. డబ్బులేనప్పుడు తనను ఓడిపోయిన వ్యక్తిగా చూశారని, డబ్బు వచ్చాక రాజుగా గుర్తించారని ఆయన చెప్పే మాటలు పాత్ర స్వభావాన్ని తెలియజేశాయి. అయితే డబ్బు కంటే తన గుర్తింపే శక్తిమంతమైనదని, దాన్ని నిలబెట్టుకోవడానికి నిరంతరం పరుగెత్తాల్సి ఉంటుందని చెప్పే డైలాగ్ సినిమాపై అంచనాలు పెంచింది.ఆర్.ఏ. కార్తీక్ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని అన్నపూర్ణ స్టూడియోస్ నిర్మిస్తోంది. దేవిశ్రీ ప్రసాద్ సంగీతం అందిస్తున్నాడు. రాజా మహదేవన్ ఛాయాగ్రహణం, నవీన్ నూలి ఎడిటింగ్ బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. వెండితెరపై నాగార్జున, టబు పాత్రలు ఎలా సందడి చేస్తాయో చూడాలంటే డిసెంబరు 24 వరకు వేచి చూడాల్సిందే.

గాయకుడిగా సల్మాన్..
'తేరి సెక్సీ బ్యూటీ' సాంగ్ రిలీజ్



-మరోసారి గాయకుడిగా మారిన సల్మాన్ ఖాన్
-'మాతృభూమి' చిత్రం నుంచి 'తేరి సెక్సీ బ్యూటీ' పాట విడుదల
-సల్మాన్‌తో కలిసి పాడిన గాయని ముస్కాన్
-హిమేశ్ రేషమియా, సాజిద్ ఖాన్ సంగీతం
-సోషల్ మీడియాలో ఆసక్తికర పోస్ట్‌తో పాటను పంచుకున్న సల్మాన్

బాలీవుడ్ స్టార్ హీరో సల్మాన్ ఖాన్ మరోసారి గాయకుడిగా అలరించేందుకు సిద్ధమయ్యాడు. ఆయన కథానాయకుడిగా నటిస్తున్న తాజా చిత్రం 'మాతృభూమి' నుంచి "తేరి సెక్సీ బ్యూటీ" అనే పాటను తాజాగా విడుదల చేశారు. విశేషమేమిటంటే, ఈ పాటను సల్మాన్ ఖాన్ స్వయంగా ఆలపించాడు. "యుద్ధం శాంతితో నిద్రపోవుగాక" (మీఎ ఘుతీ తీవర్ అఅ జూఘుఎవ) అనేది ఈ సినిమా ట్యాగ్‌లైన్‌గా ఉంది.ఈ గీతాన్ని సల్మాన్‌తో కలిసి గాయని ముస్కాన్ పాడారు. హిమేష్ రేషమియా స్వరాలు సమకూర్చగా, సాజిద్ ఖాన్ సంగీతం అందించడంతో పాటు సాహిత్యాన్ని అందించారు. ప్రముఖ కొరియోగ్రాఫర్ సీజర్ గోన్సాల్వెస్ ఈ పాటకు నృత్యరీతులను సమకూర్చారు. ఈ పాట విడుదల విషయాన్ని సల్మాన్ సోషల్ మీడియా వేదికగా అభిమానులతో పంచుకున్నారు. రికార్డింగ్ స్టూడియోలో ఉన్న ఒక వీడియో క్లిప్‌ను జత చేస్తూ.. "ఉదయం 5:12 గంటలకు బయలుదేరే సమయం.. ఫ్లైట్ టైమ్‌కే ఉంది. రెండు పెగ్గులు వేశాక నా సెక్సీ బ్యూటీతో టేకాఫ్ అవుతున్నా.. ఎక్కడ ల్యాండ్ అవుతానో తెలియదు" అంటూ ఆసక్తికరమైన క్యాప్షన్ రాశారు. హెడ్‌ఫోన్స్ పెట్టుకుని నవ్వుతున్న సల్మాన్ ప్రమోషనల్ పోస్టర్ సైతం ప్రస్తుతం నెట్టింట ఆకట్టుకుంటోంది.సల్మాన్ ఖాన్ పాటలు పాడటం ఇదే మొదటిసారి కాదు. గతంలో 'వాంటెడ్', 'కిక్', 'సుల్తాన్',

Printed & published owned by K.SRAVAN KUMAR. Printed Published RK PRINTING PRESS at 6-1-948 Boyawada Street Nalgonda.Pin : 508001. Head office: 2-66-121/122 near ramky one Marvel gajullaramaram Quthbulapur medchal Malkajgiri district. RNI.NO.APTEL/2009/29433.(CELL) 9866330400 prajaveekshanam@gmail.com